అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 24-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 114 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

ప్రధానమంత్రా మతోన్మాదా..!



మోడీ చట్టాలకు అతీతుడా...?

- ఆయన నుంచి ఆ మాటలు ఊహించలేదు
- ఆ పదవికి అనర్హుడు
- చర్యలు చేపట్టడంలో ఈసీ విఫలం : సీపీఐ(ఎం) నేత బృందా కరత్

తిరువనంతపురం : రాజస్థాన్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రకటన దిగ్భ్రాంతి కలిగించిందని సీపీఐ (ఎం) నేత బృందా కరత్ తెలిపారు. మోడీ వ్యాఖ్యల విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టని ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను ఆమె ప్రశ్నించారు. మతపరమైన శతృత్వాన్ని ప్రేరేపించడం, విద్వేష ప్రసంగం చేయడం వంటి చర్యలకు భారతీయ చట్టాలు వ్యతిరేకమని అంటూ మోడీ మాటలు ఆ చట్టాలను ఉల్లంఘించేలా ఉన్నాయని చెప్పారు. అయినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందని విమర్శించారు. 'ప్రధానమంత్రి దేశ పౌరుడు. ఆయన దేశంలోని ఇతర పౌరుల కంటే ఎక్కువేమీ కాదు. దేశ చట్టాలకు అతీతుడు కూడా కాదు. భారత చట్టాలను ప్రధాని అంగీకరించాల్సి ఉంటుంది. మతాల మధ్య శతృత్వాన్ని పెంచడాన్ని మన చట్టాలు వ్యతిరేకిస్తున్నాయి. మతాల మధ్య విద్వేషాలను వ్యాపింపజేయడాన్ని కూడా అవి వ్యతిరేకిస్తున్నాయి. అలాంటి చట్టాలను ప్రధానమంత్రి ఉల్లంఘించినప్పుడు ఆయనపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది' అని తిరువనంతపురంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో...13లో

దేశం కోసం మా అమ్మ తాళినే త్యాగం చేసింది



మోడీకి ప్రియాంక ఘాటు సమాధానం

న్యూఢిల్లీ : దేశం కోసం మా అమ్మ మంగళసూత్రాన్నే త్యాగం చేసిందంటూ ప్రధాని మోడీకి ప్రియాంక గాంధీ ఘాటుగా సమాధానం ఇచ్చారు. కర్నాటక రాజధాని బెంగళూరులో జరిగిన బహిరంగ సభలో...6లో



కేజ్రీవాల్, కవితలకు కస్టడీ

పొడిగింపు

14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ఎక్సైజ్ స్కాంకు చెందిన మనీలాండరింగ్ కేసులో తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని మే 7 వరకూ 14 రోజుల పాటు రౌస్ అవెన్యూ కోర్టు పొడిగించింది. ఆయనతో పాటు ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. కవిత, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున గోవా ఎన్నికల్లో ఫండ్ మేనేజర్‌గా వ్యవహరించిన చంద్రప్రీత్ సింగ్‌ల జ్యుడీషియల్ కస్టడీని కూడా మే 7 వరకూ పొడిగించింది. మంగళవారంతో వీరి కస్టడీ ముగియడంతో వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా సీబీఐ ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ముందు హాజరుపర్చారు. మరో 14 రోజులు కస్టడీకి ఇవ్వాలని దర్యాప్తు సంస్థలు కోరడంతో కోర్టు అనుమతించింది.

కేజ్రీవాల్‌లో స్వల్ప మోతాదులో ఇన్సులిన్

జైలులో కేజ్రీవాల్‌కు షుగర్ లెవెల్స్...13లో

కవితను అరెస్ట్ చేయం అని ఎప్పుడూ చెప్పలేదు



- ట్రయల్ కోర్టు ముందు ఈడీ వాదనలు
- నిబంధల ప్రకారమే ఆమెను అరెస్ట్ చేశాం 13లో..
- బెయిల్ పిటిషన్ పై తదుపరి విచారణ వాయిదా

రుణమాఫీ చేస్తా..

బీఆర్ఎస్‌ను రద్దు చేసుకుంటారా?



కేసీఆర్, హరీశ్‌రావుకు సీఎం రేవంత్ సవాల్

- పాలమూరు ప్రాజెక్టులను పూర్తిచేసే బాధ్యత మాది
- డీకే అరుణతో మాకెలాంటి పోటీ లేదు
- బీజేపీ నేతలకు పిచ్చిపట్టింది..మోడీ వల్ల తెలంగాణకు ఉపయోగం లేదు :నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కాంగ్రెస్ సభల్లో సీఎం



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

'జోగులాంబ సాక్షిగా మాట ఇస్తున్నా.. చెప్పిన మాట ప్రకారం ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాం.. రైతులెవరూ అధైర్యపడొద్దు. బ్యాంకులు రైతులను ఇబ్బంది పెట్టొద్దు. రుణమాఫీ చేసే బాధ్యత నాది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గడువులోపు రుణమాఫీ చేస్తే బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?.. అని కేసీఆర్, హరీశ్‌రావులకు రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. పదేండ్లు అధికారంలో ఉన్నా ఇచ్చిన హామీలను కేసీఆర్ నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ చేసిన అప్పులకు తాము ఇప్పటికే రూ.24 వేల కోట్లు వడ్డీ కట్టామన్నారు. కాంగ్రెస్‌పార్టీ పూర్తికాలం అధికారంలో ఉంటుందని, ఐదేండ్లలో పాలమూరు-రంగారెడ్డితో పాటు తుమ్మిళ్ల, కేఎల్ఐ, కొడంగల్ నారాయణపేట ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామని తెలిపారు. మంగళవారం నారాయణపేట జిల్లా మద్దూరు, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిల్లో నిర్వహించిన కాంగ్రెస్ సభల్లో సీఎం రేవంత్ ప్రసంగించారు. 'పాలమూరు బిడ్డకు బూర్గుల రామకృష్ణారావు తర్వాత 70 ఏండ్లకు ముఖ్యమంత్రిగా అవకాశమొచ్చింది. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొని రాజకీయాలకు అతీతంగా సలహాలు సూచనలు ఇచ్చి జిల్లాను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు...13లో

కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్య శక్తుల బలంతో మల్లు గెలుపు

నాగర్ కర్నూల్‌లో కమ్యూనిస్టులు, ప్రజాస్వామ్య శక్తుల బలంతో మల్లు రవి గెలవడం ఖాయమని సీఎం అన్నారు. 120 రోజుల కాలంలోనే ఇచ్చిన ఆరు హామీలలో ఐదు హామీలను నెరవేర్చి ప్రజల దీవెనలు పొందుతున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రెండు లక్షల రుణమాఫీ, రాజీవ్ ఆరోగ్య బీమా తదితర అనేక కార్యక్రమాలు అమలు చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశీర్వదించి.. రెండు పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మెఘా రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాయకులు రాజేష్‌రెడ్డి, రవీందర్ నాయక్, సతీష్ మాదిగ సరిత, తిరుపతయ్య, ఓబేదుల కొత్వాల్, మన్నెమ్మ పాల్గొన్నారు.

నేడే ఇంటర్ ఫలితాలు

11 గంటలకు విడుదల చేయనున్న విద్యాశాఖ కార్యదర్శి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ వార్షిక పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. అదేరోజు ఉదయం 11 గంటలకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఈ ఫలితాలను విడుదల చేస్తారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఈ ఫలితాలు https://tsbie.cgg.gov.in లేదా http://results.cgg.gov.in వెబ్‌సైట్లలో...13లో

నేటినుంచి బడులకు వేసవి సెలవులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలలకు బుధవారం నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులుంటాయి. జూన్ 12న తరగతులు పునఃప్రారంభమ వుతాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఎలాంటి తరగతులను నిర్వహించొద్దని పాఠశాలల యాజమాన్యాలను విద్యాశాఖ ఆదేశించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

కదిలిస్తూ..కలిసి ముచ్చటిస్తూ..

ప్రజలతో మమేకమవుతున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్

ఉపాధి హామీ చట్టం రద్దుకు మోడీ కుట్ర



నకిరేకల్‌లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

నవతెలంగాణ -నకిరేకల్/ తుంగతుర్తి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న ప్రజా గొంతుక భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అన్నారు. జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మంగళవారం నాగయ్య, సీపీఐ(ఎం) రాష్ట్ర...3లో

రాముడిని మొక్కాలి..బీజేపీని తొక్కాలి

వందరోజుల అబద్ధం..పదేండ్ల అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలి



- చేవెళ్ల గడ్డపై బీసీకి మొదటిసారి అవకాశం వచ్చింది
- చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో కేటీఆర్

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాముడు.. బీజేపీ, మోడీ సొత్తు కాదని.. అందరివాడని, బీజేపీ ఓడిపోతే రాముడికి ఏమీ కాదని, శ్రీ రాముడిని మొక్కాలి.. బీజేపీని తొక్కాలని.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్.. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌తో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు వందరోజుల కాంగ్రెస్ అబద్ధపు పాలనను.. పదేండ్ల బీఆర్ఎస్ అభివృద్ధి పాలన చూసి ఓట్లు వేయాలన్నారు. అరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని చెప్పారు. ఆడబిడ్డలకు ఇస్తామన్న రూ. 2500...3లో

మాడు మండుతోంది

మళ్లీ 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



- కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మళ్లీ 45 డిగ్రీలు దాటాయి. నల్లగొండ జిల్లా టీక్యాతండాలో అత్యధికంగా 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదైంది. ఉక్కపోత తీవ్రత కూడా పెరిగింది. బుధ, గురువారాల్లో పలు చోట్ల పగటి పూట ఉష్ణోగ్రతలు మరింత పెరిగే...13లో

మీ వ్యాపార ప్రకటనల కన్నా పెద్దవా..!



క్షమాపణ ప్రకటనలపై రామ్‌దేవ్, పతంజలికి సుప్రీం ప్రశ్నలు

కేంద్రానికి మొట్టికాయలు

న్యూఢిల్లీ : క్షమాపణలు చెబుతూ న్యూస్ పేపర్లల్లో ఇచ్చిన ప్రకటనలు, గతంలో ఇచ్చిన ఫ్రంట్ పేజీల ప్రకటనల కంటే పెద్దవా.. ఖరీదైనవా అని పతంజలి ఆయుర్వేద్ సంస్థను, దాని సహ-వ్యవస్థాపకులు, యోగా గురు బాబా రామ్‌దేవ్‌ను సుప్రీంకోర్టు మంగళవారం...13లో



కరువు సహాయక నిధులపై నిర్లక్ష్యం

కేంద్రం వైఖరికి కర్నాటక సీఎం నిరసన

బెంగళూరులో బైటాయించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

యశ్వంత్‌పురా : కేంద్రం ఇచ్చిన కరువు సహాయక నిధులపై సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలువురు కాంగ్రెస్ నేతలు బెంగళూరులో మంగళవారం నిరసన తెలిపారు. కేంద్రం సవతి తల్లిలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ తరపున కేంద్రం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపామన్నారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, కర్నాటక రైతులను ద్వేషిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 223 తాలూకాల్లో కరువు తాండవిస్తోందన్నారు. సెప్టెంబర్ 22న కేంద్ర ప్రభుత్వానికి మెమోరాండం ఇచ్చామని.. ఆ తర్వాత కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చి పరిశీలించి వెళ్లిందన్నారు. కానీ అమిత్‌షా చెన్నపట్నం వచ్చి ప్రభుత్వం ఆలస్యంగా మెమోరాండం ఇచ్చిందని చెప్పారని మండిపడ్డారు. కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. ఇప్పటి వరకు రైతులకు రూ.650 కోట్లు పంపిణీ చేశామన్నారు. నిర్మలా సీతారామన్, నరేంద్ర...13లో



మోడీ మాటల్లో నిజమెంత..?

పదేండ్లలో తగ్గిన ముస్లిం జనాభా

మన్మోహన్ సింగ్ చెప్పింది ఒకటి మోడీ ఆరోపించేది మరొకటి

న్యూఢిల్లీ : ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్‌లో ఆదివారం ప్రధానమంత్రి మోడీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దేశంలో ముస్లింలు అధిక సంఖ్యలో పిల్లలను కలిగి ఉన్నారు అని మోడీ ఆరోపించారు. అలాగే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలోని వ్యక్తిగత సంపదను ముస్లింలకు పంపిణీ చేస్తుందని ఆరోపించారు. 2024 కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఈ మేరకు వాగ్దానం చేశారని మోడీ తెలిపారు.



సంపద అసమానతలను ప్రస్తావిస్తూ మ్యానిఫెస్టోలో ప్రస్తావించిన వివిధ అంశాలను కలుపుతూ మోడీ ఈ ఆరోపణలు చేశారు. అలాగే 'దేశ వనరులపై ముస్లింలకే మొదటి హక్కు' అని 2006లో అప్పటి ప్రధానమంత్రి, కాంగ్రెస్ నాయకులు మన్మోహన్ సింగ్ చెప్పారని మోడీ ఆరోపించారు. అయితే మోడీ ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదు. ముఖ్యంగా దేశంలో ముస్లిం జనాభా...6లో

ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్‌పై ఈసీ వేటు

- విజయవాడ పోలీస్ కమిషనర్‌పై కూడా
- తక్షణమే బాధ్యతల నుంచి వైదొలగాలని ఆదేశం

అమరావతి : ఏపీలో ప్రచారపర్వం హోరాహోరీగా సాగుతున్న వేళ ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులుపై బదిలీ వేటు వేసింది. ఆయనతో పాటు విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణాను కూడా బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వీరిని తక్షణమే బదిలీ చేయడంతో పాటు సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఎన్నికలతో సంబంధం లేని విధులు అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. వీరి స్థానాల్లో కొత్త వారి నియామకం కోసం గత ఐదేండ్లలో ఎటువంటి విజిలెన్స్ కేసులు లేని ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను ఒక్కో పోస్టుకు నేటి (బుధవారం) మధ్యాహ్నం 3గంటల్లోగా పంపాలని ఉత్తర్వులలో పేర్కొంది. బదిలీ అయిన అధికారులు విధుల నుంచి తప్పుకునే సమయంలో తమ దిగువ ర్యాంకు అధికారులకు బాధ్యతలు అప్పగించాలని ఈసీ ఆదేశించింది. రాష్ట్రంలో ఇప్పటికే గుంటూరు ఐజి పాలరాజుతో పాటు పరమేశ్వరరెడ్డి(ఒంగోలు), వై.రవి శంకర్‌రెడ్డి(పల్నాడు), పి.జాషువా(చిత్తూరు), కెకె అన్బురాజన్ (అనంతపురం), కె.తిరుమలేశ్వర్(నెల్లూరు) ఎస్పీలపై బదిలీ వేటు పడిన విషయం తెలిసిందే. వారితో ముగ్గురు ముగ్గురు ఐఏఎస్ అధికారులను కూడా ఈసీ బదిలీ చేసింది.

వేటు ఎందుకంటే...?

గత నెలలో ప్రధాని


చిలకలూరిపేట వద్ద పాల్గొన్న బహిరంగ సభలో భద్రతా చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందడం ఇంటెలిజెన్స్ చీఫ్‌పై వేటుకు ప్రధాన కారణమని సమాచారం. ఈ విషయమై బీజేపీతో పాటు టీడీపీ,జనసేనలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. అంతే కాకుండా ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడం, ఇంటెలిజెన్సీ చీఫ్‌గా కొనసాగితే మే 13 న జరుగనున్న సాధారణ ఎన్నికలు పారదర్శకంగా జరిగే అవకాశాలు ఉండవని ఎన్డీఏ కూటమి కేంద్ర ఎన్నికల సంఘానికి వరుస ఫిర్యాదుల చేసిన నేపథ్యంలో ఆయనపై బదిలీ వేటు పడిందని భావిస్తున్నారు. విజయవాడ సీపీ కాంతిరాణాటాటాపై వేటు విషయానికి వస్తే ఈనెల 16న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర విజయవాడలో జరిగిన నేపథ్యంలో సింగ్‌నగర్‌లో సీఎంపై రాళ్ల దాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో సెక్యూరిటీకి స ంబంధించి ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో ఆయన వైఫల్యం చెందారని కేంద్ర ఎన్నికల సంఘం భావించినట్టు సమాచారం. దీంతో పాటు ఆయన అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కాళేశ్వరంపై విచారణకు కదలిక

- నేడు రిటైర్డ్ జస్టిస్ పినాకిని చంద్రఘోష్ రాక : మూడు నెలల్లో నివేదిక

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (కెఎల్ఐఎస్)లో అవకతవకలపై విచారణకు అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన న్యాయకమిషన్ తన పనిని త్వరలో ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ఆర్థిక అవకతవకలు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పిల్లర్ల పగుళ్లు, సీపేజీలపై సమగ్ర వచారణ చేయాలంటూ సీఎం రేవంత్ సర్కారు కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌కు జస్టిస్ ఘోష్ రానున్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూడా పనిచేసిన విషయం విదితమే. 100 రోజుల్లోపు కాళేశ్వరం నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.



ఈ మేరకు సర్కారు క్యాబినెట్‌లో తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఈ మొత్తం విషయాన్ని జస్టిస్ ఘోష్‌కు సాగునీటి శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా కోల్‌కతా వెళ్లి వివరించారు. క్యాబినెట్ తీర్మానం, ప్రభుత్వం జీవో, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని వివరాలు, విజిలెన్స్ నివేదిక, ఎన్‌డిఎస్‌ఏ పర్యటన సమచారం అంతా అందజేసినట్టు తెలిసింది. ఘోష్‌కు సచివాలయం పక్కనున్న బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. దాదాపు మూడు నెలలకుపైగా కమిషన్ విచారించనుంది.

ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన అధికారులు, కాంట్రాక్లర్లు, వర్కింగ్ ఏజెన్సీలకు నోటీసులు ఇవ్వడం ద్వారా విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నాయి. వేగంగా విచారించడం ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీల్లో లోపాలకు బాధ్యులను గుర్తించి, చట్టం ప్రకారం ఎలాంటి శిక్షలు విధించాలో జస్టిస్ ఘోష్ తన నివేదికలో పొందుపరచనున్నారు. ఘోష్ కమిషన్ ప్రాజెక్టు సాంకేతిక అంశాలను సైతం అధ్యయనం చేయనుంది. కాగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జూన్ 30 లోగా నివేదిక సమర్పించాలని కోరింది. కాగా ఇప్పటికే నెల సమయం గడిచిపోయింది. ఇక మిగిలింది మే, జూన్ రెండు నెలలు మాత్రమే. జస్టిస్ ఘోష్ బాధ్యతల్లోకి రావడానికి ఆలస్యం కావడంతో సమయం పొడిగించే అవకాశం లేకపోలేదనే ప్రచారం జలసౌధలో జరుగుతున్నది. ఇదిలావుండగా అన్నారం బ్యారేజీ ఎగువన ఉన్న ఇసుక మేటల తొలగింపు పనులు సైతం శ్రీకారం చుట్టారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) ఆదేశాల మేరకు పియర్స్ వద్ద సౌండింగ్, ప్రోబింగ్ పరీక్షలు చేయాల్సి ఉండగా, వీటికి ఇసుక మేటలు అడ్డుగా ఉన్న నేపథయంలో వాటిని తొలగించే ప్రక్రియ పనులను అధికారులు చేపట్టడం గమనార్హం.

నేటి నుంచి కేసీఆర్ బస్సుయాత్ర

- తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం ప్రారంభం : మిర్యాలగూడ, సూర్యాపేటలో రోడ్‌షో

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బస్సు యాత్ర చేపట్టనున్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటకు తెలంగాణ భవన్‌లో ఆయన బస్సుయాత్రను ప్రారంభిస్తారు. ఆ యాత్ర ఉప్పల్, ఎల్బీనగర్, చౌటుప్పల్, నకిరేకల్ ఎక్స్‌రోడ్, నల్లగొండ, మాడుగులపల్లి మీదుగా మిర్యాలగూడకు ఆయన చేరుకుంటారు. సాయంత్రం 5:30 గంటలకు మిర్యాలగూడ టౌన్‌లో భారీ రోడ్‌షోలో కేసీఆర్ ప్రసంగిస్తారు. అనంతరం వేములపల్లి, మాడుగులపల్లి, తిప్పర్తి, నార్కెట్‌పల్లి బైపాస్‌రోడ్డు, కేతేపల్లి మీదుగా సూర్యాపేట పట్టణానికి చేరుకుంటారు. అక్కడ రాత్రి ఏడు గంటలకు నిర్వహించే భారీ రోడ్‌షోలో పాల్గొంటారు. తొలిరోజు ఆయన 184 కిలోమీటర్ల మేర బస్సుయాత్ర చేయనున్నట్టు తెలిసింది.

ప్రధాని విద్వేష వ్యాఖ్యలపై జోక్యం చేసుకోండి

- సుప్రీంకోర్టుకు ఎఐకెఎస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : రాజస్థాన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన ప్రసంగాన్ని ఎఐకెఎస్ తీవ్రంగా ఖండించింది. దేశంలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న సామరస్యాన్ని పణంగా పెట్టి ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రజలను మతపరంగా విభజించడానికి చేసిన ప్రయత్నంగా ఈ ప్రసంగాన్ని ఎఐకెఎస్ విమర్శించింది. ప్రధానమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి పూర్తిగా అబద్ధాలపై ఆధారపడి విద్వేషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించడం ఆ పదవి ప్రతిష్టను దిగజార్చడమేనని ఆరోపించింది. ఈ కేసులో మోడీ ప్రవర్తన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి)ని ఉల్లంఘించడమే కాదు, ఐపిసిలోని వివిధ సెక్షన్ల కింద తీవ్రమైన నేరాలకు పాల్పడటంతో సమానమని తెలిపింది. ఎంసిసిని ఉల్లంఘించినందుకు ఇప్పటివరకు ప్రధాని మోడీపై ఎన్నికల సంఘం ఎటువంటి చర్య తీసుకోకపోవడం మరింత ఆశ్చర్యం కలిగిస్తుందని తెలిపింది. ఈ కేసును సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని, వీలైనంత త్వరగా జోక్యం చేసుకోవాలని ఎఐకెఎస్ విజ్ఞప్తి చేసింది. పదేళ్ల మోడీ పాలనపై ప్రజల్లో తీవ్రమైన ఆగ్రహం పెల్లుబుకుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రితో సహా బిజెపి నాయకులంతా విద్వేష రాజకీయాలను ఆశ్రయిస్తున్నారని ఎఐకెఎస్ ఆరోపించింది. ఎంసిసిని ఉల్లంఘించిన ప్రధానమంత్రి మోడీ తదుపరి ప్రచారం చేయకుండా ఎన్నికల సంఘం నిరోధించాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా మోడీపై నిషేధం విధించాలని ఎఐకెఎస్ డిమాండ్ చేసింది. ఎంఎస్‌పికి సంబంధించిన చట్టపరమైన హామీతో పాటు ఇతర హామీలను నెరవేర్చకుండా రైతులను మోసం చేసినందుకు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఘోరంగా ఓడించి గుణపాఠం చెప్పాలని ఎఐకెఎస్ పిలుపునిచ్చింది.

ఆ సమాచారం అందుబాటులో లేదు

- రాష్ట్రపతి భవన్

న్యూఢిల్లీ : ఏ ఫైల్స్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పున:పరిశీలన కోసం తిరిగి పంపారనే సమాచారం అందుబాటులో లేదని రాష్ట్రపతి భవన్ మంగళవారం ఆర్‌టిఐ ప్రశ్నకి సమాధానమిచ్చింది. సమాచార హక్కు చట్టం, 2005 కింద తమిళనాడుకి చెందిన రాజ్ కపిల్ ఓ పిటిషన్ దాఖలు చేశారు. ప్రధాని, కేబినెట్, కేబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి), పార్లమెంట్, కేంద్ర మంత్రిత్వ శాఖలు, కేంద్ర ఏజన్సీలు తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రపతి ఎన్నిసార్లు తిరిగి పంపారో తెలియజేయాలని పిటిషన్‌లో కోరారు.

రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంత అసెంబ్లీ తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్రపతి తిరిగి సమీక్షించాలని ఎన్నిసార్లు తిప్పిపంపారో కూడా తెలియజేయాలని కోరారు. అటువంటి సమాచారం అందుబాటులో లేదని రాష్ట్రపతి భవన్ డైరెక్టర్ శివేంద్ర చతుర్వేది సమాధానమిచ్చారు. గతంలో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రధాని, కేబినెట్ నిర్ణయాలను ఎన్నిసార్లు పున:పరిశీలన కోసం పంపించారని దాఖలైన పిటిషన్‌కు రాష్ట్రపతి భవనస్ ఇదే విధమైన సమాధానమివ్వడం గమనార్హం.

మలేషియాలో రెండు నేవీ హెలికాప్టర్లు ఢీ

- పది మంది మృతి

కౌలాలంపూర్ : మలేషియాలో రెండు నేవీ హెలికాప్టర్లు మంగళవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పది మంది నేవీ సిబ్బంది మరణించినట్లు మలేషియా నేవీ ఓ ప్రకటనలో తెలిపింది. పశ్చిమ రాష్ట్రమైన పెరాక్‌లోని లుముట్ నౌకాదళ స్థావరం వద్ద మంగళవారం ఉదయం 9.32 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. సిబ్బంది అంతా ప్రమాదంలో మరణించినట్లు నిర్ధారించింది.





పార్లమెంట్‌లో కార్మిక గొంతు
ఎలమారం కరీం

జె.జగదీష్, నవతెలంగాణ

కేరళలో కోజికోడ్ లోక్‌సభ నియోజకవర్గానికి సీపీఐ(ఎం) తరపున పోటీ చేస్తున్న ఎలమారం కరీం తన రాజకీయ జీవితాన్ని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలతో ప్రారంభించారు. ఆయన గొప్ప పార్లమెంటేరియన్. పార్లమెంట్‌లో కార్మిక గొంతుగా నిలిచిన ఎలమారం కరీం, ఇప్పుడు లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. శ్రామిక వర్గ రాజకీయాల సూక్ష్మభేధాలను ప్రజలకు తెలియజేసే అద్భుతమైన వక్తృత్వ శైలి ఉన్న కరీం, దేశంలోనే పేరున్న ట్రేడ్ యూనియన్ నాయకుడుగా ఉన్నారు.



ప్రస్తుతం రాజ్యసభ ఎంపీగా ఉన్న ఎలమారం పార్లమెంట్‌లో లౌకిక భారతదేశానికి బలమైన గొంతుక. సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడుగా కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు, ఫాసిస్టు చర్యలను వ్యతిరేకించినందుకు ఆయనను రెండుసార్లు పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేశారు. సభలో ప్రతిపక్ష పార్టీలను సమన్వయం చేస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హెూదా, వ్యవసాయ చట్టాలు, కార్మిక చట్ట సవరణ, ట్రిపుల్ తలాక్‌ను తొలగించే బిల్లుపై ఆయన సభలో చేసిన ప్రసంగాలు జాతీయ దృష్టిని ఆకర్షించాయి.

రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎలమారం 2006లో వీఎస్ అచ్యుతానంద మంత్రివర్గంలో వ్యవసాయ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల బాట పట్టించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల సహకారంతో కొత్తగా ఏడు పారిశ్రామిక ప్రాజెక్టులు ప్రారంభించారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. కేరళ స్టూడెంట్ ఫెడరేషన్ (కేఎస్ఎఫ్)తో ప్రజా క్షేత్రంలోకి వచ్చిన ఆయన, రాష్ట్రంలో ప్రయివేట్ మోటారు రవాణా రంగంలోని సమస్యలను లేవనెత్తుతూ అనేక ఆందోళనలు నిర్వహించారు. మోటారు కార్మికుల సంఘాల ఐక్య వేదిక ఏర్పడటంలో కీలక పాత్ర పోషించారు. మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. మోటారు వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో సభ్యుడయ్యారు. 1996లో కోజికోడ్ రెండో నియోజకవర్గం నుంచి, 2006, 2011లో బేపూర్ నుంచి ఎమ్మెల్యే అయ్యారు. 2006లో పరిశ్రమల శాఖ మంత్రిగా జెనీవాలో జరిగిన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) సదస్సులో పాల్గొన్నారు. ఆయన లేబర్, టెక్స్‌టైల్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు. పార్లమెంటులో భారీ పరిశ్రమల కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడుగా ఉన్నారు. కోజికోడ్ మెడికల్ కాలేజీ సమీపంలోని కోవూరులో నివసిస్తున్నారు. ఆయనకు భార్య రహమత్, పిల్లలు పికె సుమి, పికె నిమ్మి ఉన్నారు.మరోసారి పార్లమెంట్‌లో ప్రజాసమస్యలను లేవనెత్తే అవకాశాన్ని ఇవ్వాలని ఎలమారం కరీం అభ్యర్థిస్తున్నారు.





ఎన్నికల ప్రచారంలో మహమ్మారి ప్రస్తావన
మోడీ నోట కోవిడ్ కహానీ...!

- సమర్థవంతంగా ఎదుర్కొన్నామంటూ స్వీయ కితాబులు
- వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం

న్యూఢిల్లీ : దేశంలో సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభమైంది. ముచ్చటగా మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. అందివచ్చిన అన్ని అవకాశాలనూ ఆ పార్టీ వినియోగించుకుంటోంది. చివరికి 2019లో వచ్చిపడిన కోవిడ్ మహమ్మారిని కూడా ఆ పార్టీ నేతలు వదలడం లేదు. కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, ఆ విపత్తు నిర్వహణలో తమకు తామే సాటి అని గొప్పలు చెప్పుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితం మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీని ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ కోవిడ్ ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ కష్టకాలంలో తమ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని, దేశ ప్రయోజనాలకే పెద్ద పీట వేసిందని ఆయన చెప్పారు.

రెండో దశ కోవిడ్ మహమ్మారి విరుచుకుపడిన మూడు సంవత్సరాల తర్వాత లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. అయితే దీనిని అడ్డుకోవడంలో, ప్రజల ప్రాణాలు కాపాడడంలో ఎంతో కృషి చేశామని మోడీ ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవాలను పరిశీలిస్తే అందుకు భిన్నమైన చిత్రం కన్పిస్తుంది. ఆక్సిజన్ లభించక నిస్సహాయ స్థితిలో ప్రజలు రోడ్ల పైనే ప్రాణాలు కోల్పోయిన దృశ్యాలు ఇప్పటికీ కండ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. తమ వారి కోసం కనీసం ఒక్క ఆస్పత్రి పడక అయినా దొరక్కపోతుందా అన్న ఆతృతతో కుటుంబసభ్యులు పరుగులు పెట్టిన ఉదంతాలు కూడా వెంటాడుతూనే ఉన్నాయి.

అంతిమ సంస్కారాల కోసం పడిగాపులు


కోవిడ్ కారణంగా మరణించిన వారి మృతదేహాలు గంగానది ఒడ్డున పడి ఉన్న భయానక దృశ్యాలు, వాటికి అంతిమ సంస్కారాలు జరిపేందుకు స్మశానవాటికల వెలుపల బారులు తీరి ఎదురు చూపులు చూసిన బంధువుల ఆక్రందనలు... వీటన్నింటినీ ఎలా మరచిపోగలం? అయితే ప్రధానికి మాత్రం ఇవేవీ గుర్తుండక పోవచ్చు. ఒకవేళ గుర్తుకొచ్చినా సామాన్య ప్రజల జ్ఞాపకాల పొరల నుండి వాటిని చెరిపేసేందుకు ఉద్దేశపూర్వకంగానే ప్రయత్నిస్తూ ఉండవచ్చు. కోవిడ్ సమయంలో అత్యవసర మందులు దొరకడమే గగనమైపోయింది. ఒకవేళ దొరికినా ధరలు మాత్రం ఆకాశాన్ని తాకాయి. చీకటి బజారులో ఉన్న మందులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చేసిందేమీ లేదు. ఓ రాష్ట్ర హైకోర్టు సైతం ఈ విషయాన్ని వేలెత్తి చూపింది. బాధితులకు సాయపడడానికి ముందుకొచ్చిన స్వచ్ఛంద సంస్థలకు కూడా ప్రభుత్వ సహకారం లభించకపోవడం విషాదకరం.

కోవిడ్ సమయంలోనే పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు జరిగాయి. ప్రచార సభల్లో ప్రధాని మోడీ ప్రసంగించారు. వివిధ పార్టీల నేతలు హాజరైన ర్యాలీలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆ సమయంలోనే కొన్ని చోట్ల మతపరమైన కార్యక్రమాలు కూడా జరిగాయి. ఈ పరిణామాలన్నీ కోవిడ్ వ్యాప్తికి కారణమయ్యాయి.

కోవిడ్ రెండో దశ ప్రారంభం కావడానికి

హెచ్చరికలు బేఖాతరు

ముందు ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తరచుగా పత్రికా సమావేశాలు ఏర్పాటు చేశారు. ప్రధాని కూడా టీవీలలో ప్రజలకు కన్పించి, వారిని ఉద్దేశించి ప్రసంగించారు. రెండో దశ ప్రారంభమైన తర్వాత ఈ దృశ్యాలేవీ కన్పించలేదు. ప్రజలకు కనీసం సూచనలు, సలహాలు ఇచ్చే నాథుడే కరువయ్యాడు. ఆక్సిజన్, మందుల సరఫరా విషయంలో సుప్రీంకోర్టు తనంతతానుగా జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. 12 మంది స్వతంత్ర శాస్త్రవేత్తలు, అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. రెండో దశ కోవిడ్ రావడానికి నెల రోజుల ముందే శాస్త్రవేత్తలు హెచ్చరించినప్పటికీ ప్రభుత్వంతో కదలిక కన్పించలేదు. ఆ హెచ్చరికలన్నిటినీ పెడచెవిన పెట్టింది.



గాలిలో కలిసిన 47 లక్షల ప్రాణాలు

కోవిడ్ కారణంగా ప్రపంచంలో మన దేశంలోనే అధిక మరణాలు సంభవించాయి. రెండో దశ వరకూ భారత్‌లో 47 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తెలిపింది. ప్రభుత్వం మాత్రం ఆ సంఖ్యను 4.8 లక్షలుగానే చూపింది. పైగా డబ్ల్యూహెచ్ఓ నివేదికను తోసిపుచ్చింది. మృతుల సంఖ్యను అంచనా వేసేందుకు డబ్ల్యూహెచ్ఓ అనుసరించిన పద్ధతికి మన అధికారులు దురుద్దేశాలు ఆపాదించారు. వాస్తవానికి ఆ సంస్థ నివేదికను తోసిపుచ్చిన ఏకైక దేశం ప్రపంచంలో భారత్ మాత్రమే. పౌర నమోదు వ్యవస్థ (సీఆర్ఎస్) రికార్డు చేసిన మరణాలను కూడా మోడీ ప్రభుత్వం బహిర్గతం చేయలేదు. పలు స్వతంత్ర శాస్త్రవేత్తల అధ్యయనాలను సైతం తోసిపుచ్చింది.

తొలి దశ సమయంలోనూ...

కోవిడ్ తొలి దశ సమయంలో మోడీ ప్రభుత్వం కేవలం నాలుగు గంటల వ్యవధి ఇచ్చి విధించిన లాక్‌డౌన్ కారణంగా వేలాది మంది వలస కార్మికులు వందలాది మైళ్ల దూరాన్ని దాటుకుంటూ రోజులు, వారాలు కాలినడకన ప్రయాణించి స్వస్థలాలకు చేరిన హృదయవిదారక దృశ్యాలను ఎలా మరచిపోగలం? ఆహారం, తాగునీరు సైతం లేకుండా పిల్లాపాపలతో మండుటెండలో నడిచిన సన్నివేశాలను ఎలా మరువగలం? ఈ ప్రయాణంలో కొందరు కార్మికులు రోడ్ల పైనే కన్నుమూశారు. లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారంటూ పోలీసులు లాఠీఛార్జీ చేస్తుంటే కొందరు ఆ దెబ్బలు రుచిచూశారు. వీటన్నింటినీ ముందుగానే అంచనా వేయడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. కార్మికులను ఉచితంగా తరలిస్తామంటూ విమాన సంస్థలు ముందుకొచ్చినా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ముస్లింలు తబ్లిగీ జమాత్ నిర్వహించడం వల్లనే కోవిడ్ వేగంగా విస్తరించిందంటూ ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిందలు వేసింది.

వ్యాక్సిన్ తయారీలోనూ అదే తీరు

కోవిడ్ మొదటి దశలోనే వ్యాధి నివారణకు వ్యాక్సిన్‌ను కనిపెట్టాలన్న ఒత్తిడి పెరిగింది. అయితే స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన కోవాక్సిన్ అందుబాటులోకి రావడానికి సమయం పట్టింది. ఈ క్రమంలోనే భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) అనుసరించిన వైఖరి విమర్శలకు దారితీసింది. చివరికి 2021 జనవరిలో వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. అది కూడా వివాదాస్పదమే అయింది. ఈ వ్యాక్సిన్ కోసం ప్రజలు చాలా కాలం ఎదురు చూడాల్సి వచ్చింది. చివరికి అనేక వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చినప్పటికీ అప్పటికే జరగాల్సిన ప్రాణనష్టం జరిగిపోయింది. చాలా మందికి రెండు డోసుల వ్యాక్సిన్ అందలేదు.

భవిష్యత్తులో ఇలాంటి ఉపద్రవాలు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు దేశం సిద్ధంగా ఉన్నదా? జరిగిన పొరబాట్ల నుండి పాఠాలు నేర్చుకుంటుందా? ఈ ప్రశ్నలకు జవాబులు రాజకీయ ఉపన్యాసాలలోనే మనకు దొరుకుతాయి.

కదిలిస్తూ..కలిసి ముచ్చటిస్తూ..



(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, అభ్యర్థి జహంగీర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాడవాడలా జనాన్ని కదిలిస్తూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ఇతర పార్టీల అభ్యర్థుల చరిత్ర, సీపీఐ(ఎం) చరిత్ర.. ప్రజాఉద్యమాలను వివరించారు.

నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల ప్రాంతంలో కూలీలను కలిసిన నాగయ్య.. చట్టం అమలు.. నిధుల గురించి వివరించారు. బీజేపీ పదేండ్ల పాలనలో ఉపాధి హామీకి బడ్జెట్లో కేటాయింపులు క్రమంగా తగ్గిస్తూ రద్దు చేసేందుకు కుట్ర చేస్తోందని అన్నారు. బడ్జెట్‌లో రెండు లక్షల 50 వేల కోట్లు కేటాయించాల్సింది రూ.80వేల కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. కేటాయించిన 80 వేల కోట్లు గత ఏడాది చేసిన పనుల బకాయిలకే సరిపోతుందన్నారు. ఇక కూలీలకు వందరోజుల పని కల్పించడం సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. పనిచేస్తున్న కూలీలకు మంచినీటి సౌకర్యం, నీడ కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. నిత్యం ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎండి.జహంగీర్‌కు ఓటేసి పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాచకొండ వెంకట్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యుడు బక్కయ్య, మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, నాయకులు కొప్పుల అంజయ్య, దూరేపల్లి ఎల్లయ్య, బస్క యేసు, అంతటి వెంకటయ్య పాల్గొన్నారు.

ఉద్యమాలే ఊపిరి.. పేదల సంక్షేమమే తమ ధ్యేయం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి

ఉద్యమాలే ఊపిరిగా, పేద ప్రజల సంక్షేమమే తనధ్యేయంగా నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి జహంగీర్‌కు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంతో పాటు మండలపరిధిలోని అన్నారం గ్రామంలో అభ్యర్థితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్మిక, కర్షక, ప్రజాహక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. ఉపాధిహామీ చట్టం అమలు చేయించిన ఘనత ఎర్రజెండాకే దక్కుతుందన్నారు. ప్రశ్నించే గొంతుక ఎండి.జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు.

తుంగతుర్తి కమ్యూనిస్టుల అడ్డా.. : జహంగీర్

తుంగతుర్తి గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అని.. ఈ ప్రాంతంలో భీమ్ రెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం ఎంతో అభివృద్ధి చేశారని సీపీఐ(ఎం) భువనగిరి అభ్యర్థి ఎండి.జహంగీర్ అన్నారు. నేడు ఎన్నికలు డబ్బులతో కూడుకున్నవని, కమ్యూనిస్టులకు డబ్బులు ఖర్చు పెట్టే శక్తి లేదన్నారు. ప్రజలకు డబ్బులు అలవాటు చేసింది కార్పొరేట్ రాజకీయాలేనని, ఆ డబ్బులను ప్రజలు తిరస్కరించే రోజులొస్తాయని చెప్పారు. ప్రజాసమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకే ఓటు అడిగే నైతికహక్కు ఉంటుందన్నారు. కేంద్రంలోని బీజేపీకి కులం, మతం, గుడి, ఆచార వ్యవహారాలు తప్ప ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి అంటే తెలియదన్నారు. మతతత్వాన్ని పెంచుతూ సైన్స్‌ను నిర్వీర్యం చేస్తున్నదన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడానికి, పోరాటాలు చేయడానికి ప్రజా సమస్యలపై ప్రశ్నించడానికి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నాయకులు ముల్కలపల్లి రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, మట్టిపెల్లి సైదులు, పులుసు సత్యం, జోగునూరి దేవరాజ్, ముత్తయ్య, యాదగిరి పాల్గొన్నారు.

రాముడిని మొక్కాలి.. బీజేపీని తొక్కాలి

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వలేదని, ఆసరా పథకం కింద రూ. 4 వేలు, రైతు పంటలకు బోనస్ ఇవ్వని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. ఇక, కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యుడి జీవన స్థితిగతి దిగజారిందన్నారు. చమురు ధరలు అంతర్జాతీయంగా తగ్గినప్పటికీ దేశంలో మాత్రం విపరీతంగా పెంచారని తెలిపారు. పదేండ్ల కాలంలో బీజేపీ తెలంగాణ ప్రాంతానికి చేసిందేమీ లేదని, పైగా మతాన్ని అడ్డుపెట్టుకుని ఓట్లు దండుకోవడానికి కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీని గద్దెదించడమే లక్ష్యంగా బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ బీసీల బహుబలి అని, ఉమ్మడి రాష్ట్రంలో 93 బీసీ కులాలను ఏకం చేసి వారి అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తుచేశారు. చేవెళ్ల పార్లమెంట్‌లో ఇప్పటి వరకు బీసీ అభ్యర్థికి ఎవ్వరూ అవకాశం ఇవ్వలేదని, ఇప్పుడు ఆ అవకాశం వచ్చిందని, బహుజన రాజ్యాధికారం అనే నినాదాన్ని నిలబెట్టేందుకు బహుజనులంతా ఏకమై కాసానిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూటకపు వాగ్దానాలతో
అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

- కడియం శ్రీహరిది నమ్మకద్రోహం
- బీజేపీని ఎదుర్కొనే దమ్ము కేసీఆర్‌కే ఉంది : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నవతెలంగాణ - కాశిబుగ్గ

రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అధ్యక్షతన ఉర్సుగుట్ట నాని గార్డెన్‌లో నిర్వహించగా, కేటీఆర్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో కడియం శ్రీహరికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఉప ముఖ్యమంత్రిగా కేసీఆర్ అవకాశం కల్పించారని, కానీ ఆయన నమ్మకద్రోహం చేసి వ్యక్తిగత లబ్దికోసం పార్టీని వీడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలైన రెండు లక్షల రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు రూ. 2500 పెన్షన్, కౌలు రైతులకు రైతుబంధు లాంటి ఎన్నో హామీలు ఇంతవరకు అమలు చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేయొద్దన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ ప్రజల్ని రెచ్చగొడుతుందని విమర్శించారు. రాముడు అందరికీ దేవుడేనని, ఒక్క బీజేపీ సొత్తుకాదని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 10 నుంచి 12 స్థానాలను ప్రజలు ఇస్తే రాష్ట్ర రాజకీయాలను మారుస్తామన్నారు. అరూరి రమేష్ రెండుసార్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే తన స్వార్థం కోసం పార్టీని వీడి బీజేపీలో చేరారని తెలిపారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఎదుర్కొనే దమ్ము ధైర్యం కాంగ్రెస్‌కు లేదని, అది క్క బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌కు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, తాడికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా పరిషత్ చైర్మెన్ గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకట రమణారెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, పార్టీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అవకాశవాద పార్టీలను ఓడించాలి

నిజాయితీ, నిబద్ధత గల సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండి.జహంగీర్‌ను గెలిపించండి : పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి. వెంకట్



నవతెలంగాణ-బీబీనగర్

అవకాశవాద, మతోన్మాద పార్టీలను ఓడించి నిజాయితీ నిబద్ధత గల సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండి.జహంగీర్‌ని గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ పిలుపునిచ్చారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత దేశంలో ప్రజాస్వామ్యం, పౌర హక్కులు ఉండాలంటే కేంద్రంలో ఇండియా కూటమి గెలవాలన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఓటమి భయంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజస్థాన్‌లో ముస్లిం, హిందువుల మధ్య విద్వేషం రగిలే విధంగా మాట్లాడారని విమర్శించారు. మోడీకి మన రాజ్యాంగం ఇష్టం లేదని, అందుకే మళ్లీ అధికారంలోకి వచ్చి రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో నిరుద్యోగం, ధరలు, ప్రభుత్వ రంగం, ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పేదల సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. ప్రజల కోసం, దేశాభివృద్ధి కోసం ఇండియా కూటమిని బలపరిచి గెలిపించాలని కోరారు. బీసీ జనగణన చేయని బీజేపీ.. భువనగిరి నియోజకవర్గంలో ఓట్లు అడగడం సిగ్గుచేటన్నారు. బీజేపీని చిత్తుగా ఓడించి.. నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.వెంకటేష్, కొండమడుగు నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లవుడియ రాజు, నాయకులు గాడి శ్రీనివాస్, కందాడి దేవేందర్ రెడ్డి, వెంకటేష్, బండారి శ్రీరాములు ఉన్నారు.

కేసీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా డిపాజిట్ రాదు

- లిక్కర్ కేసులో కవితకు బెయిల్ దొరకదు
- త్వరలో తండ్రీకొడుకులు కూడా జైలుకు
- రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌కు కాలం చెల్లింది
- సంస్కారహీనుడు జగదీశ్‌రెడ్డి గురించి ఇక మాట్లాడను: మీడియా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

"కేసీఆర్ బస్సు యాత్ర కాదు కదా.. మోకాళ్ల యాత్ర చేసినా భువనగిరి, నల్లగొండలో డిపాజిట్ కూడా దక్కదు.. లిక్కర్ కేసులో అరెస్టు అయిన కవితకు బెయిల్ దొరకదు. త్వరలో తండ్రీకొడుకులు కూడా జైలుకెళ్లడం ఖాయం.." అని రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందన్నారు. పదేండ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయలేని వారు ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 15 స్థానాలలో తామే గెలవబోతున్నామన్నారు. తనను గెలిపించిన విధంగానే అత్యధిక మెజార్టీతో రఘువీర్ రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కేసీఆర్, మంత్రిగా ఉన్న జగదీశ్ రెడ్డి వేలకోట్లు సంపాదించారని ఆరోపించారు. సంస్కారహీనుడైన జగదీశ్‌రెడ్డి గురించి ఇక మాట్లాడి తన స్థాయిని దిగజార్చుకోనని అన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత నల్లగొండ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ వేగవంతం చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తామంతా రాష్ట్ర అభివృద్ధి కోసం టీం వర్క్‌గా పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. బుధవారం రఘువీర్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నీటి జలాల పంపకంలో జగన్, కేసీఆర్ లాలూచీ పడ్డారని విమర్శించారు. కేసీఆర్ వల్లే జిల్లాకి కరువు వచ్చిందని, మిర్యాలగూడకి కేసీఆర్ ఏ మొఖం పెట్టుకొని వస్తారని, బస్సు యత్ర చేయడానికి కేసీఆర్‌కి సిగ్గుండాలని అన్నారు. కేసీఆర్ శకం ఇక ముగిసిందన్నారు. తాను పిలిస్తే కాంగ్రెస్‌లోకి రావడానికి 25 మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారన్నారు.

మతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ రాజకీయాలు చేస్తోందన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు. నల్లగొండ, భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థులు సర్పంచులుగా కూడా పనికిరారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతల గురుంచి, జగదీశ్ రెడ్డి గురించి గుత్తా సుఖేందర్ రెడ్డి సరిగానే చెప్పారని అన్నారు. అందుకు సుఖేందర్ రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, నల్లగొండ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి, పాశం రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ
ఓ మంచి పుస్తకం కొనుక్కో - కందుకూరివీరేశలింగం

బుధవారం 24 ఏప్రిల్ 2024
www.navatelangana.com

సంపాదకీయం

అగ్గి రాజేయద్దు!

పశ్చిమాసియా నేడు పెను యుద్ధ విపత్తు అంచున ఉందన్నది నిజం. దీనికి అగ్గి రాజేసే పని చేయొద్దని పశ్చిమ దేశాల ప్రభుత్వాలు ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశాయి. ఇటువంటి పైపై విజ్ఞప్తుల వల్ల ప్రయోజనం ఉండదు. దీనికి కచ్చితంగా అంగీకరించేలా యుద్ధోన్మాది నెతన్యాహు మెడలు వంచాలి. గత వారాంతంలో 300 డ్రోన్లు, క్షిపణులతో తమపై దాడి చేయడం ద్వారా ఇరాన్ కవ్వింపు చర్యకు పాల్పడిందని ఇజ్రాయిల్ నిందిస్తోంది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇజ్రాయిల్ కాన్సులేట్‌లో ఇద్దరు జనరల్స్‌తో సహా 13 మంది సైనిక అధికారులను, దౌత్యవేత్తలను వైమానిక దాడి ద్వారా చంపేసిన తన అరాచక చర్య గురించి ఇజ్రాయిల్ మాట్లాడదు. దానిని వెనకేసుకొస్తున్న అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇతర పశ్చిమ దేశాలు ఆ ఊసెత్తవు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం డమాస్కస్‌లో కాన్సులేట్‌పై దాడి ఇరాన్‌పై జరిగిన దాడే అవుతుంది. ఇజ్రాయిల్ సాగించిన అరాచక చర్యను మాటమాత్రంగా కూడా ఖండించని ఈ దేశాలు ఇరాన్ ప్రతీకార చర్యను మాత్రం వెంటనే ఖండించాయి. డమాస్కస్‌లో జరిగిన దాడిలో 13 మంది ఇరానీ అధికారులు మరణించారు. దౌత్య కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. ఇరాన్ ప్రతీకార చర్యలో ఎలాంటి ప్రాణ నష్టం కానీ, విధ్వంసం కానీ చోటుచేసుకోలేదు.

దౌత్యపరంగా తటస్థం అంటూనే పెగాసస్ తదితర స్పైవేర్లతో ఇజ్రాయిల్‌తో అల్లుకున్న మితవాద బంధాన్ని మోడీ సర్కారు కొనసాగిస్తోంది. ఇంత చేస్తున్నా ఇరాన్ సంయమనం పాటిస్తూనే ఇజ్రాయిల్ నౌకలో ఉన్న భారతీయులు 17 మందిని కలుసుకోవడానికి అనుమతించింది. స్వాతంత్య్రోద్యమ కాలం నుంచి వస్తున్న పాలస్తీనా అనుకూల వైఖరిని విడనాడడం ద్వారా యూదు దురహంకారానికి మద్దతు ఇవ్వడం దేశానికి ప్రమాదకరం. నౌకలో ఉన్న వారిని త్వరగా స్వదేశాలకు తరలించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. అమెరికా తొత్తుగా మారకుండా స్వతంత్రవైఖరిని తీసుకోవాలి. పాలస్తీనాపై దాష్టీకానికి ఇప్పటికైనా ముగింపు పలకాలి. పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు అందించడం మానాలి.

ఇరాన్ ఏదో అకస్మాత్తుగా తీసుకున్న చర్యకాదు ఇది. కొన్ని గంటల ముందే నోటీసు ఇచ్చింది. తన డ్రోన్లను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేస్తుందని తెలుసు. ప్రతీకార చర్య తరువాత కాన్సులేట్‌పై దాడికి వన్‌టైమ్ పనిష్మెంట్ పూర్తయిందని, దీనిపై గనుక ఇజ్రాయిల్ మళ్లీ దాడి చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఇరాన్‌ను ముగ్గులోకి లాగడం ద్వారా దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం



ఉద్దేశపూర్వకంగానే డమాస్కస్‌లో కాన్సులేట్‌పై దాడి చేసింది. ఇరాన్‌ను దుష్ట రాజ్యంగా పశ్చిమ దేశాలు చిత్రిస్తున్నాయి నిజానికి ఈ ప్రాంతంలో దుష్ట రాజ్యం ఏదైనా ఉన్నదీ అంటే అది ఇజ్రాయిలే.

ఇరాన్ డ్రోన్ దాడిని ఇజ్రాయిల్‌తోబాటు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ అడ్డుకున్నాయని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ కెమరాన్ గొప్పగా చెప్పుకున్నారు. ఇజ్రాయిల్‌కు పలు అంచెల భద్రత కల్పిస్తున్న ఈ దేశాలు గాజాలో ప్రజలను రక్షించడానికి ఎలాంటి రక్షణ ఎందుకు కల్పించలేదు? పశ్చిమ దేశాల కపట వైఖరికి ఇదొక నిదర్శనం.

లెబనాన్, సిరియా, ఇరాక్‌లపై పలుమార్లు దాడులు చేసి, ఇరాన్‌ను రెచ్చగొట్టి, మధ్య ప్రాచ్యంలో సంఘర్షణలను పెంచడం ద్వారా అమెరికా, పశ్చిమ దేశాల నుంచి మరింత సాయం పొందడం, దేశీయంగా తన అధికారం కొనసాగించుకోవడం లక్ష్యంగా నెతన్యాహు ఎత్తులు వేస్తున్నాడు. యుద్ధం ఆగితే నెతన్యాహు నేతృత్వంలోని మితవాద సంకీర్ణాన్ని గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్న ఇజ్రాయిలీలు ఇప్పటికే ఆందోళనలు చేస్తున్నారు. అమాయకులను ఊచకోత కోయడం మినహా, బందీలందరినీ విడిపిస్తానని, హమాస్ నాయకత్వాన్ని నాశనం చేస్తానని పెట్టుకున్న యుద్ధ లక్ష్యాలేవీ నెరవేర్చలేదని, దేశాన్ని అప్రతిష్టపాల్జేస్తున్నారన్న ఆగ్రహం ఇజ్రాయిలీయుల్లో వ్యక్తమవుతోంది. రంజాన్ సందర్భంగానైనా గాజాలో కాల్పుల విరమణకు పిలుపు నిస్తూ ఐరాస భద్రతా మండలి అత్యధిక మెజారిటీతో తీర్మానం చేసినప్పటికీ, ఇజ్రాయిల్ తన దాడులను తీవ్రతరం చేసింది. అమెరికా ఓటింగ్‌కు దూరంగా ఉండి, తీర్మానం ఆమోదానికి అనుమతించినా ఇజ్రాయిల్ తీరులో మార్పులేకపోవడం అమెరికా, పశ్చిమ దేశాల గుడ్డి మద్దతు ఫలితమే. నెతన్యాహు యుద్ధ నేరాలపై లాటిన్ అమెరికా దేశమైన నికరాగ్వా ఐసిసి బోనులో నిలబెట్టినా, పశ్చిమ దేశాల ఒత్తిళ్లతో శిక్షించలేని దుస్థితిలో ఉంది.

దౌత్యపరంగా తటస్థం అంటూనే పెగాసస్ తదితర స్పైవేర్లతో ఇజ్రాయిల్‌తో అల్లుకున్న మితవాద బంధాన్ని మోడీ సర్కారు కొనసాగిస్తోంది. ఇంత చేస్తున్నా ఇరాన్ సంయమనం పాటిస్తూనే ఇజ్రాయిల్ నౌకలో ఉన్న భారతీయులు 17 మందిని కలుసుకోవడానికి అనుమతించింది. స్వాతంత్య్రోద్యమ కాలం నుంచి వస్తున్న పాలస్తీనా అనుకూల వైఖరిని విడనాడడం ద్వారా యూదు దురహంకారానికి మద్దతు ఇవ్వడం దేశానికి ప్రమాదకరం. నౌకలో ఉన్న వారిని త్వరగా స్వదేశాలకు తరలించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి. అమెరికా తొత్తుగా మారకుండా స్వతంత్రవైఖరిని తీసుకోవాలి. పాలస్తీనాపై దాష్టీకానికి ఇప్పటికైనా ముగింపు పలకాలి. పశ్చిమ దేశాలు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు అందించడం మానాలి.

చిన్న దేశం-పెద్ద సందేశం



ఎం కోటేశ్వరరావు
8331013288

ఆదివారం ఏప్రిల్ 19, 2024న జరిగిన మాల్దీవుల పార్లమెంటు ఎన్నికల్లో విజేత చైనా అంటూ టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక శీర్షిక పెట్టింది. దాదాపు అన్ని పత్రికలూ చైనా అనుకూల పార్టీ సూపర్ మెజారిటీ సాధించినట్లు నివేదించాయి. పీపుల్స్ మజ్లిస్ (పార్లమెంటు)లోని 93 స్థానాలకు గాను (ఇది రాస్తున్న సమయానికి అధికారికంగా లెక్కింపు పూర్తికాలేదు) పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్(పిఎన్‌సి), దాన్ని బలపరుస్తున్న వారికి 75, భారత అనుకూల మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీకి 15 స్థానాలు వచ్చినట్లు వార్తా సంస్థలు తెలిపాయి. మొత్తం 368 మంది పోటీ చేశారు. వారిలో 130 మంది స్వతంత్రులు కాగా మిగిలిన వారు ఏడు రాజకీయ పార్టీలకు చెందిన వారు. ఈ ఎన్నికల పర్యవసానాల గురించి సహజంగానే విశ్లేషణలు మొదలయ్యాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో మాల్దీవుల డెమోక్రటిక్ పార్టీ 45.83 శాతం ఓట్లతో 87 స్థానాలకు గాను 65 తెచ్చుకుంది. ఆ ఎన్నికల నాటికి నూతన పార్టీగా పిఎన్‌సి 6.63శాతం ఓట్లు, మూడు సీట్లు తెచ్చుకుంది. గతేడాది సెప్టెంబరు 9న జరిగిన ఎన్నికల్లో ఎవరికీ అవసరమైన 50శాతం పైగా మెజారిటీ రాకపోవటంతో 30న జరిగిన తుది దఫా ఎన్నికల్లో ఈ పార్టీ నేత మహమ్మద్ ముయిజ్జు 54.04శాతం ఓట్లతో అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు, నవంబరు 17న బాధ్యతలను స్వీకరించాడు.

అధ్యక్ష ఎన్నికలు, తాజాగా జరిగిన పార్లమెంటు ఎన్నికలకు ఒక ప్రత్యేకత ఉంది. చిన్నదైనా పెద్దదైనా ఏ దేశంలోనూ విదేశాలతో సంబంధాల ప్రాతిపదికన ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. చైనా - భారత్ మధ్య పోటీగా ఇక్కడ జరిగాయి. అందుకే అసలు విజేత చైనా అన్నట్లుగా వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. " అధ్యక్ష ఎన్నికలు తమ పౌరుల దేశభక్తికి ఒక ప్రతిబింబమని, మా ఇరుగు పొరుగు వారు, భాగస్వాములు తమ స్వాతంత్య్రం, సర్వసత్తాకతను పూర్తిగా గౌరవించాలని ఇచ్చిన ఒక పిలుపు " అని పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ ప్రతినిధి వ్యాఖ్యానించాడు.పార్లమెంటు ఎన్నికలు మరింత తీవ్రంగా జరిగాయి. చైనా బిఆర్‌ఐ పథకం కింద పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసిన గత ప్రభుత్వంలో గృహశాఖ మంత్రిగా ముయిజ్జు పనిచేశాడు. తాను అధికారానికి వస్తే రెండు దేశాల మధ్య మరో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతానని ఎంతో ముందుగానే ప్రకటించాడు.చెప్పినట్లుగానే భిన్నమైన రీతిలో వ్యవహరిస్తున్నాడు.గతంలో మాల్దీవుల్లో ఎవరు అధికారానికి వచ్చినా తొలి విదేశీ పర్యటన భారత్‌తోనే ప్రారంభమయ్యేది. అలాంటిది ముయిజ్జు తొలుత టర్కీ, తరువాత యుఏఇ, చైనా పర్యటించాడు.2019లో మనదేశంతో కుదుర్చుకున్న జలవాతావరణ(హైడ్రాలజీ) పరిశీలన పథకం నుంచి మాల్దీవులు వైదొలిగింది. అక్కడ ఉన్న కొద్ది మంది మన సైనికులను కూడా దశలవారీ మే 10వ తేదీలో వెనక్కు వెళ్లాలని కోరింది. రద్దీగా ఉండే తూర్పు-పశ్చిమ దేశాల నౌకా రవాణా మార్గంలో మాల్దీవులు కీలకమైన ప్రాంతంలో ఉంది. అమెరికా విశాల మిలిటరీ వ్యూహంలో హిందూ మహాసముద్రం ఎంతో ముఖ్యమైనది. బ్రిటీష్ ఆక్రమించిన మారిషస్‌కు చెందిన డిగోగార్సియా దీవులను అమెరికా తన ఆధీనంలోకి తెచ్చుకొని ఖాళీ చేసేందుకు మొరాయిస్తున్నది. అక్కడ ఒక సైనిక స్థావరాన్ని కూడా నిర్మించింది. మనదేశంలోని కన్యాకుమారికి ఆ దీవులు 1,796కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. అది మనదేశంతో పాటు పరిసరాల్లోని అన్ని దేశాలకూ ఆందోళన కలిగించే అంశమే. బంగాళాఖాతం,హిందూ మహాసముద్రం, అరేబియా సముద్ర ప్రాంతంలోని కొన్ని దేశాలు అమెరికా పట్టునుంచి విడివడటం, అవి క్రమంగా చైనాకు సన్నిహితం కావటం పశ్చిమ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. తమ విదేశాంగ విధానంలో కొన్ని మార్పులు చేశాం తప్ప ఎవరివైపూ మొగ్గటం లేదని ముయిజ్జు ప్రకటించాడు.

మాల్దీవుల ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత కారణంగా 1965లో బ్రిటన్ ఆక్రమణ నుంచి స్వాతంత్య్రం పొందిన తరువాత మన దేశం అన్ని రంగాలలో దగ్గరయ్యేందుకు చూసింది. 1988లో దాదాపు రెండు వందల మంది తమిళ ఉగ్రవాదులు మాల్దీవులకు వెళ్లి నాటి అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ మీద తిరుగుబాటు చేసి కీలకమైన



అధ్యక్షుడు ముయిజ్జు అనుసరిస్తున్న విధానాలతో విబేధించిన ప్రతిపక్షం పార్లమెంటులో తనకు ఉన్న మెజారిటీని ఆధారం చేసుకొని అభిశంసన తీర్మానం ద్వారా తొలగించేందుకు కూడా చూసింది. తాజా ఎన్నికల్లో అధికార పక్షం నాలుగింట మూడువంతులకు పైగా స్థానాలు సాధించటంతో అలాంటి ముప్పు తొలగటమే గాక అధ్యక్షుడికి మరింత పట్టుదొరికింది. జనవరిలో చైనా పర్యటన జరిపిన ముయిజ్జు అనేక ఒప్పందాలు చేసుకున్నాడు. ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలను జనం బలపరిచినట్లు ఫలితాలు స్పష్టం చేశాయి. ఇంతవరకు మనదేశ పర్యటనకు రాలేదు. మాల్దీవులకు భారత్ స్నేహ హస్తం చాచేందుకు విముఖత చూపితే చైనాపై మరింతగా ఆధారపడతారని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మాల్దీవులకు పర్యాటకులు వెళ్లవద్దని అధికారికంగా మన ప్రభుత్వం చెప్పకపోయినా జరిగిన పరిణామాలను చూస్తే నష్టం జరిగిందన్నది స్పష్టం.

ప్రాంతాలన్నింటినీ పట్టుకున్నారు. తమను ఆదుకోవాలని అనేక దేశాలను గయూమ్ కోరినా ఎవరూ ముందుకు రాలేదు. భారత్ స్పందించింది, ఆపరేషన్ కాక్టస్ పేరుతో కుట్రను విఫలం చేసి అనేక మంది కుట్రదారులను కాల్చి చంపి, కొందరిని బందీలుగా పట్టుకుంది. అప్పటి నుంచి సంబంధాలు మరింతగా బలపడ్డాయి. తరువాత జరిగిన పరిణామాల్లో దీవుల ఆర్థిక సమస్యలను, పౌరుల జీవితాలను మెరుగుపరచటంలో పాలకుల వైఫల్యం కారణంగా జనంలో అసంతృప్తి తలెత్తింది.

సరిగ్గా అదే సమయంలో చైనా తన బిఆర్‌ఐ పథకాన్ని ముందుకు తెచ్చింది. ఐఎంఎఫ్, ప్రపంచబాంక్, అమెరికా, ఇతర పశ్చిమదేశాల మాదిరి కఠినమైనవి కాకుండా సాధారణ షరతులతో ప్రాజెక్టులకు చైనా రుణాలు ఇచ్చింది. దాంతో 2013లో అధికారానికి వచ్చిన అబ్దుల్లా యామిన్ చైనాతో సంబంధాలను పెంచుకున్నాడు. 2018లో గెలిచిన ఇబ్రహీం సాలి భారత్‌కు పెద్దపీట అనే విధానంతో మన దేశానికి సన్నిహితంగా భాగస్వామ్య ఒప్పందాలను చేసుకున్నాడు. అది ఎన్నికల్లో పెద్ద చర్చ నీయాంశంగా మారింది. ప్రతిపక్షాలుగా ఉన్న మాల్దీవుల ప్రోగ్రెసివ్ పార్టీ, పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ ఒక కూటమిగా ఏర్పడి " భారత్‌ను బయటకు పంపాలి(భారత్ అవుట్) " అనే నినాదమిచ్చాయి. మనదేశం అనుసరించిన కొన్ని విధా నాలు, అంతర్గత వ్యవహారాల్లో జోక్యంతో జనంలో ఉన్న భారత వ్యతిరేక మనోభావాలు కూడా దీనికి దోహదం చేశాయి. మనదేశానికి చెందిన జిఎంఆర్ కంపెనీ మాలెలోని విమానాశ్రయ అభివృద్ధి నిర్వహణ బాధ్యతలు తీసుకుంది.విదేశీ ప్రయాణీకులతో పాటు మాల్దీవుల పౌరుల మీద అభివృద్ధి పన్ను విధించటంతో అక్కడ వ్యతిరేకత వెల్లడైంది. దాని వెనుక మాజీ అధ్యక్షుడు నషీద్ మద్దతు ఉందని జనం భావించారు. అవినీతి ఆరోపణల కేసులో అరెస్టు కాకుండా తప్పించు కొనేందుకు అతగాడు భారత రాయబార కార్యాలయంలో ఆశ్రయం పొందాడు. అది కూడా జనంలో మనదేశం మీద వ్యతిరేకత పెరిగేందుకు దోహదం చేసింది.

మాల్దీవుల విదేశాంగ విధానంలో వచ్చిన మార్పులో చైనా వైపు మొగ్గుదల మననేతలకు సహజంగానే రుచించలేదు. ఒక స్వతంత్ర దేశం, అందునా కీలక ప్రాంతంలో ఉన్నందున దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరించుకొనేందుకు, కనీసం మరింత దిగజారకుండా చూసుకొనేందుకు ప్రయత్నించటం రాజనీతిజ్ఞుల లక్షణం. ఏ కారణంగానైనా దూరంగా జరిగినా, వైరం పెరిగినా ప్రత్యర్థుల ఆర్థిక మూలాలను దెబ్బతీయటం ఒక ప్రధాన ధోరణిగా కనిపిస్తున్నది.వాణిజ్య యుద్ధాలు, దిగుమతులు, ఎగుమతులు, సాంకేతిక పరిజ్ఞానం అందచేత, పెట్టుబడులపై నిషేధాలు వాటిలో భాగమే. ఒక దేశం, దేశనేతలను కించపరిస్తే ఎవరూ సహించాల్సిన అవసరం లేదు. అధికారికంగా నిరసన తెలపటం అనేక ఉదంతాల్లో జరిగింది. సామాజిక మాధ్యమాల్లో మన ప్రధాని నరేంద్రమోడీని అవమానించినందుకుగాను మాల్దీవులకు తగిన బుద్ధి చెప్పాలని, అందుకు మన విహార యాత్రికులు అక్కడికి వెళ్లటం మానుకోవాలని మన దేశంలోని వారు సామాజిక మాధ్యమంలో పిలుపులిచ్చారు. ఒక విమానయాన సంస్థ నిరవధికంగా ప్రయాణాలను నిలిపివేసినట్లు ప్రకటించింది. మోడీ, భారత్‌ను సామాజిక మాధ్యమంలో కించపరుస్తూ వ్యాఖ్యానించినందుకు మల్షా షరీఫ్, మరియం షిహునా, అబ్దుల్లా మర్జూన్ మజీద్ అనే ముగ్గురు ఉప మంత్రులను అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు సస్పెండ్ చేశారు. మోడీని వారు హాస్యగాడు, ఉగ్రవాది, ఇజ్రాయిల్ తొత్తు అని, మన దేశంలో పరిశుభ్రత తక్కువ అని పేర్కొన్నారు. అరేబియా సముద్రంలోని మన లక్షద్వీప్‌లో విహార యాత్రలను ప్రోత్సహించేందుకు గాను మోడీ ఒక బీచ్‌లో కూర్చున్న వీడియోను పోస్టు చేసిన తరువాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. తమ దేశానికి యాత్రికులు రాకుండా చేసేందుకే ఇలా చేశారని అక్కడి కొందరు భావించారు. ప్రధానిని కించపరచటం గురించి మాలే లోని మన రాయబారి అక్కడి

సామాజిక మాధ్యమాల్లో మన ప్రధాని నరేంద్రమోడీని అవమానించినందుకుగాను మాల్దీవులకు తగిన బుద్ధి చెప్పాలని, అందుకు మన విహార యాత్రికులు అక్కడికి వెళ్లటం మానుకోవాలని మన దేశంలోని వారు సామాజిక మాధ్యమంలో పిలుపులిచ్చారు. ఒక విమానయాన సంస్థ నిరవధికంగా ప్రయాణాలను నిలిపివేసినట్లు ప్రకటించింది. మోడీ, భారత్‌ను సామాజిక మాధ్యమంలో కించపరుస్తూ వ్యాఖ్యానించినందుకు మల్షా షరీఫ్, మరియం షిహునా, అబ్దుల్లా మర్జూన్ మజీద్ అనే ముగ్గురు ఉప మంత్రులను అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు సస్పెండ్ చేశారు. మోడీని వారు హాస్యగాడు, ఉగ్రవాది, ఇజ్రాయిల్ తొత్తు అని, మన దేశంలో పరిశుభ్రత తక్కువ అని పేర్కొన్నారు. అరేబియా సముద్రంలోని మన లక్షద్వీప్‌లో విహార యాత్రలను ప్రోత్సహించేందుకు గాను మోడీ ఒక బీచ్‌లో కూర్చున్న వీడియోను పోస్టు చేసిన తరువాత ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

ప్రభుత్వానికి నిరసన తెలిపారు. మాల్దీవుల ప్రతిపక్ష నేతలు అధ్యక్షుడి మీద అవిశ్వాస తీర్మానం పెడతామనే వరకు వెళ్లారు. సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలను తాము గమనించామని, అవి వారి వ్యక్తిగతం తప్ప అధికారిక వైఖరి కాదని అక్కడి ప్రభుత్వం ఒక ప్రకటన కూడా చేసింది. జరిగినదాని మీద అధ్యక్షుడు ముయిజ్జు విచారణకు ఆదేశించారని రాయిటర్స్ పేర్కొన్నది. కారణాలు ఏవైనప్పటికీ మనదేశం నుంచి మాల్దీవులకు వెళుతున్న పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అక్కడి ప్రభుత్వం తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం గతేడాది జనవరి-మార్చి మాసాల మధ్య మన దేశం నుంచి 56,208 మంది మాల్దీవులకు వెళితే ఈ ఏడాది 34,847కు (38శాతం) తగ్గింది. అదే చైనా నుంచి వచ్చిన వారు 17,691 నుంచి 67,399 (281శాతం) పెరిగారు. అక్కడకు విదేశాల నుంచి వచ్చేవారిలో చైనా వాటా పది నుంచి అగ్రస్థానానికి చేరగా, మనదేశం మూడు నుంచి ఆరవ స్థానానికి తగ్గింది.

అధ్యక్షుడు ముయిజ్జు అనుసరిస్తున్న విధానాలతో విబేధించిన ప్రతిపక్షం పార్లమెంటులో తనకు ఉన్న మెజారిటీని ఆధారం చేసుకొని అభిశంసన తీర్మానం ద్వారా తొలగించేందుకు కూడా చూసింది. తాజా ఎన్నికల్లో అధికార పక్షం నాలుగింట మూడువంతులకు పైగా స్థానాలు సాధించటంతో అలాంటి ముప్పు తొలగటమే గాక అధ్యక్షుడికి మరింత పట్టుదొరికింది. జనవరిలో చైనా పర్యటన జరిపిన ముయిజ్జు అనేక ఒప్పందాలు చేసుకున్నాడు. ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలను జనం బలపరిచినట్లు ఫలితాలు స్పష్టం చేశాయి. ఇంతవరకు మనదేశ పర్యటనకు రాలేదు. మాల్దీవులకు భారత్ స్నేహ హస్తం చాచేందుకు విముఖత చూపితే చైనాపై మరింతగా ఆధారపడతారని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మాల్దీవులకు పర్యాటకులు వెళ్లవద్దని అధికారికంగా మన ప్రభుత్వం చెప్పకపోయినా జరిగిన పరిణామాలను చూస్తే నష్టం జరిగిందన్నది స్పష్టం.

హనైమధూ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌తో సహా అనేక మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకాలలో దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వరకు మనదేశం పెట్టుబడులు ఉన్నాయి. వాటికి ఎలాంటి ముప్పు రాదు.మాల్దీవు ఎన్నికల్లో చైనా-భారత్‌లతో సంబంధాల గురించి పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అంతమాత్రాన వెల్లడైన తీర్పును ఆ ఒక్క అంశానికే ఆపాదించటం, మనదేశానికి వ్యతిరేకంగా పరిగణించాల్సిన అవసరం లేదు. అభివృద్ధి పథకాలకు పెట్టుబడులు కావాలని కోరినపుడు అనేక పశ్చిమ దేశాలు అక్కడ హక్కులకు భంగం కలిగించే పాలకులు ఉన్నారంటూ నిరాకరించాయి. ఆ సమయంలో చైనా ముందుకు వచ్చింది. హక్కులు, పాలన అనేది ఆయాదేశాల అంతర్గత వ్యవహారాలు, వాటికి పెట్టుబడులను ముడిపెడితే రాజకీయ పరిణామాలు, పర్యవసానాలు ఎలా ఉండేది చెప్పలేము.

అయ్యో..!

చెట్టుపైన కాకి కూసింది
పలుగాకులన్నీ వచ్చి చేరాయి
మేత కోసం కాదని తెలిసాక
రెక్కలకు పని చెప్పాయి
అయ్యో ఇంతేనా నేటి స్థితి..!!



జెండాలన్నీ కొలువైనాయి
అజెండాలన్నీ మొహం తిప్పాయి
మెలితిరిగిన నోటికి ఎన్ని తిప్పలో
కలిసుందామనుకున్నవన్నీ
కలిసి చేద్దామని నిర్ణయించాక
చెదిరిపోయిన సంఘటనలెన్నెన్నో
అయ్యో ఇదేనా నేటి కూటమంటే..!!

విలువైన కాగితాలన్నీ
అర్ధరాత్రి నిద్ర లేచాయి
దొడ్డి దారుల్లో పరుగులు పెట్టాయి
జేబులన్నీ తెరుచుకున్నాక
మరో కలుగులోకి దూరిపోయాయి
అయ్యో ఇంతేనా పంచుకోవడమంటే!

అడిగినవన్నీ మరిపించి
చేతికొచ్చింది జారవిడిచి
దులిపేసుకున్న తీరులన్నీ నవ్వుకున్నాయి
ఎటూ కాని తికమకలో
మరో దారి చూసుకున్నాయి
అయ్యో ఇదేనా నమ్మకమంటే..!!

గాలి కబుర్లకు స్వరం కలిపి
నేటి గతులకు చరమగీతం పాడి
ఎగిరిన గుడ్డముక్కలన్నీ
కండ్లపై పడి లోకాన్ని మరిపించాయి
అయ్యో ఇదేనా రాజకీయమంటే..!!

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

ముసోలిని మరణం నియంతలకు నీతిసూత్రం

కొందరి చావుకు మనుషులను కదిలించే, దుర్మార్గాలను ఆపే, క్రూరత్వం, మానవత్వం వైపు ఆలోచింపజేసే శక్తి ఉంటుంది. కొన్నిసార్లు అది సంతృప్తినిస్తుంది. సంతోషపెడుతుంది. ఏప్రిల్ 28, 1945న ఇటలీ నియంత బెనిటొ ముసోలిని చావు అలాంటిదే.రోమ్ ప్రాచీన గౌరవాన్ని పునరుద్ధరిస్తానని ప్రగల్భించిన ముసోలిని, ఆయన భార్య క్లారా పెటాచిల శవాలు మిలాన్ నగర ప్రధాన కూడలి పియాజలె లోరెటొలో గ్యాస్‌స్టేషన్ ముందర తలకిందులుగా వేలాడాయి.



సంగిరెడ్డి హనుమంత రెడ్డి
9490204545

ముసోలిని ప్రపంచ రాజనీతిజ్ఞుల్లో ఒకడు. 1922లో ఇటలీ అధికారాన్ని చేపట్టిన బలశాలి. ప్రథమ ప్రపంచ యుద్ధం తర్వాత శాంతిని పునరుద్ధరించాడు. ఫాసిస్టు పార్టీని, ప్రత్యర్థుల హత్యకు నల్లచొక్కాల సైన్యాన్ని స్థాపించాడు. ఇటలీని సైనికశక్తిగా దిద్దాడు. తనను డ్యూస్ (నాయకుడు) అని పిలుచుకున్నాడు. ప్రభుత్వం గ్రాండ్ కౌన్సిల్ అధీనంలో ఉంది. ఇటలీ ముసోలిని అధికార క్రీడాస్థలం. అది ఫాసిజం కాదు. ముసోలినిజం. మోడీయిజం లాగా. 1930లలో ముసోలిని గొప్ప ప్రజావిగ్రహం. లక్షలాది అనుచరులు డ్యూస్ అని నినదిస్తుండగా, భట్రాజులు భజిస్తుండగా, కోటరీ పూజిస్తుండగా సెయింట్ మార్క్ భవనం పలాజొ వెనెజియ వరండాలో విలాసంగా కూర్చునేవాడు. (పార్లమెంటులోనే మోడీ అని పొగిడినట్లు. మోడీ తప్ప మరెవరు చేయగలరని మోడీ విర్రవీగినట్లు) ఆదేశాలిస్తున్న, గుర్రపుస్వారి చేస్తున్న, విమానంలో ఎగురుతున్న, పందెపు కారు నడుపుతున్న భంగిమల్లో ఫొటోలు దిగేవాడు. (మోడీ సెల్ఫీల లాగా)మండుటెండలో నడుంగుడ్డతో రైతులతో మాట్లాడేవాడు. సింహం పిల్లతో కుస్తీపట్టేవాడు. ప్రచారానికి ఈ ఫొటోలను దేశమంతా ప్రదర్శించేవారు. (కోవిడ్ టీకాలు, ప్రభుత్వ పత్రాల్లో మోడీ బొమ్మను ముద్రించినట్లు) ఇటలీ కవి డాంటె పద్యాలను పాడేవాడు.(శ్రీశ్రీ, గురజాడల గేయాలను మోడీ ఉచ్ఛరించినట్లు) ప్రజల కోసం రాత్రంతా పనిచేస్తున్నాడని నమ్మించేందుకు, ముసోలిని నిద్రపోయినా, రాత్రంతా గదిలో దీపాలుండేవి. డ్యూస్ ఎప్పుడూ న్యాయబద్ధుడేనన్న నినాదం ప్రజలకందేది. (ప్రజాశ్రేయస్సు, దేశాభివృద్ధే లక్ష్యంగా మోడీ 18 గంటలు పనిచేస్తాడని సంఘీయులు బాకాలూదినట్లు)

ప్రభుత్వానికి, చర్చికి మధ్య వివాదాన్ని ముగిస్తూ చర్చితో 1929లో ఒప్పందం చేసుకున్నాడు. రోమన్ క్యాథలిక్ సమాజంలో ఇది ముసోలినికి 98శాతం ఓట్లను తెచ్చిపెట్టింది. (మోడీ హిందుత్వ సమీకరణ లాగా) ప్రజాప్రయోజన పనులు, రోమ్ పరివాహక చిత్తడినేలల నుండి నీటిని తోడే ప్రయత్నాలు జరిగాయి. ఆర్థిక వ్యవస్థను కార్పొరేటీకరించాడు. దేశాన్ని 22 కార్పొరేట్లుగా మార్చి పరిశ్రమల, ముడిలోహాల అభివృద్ధి, సరుకు ఉత్పత్తి, పంపిణీలను వాటికి అప్పజెప్పాడు. కార్మికులు, యాజమాన్యాల మధ్య సంధి ఏర్పాటు ఈ కార్పొరేట్ల పని. సంధి కుదరకపోతే కార్మికులు ప్రభుత్వ మధ్యవర్తిత్వానికి కట్టుబడి ఉండాలి. పరిశ్రమల్లో నిరసనలను, సమ్మెలను నిషేధించారు.ఆచరణలో అసాధ్య, అవాస్తవ పౌరాణిక పంథా ప్రచారం జరిగింది.సమ్మెలు, సంఘాల నిషేధం కార్మికులపై సమ్మెటపోటుగా మారింది. యాజమాన్యం లాభపడింది. ముసోలిని పాలనలో వస్తూత్పత్తి, సేవల పంపిణీ, జాతి ఆర్థిక జీవన నిర్ణయాలు ప్రభుత్వం నుండి పారిశ్రామికవేత్తలకు మారాయి.ప్రజలు స్వేచ్ఛను కోల్పోయారు. ఇటలీ ఫాసిస్టు సమాజంగా మారింది. పౌరజీవితాలు రాజ్యం అధీనంలోకి వచ్చాయి. (కార్మిక చట్టాలతో కార్పొరేట్ల సేవలో మోడీ తరించినట్లు)

విరామ సమయంలో ప్రజలు ఫాసిస్టు సంస్థ డోపొలవోరొ ఆదేశంలో క్లబ్బుల్లో, పబ్బుల్లో, బార్లలో, క్రీడాస్థలాల్లో, గ్రంథాలయాల్లో, సెలవు కేంద్రాల్లో పనిచేయాలి. పిల్లలు 'యువ ఫాసిస్టు' సంస్థల్లో చేరాలి. నియంతృత్వం ప్రజల నిష్క్రియా విధేయతను కోరుకుంటుంది. ముసోలిని ఫాసిజం ప్రజల స్థిరప్రమేయాన్ని, అత్యుత్సాహ భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేసింది. ప్రభుత్వ రహస్య పోలీసు వోవ్ర ప్రజల ప్రవర్తనను తెరవెనుక నుండి గమనిస్తూ ఉంటుంది. రాజకీయ ప్రత్యర్థులను, పాలనా విధానాలను ప్రశ్నించేవారిని అరెస్టుచేసి, కొట్టి చంపుతుంది. ఒకనాటి స్వేచ్ఛాపౌరులు రాజ్యాన్ని తప్పక సమర్థించాల్సిన స్థితికి నెట్టబడ్డారు. "విశ్వసించు, విధేయతను పాటించు, రాజ్య సంక్షేమానికి పోరాడు." అన్న నినాదాలే శరణ్యం. (మోడీ ఎన్ఐఎ., సిబిఐ, ఇడి, ఐటి శాఖల దాడుల్లాగా)



1945 ఏప్రిల్‌లో ముసోలిని, పెళ్లాడని పెటాచి, కొందరు సైనికులు, జర్మన్ కాపాలాదారులు మిలాన్ నుంచి స్విస్ సరిహద్దు ప్రాంతం కోమో సరస్సు వైపు వెళ్లారు. రెండు రోజుల తర్వాత శత్రువులు ముసోలినిని గుర్తించారు. మరుసటి రోజు ముసోలినిజంను కోమో సరస్సు ఒడ్డున చిన్న పట్టణం గిలినొ డిమెజెగ్రకు తెచ్చి కాల్చిచంపారు. చనిపోయిన నా ఐదుగురు కుమారుల ప్రతీకారం అంటూ ఒక స్త్రీ ముసోలిని మృతదేహంపై ఐదు గుండ్లు పేల్చింది.ఏ భావజాలం పనిచేయలేదు. డ్యూస్ అని పొగిడిన ప్రజలే ముసోలినిని ఛీదరించుకున్నారు.శవాన్ని తిట్టారు, తన్నారు, ఉమ్మేశారు.బహుశా ఇందులో ముసోలినికి సాటిగా హిట్లర్ నిలుస్తాడు. నేడు ప్రపంచంలో పెరిగిన నియంతలు ముసోలిని మరణం నుంచి గుణపాఠం నేర్చుకోవాలి.

ముసోలిని విదేశీ విధానం దుర్భర పరిస్థితులను తెచ్చిపెట్టింది. ఇటలీ సైనిక గౌరవాన్ని గెలవడం, ప్రాచీన ఘనతను పునరుద్ధరించడం లక్ష్యాల్లో కొన్ని. రోమన్ సామ్రాజ్య పునఃసృష్టిని గురించి ముసోలిని నిరంతరం మాట్లాడేవాడు. మధ్యధరా సముద్రం మనదే అనేవాడు. సామ్రాజ్యవాద విధి, ఇటలీ వందన విధానాల గురించి ప్రజలకు గుర్తుచేసేవాడు. ఇటాలియన్లు నివసించే విదేశ భూభాగాలన్నీ ఇటలీ భాగాలే, ఇవి విమోచన పొందని ఇటలీ అని ప్రచారం చేసేవాడు. (సంఘ్ వైదిక సంస్కృతి, అఖండ భారత్ నినాదాల్లాగా)

ఆఫ్రికాలో, ప్రత్యేకించి తూర్పు ఆఫ్రికా రాజ్యం ఇథోపియాలో, వలస రాజ్య స్థాపన ముసోలిని లక్ష్యం. నిత్యం దాడి గురించి మాట్లాడడమే గాక త్రివిధ దళాల సైన్యాలను పెంచాడు. మౌలిక సౌకర్యాలు లేని ఇటలీకి ఇది ఖరీదైన అంశం. ఫ్రాన్స్, బ్రిటన్‌లతో సహా ఇటలీ పొరుగు దేశాలు ముసోలిని సైనిక విస్తరణ, యుద్ధకాంక్షలను తీవ్రంగా పరిగణించాయి. ఇటలీ దాడికి భయపడ్డాయి. ఈ తడబాటు హిట్లర్ జర్మనీ పట్ల ఫ్రాన్స్, బ్రిటన్‌ల కఠిన వైఖరికి కారణమైంది. హిట్లర్ కౌగిలి ముసోలినికి ప్రాణాంతకమైంది. 1940 జూన్‌లో జర్మన్ సైన్యాలు ఐరోపా దాడులకు దిగాయి. ముసోలిని ఫ్రాన్స్, బ్రిటన్‌లపై యుద్ధం ప్రకటించాడు. సైన్యంపై ఖర్చులు ఫలితాలనిస్తాయని, తాను కొత్త ఇటలీని నిర్మిస్తానని, విశ్వ యోధుడనవుతానని నమ్మాడు. (కొత్త భారత్, విశ్వగురు ప్రచారాల్లాగా).కాని అలా జరగలేదు. హిట్లర్‌తో కలయిక ఇటలీని విపత్తులకు గురిచేసింది. 1940 సెప్టెంబర్‌లో ఇటలీ లిబియా నుంచి 1,30,000 మంది సైనికులతో ఈజిప్టుపై దాడిచేసింది. 50 మైళ్ళు పయనించిన తర్వాత మార్షల్ రొడోల్ఫొ గ్రజియాని నెల్ల తరబడి కొత్త దారులు నిర్మించుకొని లిబియాకు తిరిగివచ్చాడు. అక్టోబర్‌లో అల్బేనియా నుంచి ఇటలీ సైన్యం గ్రీస్‌పై దాడిచేసింది. గ్రీకు సైన్యం ఇటలీ సైన్యాన్ని తిప్పికొట్టింది. గ్రీస్‌కు సహాయంగా బ్రిటన్ సైన్యాన్ని పంపింది. నవంబర్‌లో ఇటలీ నౌకాదళాన్ని ధ్వంసం చేసింది.

1940 డిసెంబర్ నుంచి 1941 ఫిబ్రవరి వరకు బ్రిటిష్ సైన్యం ఈజిప్టులోని ఇటలీ సైన్యాన్ని నాశనం చేసింది. అమెరికా మిత్రపక్షాలు 1942 చివర ఇటలీ నగరాలను, 1943 జులైలో సిసిలీని, సెప్టెంబర్‌లో మొత్తం ఇటలీని ఆక్రమించుకున్నాయి. ముసోలిని అధికారం కోల్పోయి జైలుపాలయ్యాడు. తర్వాత 20 నెలలు జర్మనీ మిత్రపక్షాలతో యుద్ధం చేసినా ఇటలీ నగరాలు దెబ్బతిన్నాయి, ప్రజలు మరణించారు. 1943 సెప్టెంబర్‌లో జర్మన్ కమాండోలు జైలుపై దాడిచేసి ముసోలినిని విడిపించారు. ముసోలిని జర్మన్ చేతిలో కీలుబొమ్మ. అతని జీవితం హిట్లర్‌పై ఆధారపడింది. ముసోలినికి కొత్తగా స్థాపించిన జర్మనీ అనుబంధ ఇటలీ రిపబ్లిక్ సాలొ బాధ్యతలు అప్పజెప్పారు.

మిత్రపక్షాలు సాలొను ఆక్రమించాయి. ముసోలిని మిలాన్‌కు పారిపోయాడు. 1945 ఏప్రిల్‌లో ముసోలిని, పెళ్లాడని పెటాచి, కొందరు సైనికులు, జర్మన్ కాపాలాదారులు మిలాన్ నుంచి స్విస్ సరిహద్దు ప్రాంతం కోమో సరస్సు వైపు వెళ్లారు. రెండు రోజుల తర్వాత శత్రువులు ముసోలినిని గుర్తించారు. మరుసటి రోజు ముసోలినిజంను కోమో సరస్సు ఒడ్డున చిన్న పట్టణం గిలినొ డిమెజెగ్రకు తెచ్చి కాల్చిచంపారు. చనిపోయిన నా ఐదుగురు కుమారుల ప్రతీకారం అంటూ ఒక స్త్రీ ముసోలిని మృతదేహంపై ఐదు గుండ్లు పేల్చింది.ఏ భావజాలం పనిచేయలేదు. డ్యూస్ అని పొగిడిన ప్రజలే ముసోలినిని ఛీదరించుకున్నారు.శవాన్ని తిట్టారు, తన్నారు, ఉమ్మేశారు.బహుశా ఇందులో ముసోలినికి సాటిగా హిట్లర్ నిలుస్తాడు. నేడు ప్రపంచంలో పెరిగిన నియంతలు ముసోలిని మరణం నుంచి గుణపాఠం నేర్చుకోవాలి.

బీజేపీ పచ్చి దోపిడీ దొంగల పార్టీ

బలహీన వర్గాలకు ఆ పార్టీ బద్ధ శత్రువు
మోడీ ప్రధానియా..? మత ప్రచారకుడా..?

- రాజ్యాంగ రక్షకులు ఐక్యం కావాలి
- మతోన్మాదుల చెర నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి
- బీజేపీకి ఓటేయమని మందకృష్ణ చెప్పడం పచ్చి మోసం : అంబేద్కర్, పూలే జన జాతర సదస్సులో.. రిటైర్డ్ హైకోర్టు జడ్జి చంద్రకుమార్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

'అక్రమార్కుల నుంచి ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో వేల కోట్లు లంచాలు తీసుకున్న బీజేపీ పచ్చి దోపిడీ, దొంగల పార్టీ. యుద్ధంలో వాడే డ్రోన్స్ కొనుగోలులో కూడా మోడీ అక్రమాలకు పాల్పడ్డారు. బడుగు, బలహీన వర్గాలకు బీజేపీ బద్ధ శత్రువు. దేవుని పేరిట ఓట్లడగడం ద్రోహం, పచ్చి మోసం. రాజ్యాంగం ప్రకారం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించడమనేది ప్రభుత్వాల కనీస కర్తవ్యం. ప్రజల యోగక్షేమాలు పట్టించుకోకుండా రాజ్యాంగాన్ని అమలు చేయకుండా దేవుడి పేరు చెప్పి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న మోడీ దేశానికి ప్రధానియా..? లేక హిందు మత ప్రచారకుడా..?" అని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్ ప్రశ్నించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో కేవీపీఎస్ ఆధ్వర్యంలో 'అంబేద్కర్, పూలే జన జాతర' పేరిట నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. మనుధర్మ శాస్త్రం, కర్మ సిద్ధాంత పేరిట 80 శాతంగా ఉన్న ప్రజల్ని శూద్రులుగా ముద్ర వేసి కుల వ్యవస్థను సృష్టించారన్నారు. అలాంటి శూద్రులకు చదువు, స్వేచ్ఛ, సమానత్వం, మాట్లాడే, జీవించే స్వేచ్ఛ కల్పించిన రాజ్యాంగాన్ని రద్దు చేయాలని మోడీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నాయన్నారు.

మళ్లీ మోడీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో ప్రాచీన కాలం నాటి మనుధర్మ శాస్త్రాన్ని తెచ్చి పెట్టే ప్రమాదముందని హెచ్చరించారు. లౌకిక విధానానికి తూట్లు పొడుస్తూ మత విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లు పొందాలని చూస్తున్న మోడీపై ఎన్నికల సంఘం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ చర్యలు చూస్తుంటే ఆయన ప్రధాన మంత్రి భారతీయులకా..? లేక హిందువులకేనా..? అనే అనుమానం కలుగుతుందన్నారు. పదేండ్ల బీజేపీ పాలనలో 300 రెట్లు దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకిచ్చిన హామీలేవీ అమలు కాలేదన్నారు. రూ.72 లక్షల కోట్ల నల్లధనాన్ని తెచ్చి పంచుతానని చెప్పిన మోడీ పచ్చి మోసకారి అని అన్నారు. మనుస్మృతి శక్తులకు, రాజ్యాంగ శక్తులకు మధ్య జరుగుతున్న ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మనుస్మృతి వారుసులుగా ఉన్న బీజేపీని చిత్తుగా ఓడించాలని పిలుపు నిచ్చారు.

మతోన్మాదుల చెర నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి: స్కైలాబ్ బాబు

మతోన్మాదుల చెర నుంచి భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పిలుపు నిచ్చారు. రాజ్యాంగాన్ని రద్దు చేసి చాతుర్వర్ణ వ్యవస్థను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీకి ఓట్లు వేయాలని మందకృష్ణ మాదిగ చెప్పడం పచ్చి మోసమన్నారు. వందల పురుగుల్ని తిన్న బల్లి రాముడి ఫొటో చాటున దాక్కున్న చందంగా రాజ్యాంగాన్ని రద్దు చేసి నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను తెస్తామంటున్న మోడీ.. రాముని పేరు చెప్పి ఓట్లడుగుతున్నాడని విమర్శించారు. నల్ల చట్టాలు తెచ్చి రైతుల్ని, లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మిక వర్గాన్ని, రాజ్యాంగాన్ని రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్ని, మత రాజ్యాన్ని తెచ్చి లౌకిక వాదాన్ని దెబ్బతీయాలని చూస్తున్న బీజేపీని ఎన్నికల్లో చిత్తుగా ఓడించడమే పరిష్కారమన్నారు. మనిషిని మనిషిగా చూడని దుర్మార్గమైన వ్యవస్థను రూపుమాపేందుకు మహానీయులు జ్యోతిరావు పూలే, అంబేద్కర్ పోరాడారని గుర్తుచేశారు. ఆ మహానీయులు సాధించిన హక్కుల్ని కాపాడుకోవాలంటే మనువాద శక్తులైన బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. పోరాటాల గడ్డ అయిన తెలంగాణలో మతోన్మాదుల ఆగడాల్ని సాగనివ్వొద్దని, బీజేపీని ఎదుర్కొనేందుకు ఇండియా కూటమిని బలపర్చాలని కోరారు. సదస్సు ప్రారంభానికి ముందు మహానీయుల చిత్రపటాలకు పూలమాల వేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అతిమేల మాణిక్యం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ వైద్యులు డాక్టర్ కృష్ణమూర్తి, సీనియర్ దళిత నాయకులు అనంతయ్య, న్యాయవాది రామారావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి నాగభూషణం, అవాజ్ జిల్లా నాయకులు ఖయ్యూం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, వ్యకాస జిల్లా కార్యదర్శి ఎం.నర్సింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, న్యాయవాది సుభాష్‌రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, వివిధ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కాల్పులు జరిపిన చరిత్ర కాంగ్రెస్‌ది

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఎర్రజొన్న రైతులు ఆందోళన చేస్తే కాల్పులు జరిపి, కేసులు పెట్టిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. రైతాంగాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదంటూ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గతంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి పసుపు బోర్డు రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. యాభై ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎందుకు తన హయాంలో ఆ బోర్డు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. పసుపు బోర్డు ఏర్పాటు సాధ్యం కాదని చెప్పిన బీజేపీ ఎన్నికల్లో రైతుల ఓట్ల కోసం ప్రధానితో అబద్ధపు ప్రకటన చేయించిందని విమర్శించారు. అడ్రస్ లేని బోర్డును ఆకాశంలో చూపెట్టి లబ్ది పొందేందుకు

ఆ రెండు పార్టీలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. రైతు బంధు, రైతు బీమా, ఎలాంటి కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు తదితర అనేక రైతు పథకాలను దిగ్విజయంగా గత సర్కార్ అమలు చేసిందని గుర్తు చేశారు.

దాన్యం కొనుగోళ్ల కోసం రోజుల తరబడి మార్కెట్లలో పడిగాపులు పడుతూ రైతులు అష్ట కష్టాలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు రుణమాఫీపై దేవుళ్ళ మీద ప్రమాణం చేస్తూ రైతులను రేవంత్ మభ్య పెడుతున్నారని ఆరోపించారు. ఓట్ల రాజకీయాలు మానుకొని వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



26న రాష్ట్రానికి ఉపరాష్ట్రపతి రాక...

- ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్ శాంతి కుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఈ నెల 26న రాష్ట్రానికి రానున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సమీక్ష నిర్వహించారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి బ్లూ బుక్ ప్రకారం తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్, బందోబస్త్ చేయాలని పోలీసు శాఖకు సూచించారు. పర్యటనలో వైద్య సౌకర్యాలు కల్పించాలని ఆరోగ్య శాఖను ఆదేశించారు. విద్యుత్, అగ్నిమాపక శాఖలు తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమీక్షలో డీజీపీ రవిగుప్తా, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, గవర్నర్ కార్యదర్శి బీ వెంకటేశం, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులందరికీ రైతుబంధు వచ్చినట్టు నిరూపిస్తారా..

- మా అభ్యర్థిని ఎన్నికల బరి నుంచి తప్పిస్తా లేదంటే.. మీ అభ్యర్థిని పోటీ నుంచి తప్పిస్తారా : మంత్రి కోమటిరెడ్డికి మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి సవాల్

నవతెలంగాణ -నల్లగొండ టౌన్



అర్హులైన రైతులందరికీ రైతుబంధు వచ్చిందని నిరూపిస్తే.. మా ఎంపీ అభ్యర్థిని ఎన్నికల బరి నుంచి తప్పిస్తా.. లేదంటే, మీ అభ్యర్థిని పోటీ నుంచి తప్పిస్తారా అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తే నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. కంచర్ల కృష్ణారెడ్డి రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గడియారం సెంటర్లో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 100 రోజుల్లోనే ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు ఆపిన ఘనులు వీళ్లే అని విమర్శించారు. హామీల అమలుపై ఉప ముఖ్యమంత్రి భట్టి అసెంబ్లీలోనే అబద్ధాలు చెప్పారని తెలిపారు. 100 రోజుల్లోనే 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉండి పంటలకు నీరందించలేకపోయారని విమర్శించారు. కేసీఆర్ తెచ్చిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో ఎన్ని వ్యవసాయ పంపు సెట్లు కాలాయో.. ఈ నాలుగు నెలల్లో ఎన్ని మోటార్లు కాలిపోయాయో లెక్క తీద్దాం అని సవాల్ విసిరారు. మిర్యాలగూడకు కేసీఆర్ ఏ మొఖం పెట్టుకొని వస్తారంటున్న మంత్రి కోమటిరెడ్డికి సిగ్గుండాలని విమర్శించారు. ఫ్లోరైడ్ పీడిత జిల్లాను ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అని తెలిపారు. కాంగ్రెస్ అన్నివర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రవీందర్ కుమార్‌నాయక్, నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20కే ఎకానమీ మీల్స్.. రూ.50కి స్నాక్స్‌మీల్స్

- ఏడు రైల్వేస్టేషన్లలో 18 కౌంటర్లలో లభ్యం : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దక్షిణ మధ్య రైల్వేపరిధిలో గల ఏడు రైల్వే స్టేషన్లలోని 18 కౌంటర్లలో రూ.20కి ఎకానమీ భోజనం, రూ.50కి స్నాక్స్‌మీల్ అందిస్తున్నామనీ, ఇది ప్రయాణీకులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉన్నదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వేస్టేషన్లలో ప్లాట్‌ఫా రాలపై జనరల్ కోచ్‌ల వద్ద భారతీయ రైల్వేలు, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) సంయుక్తంగా తక్కువ ధరలో పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. భారతీయ రైల్వేలలో ఈ భోజన సదుపాయం ప్రస్తుతం 100కి పైగా స్టేషన్లలో 150 కౌంటర్ల ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, విజయ వాడ, రేణిగుంట, గుంతకల్, తిరుపతి, రాజమండ్రి వికారాబాద్, పాకాల, ధోన్, నంద్యాల, పూర్ణ, ఔరంగాబాద్ మొదలైన 12 రైల్వే స్టేషన్లలో, 18 కౌంటర్ల ద్వారా ఇప్పటికే ప్రయాణికులకు ఈ ఎకానమీ మీల్స్ అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఢీ అంటే ఢీ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ బస్తీమే సవాల్ ప్రచారాస్త్రంగా 'రుణమాఫీ'
- రేవంత్, హరీశ్ పరస్పర విమర్శలు
- 45 డిగ్రీలు దాటుతున్న ఎన్నికల వేడి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రుణమాఫీ...ఎన్నికల్లో రాజకీయపార్టీలు రైతులిచ్చిన హామీ.. మ్యానిఫెస్టోల్లోనూ పెట్టి మరీ రైతులు, ప్రజలను నమ్మబలికిన పథకం. అసెంబ్లీ ఎన్నికలు రానేవచ్చాయి. పోనేపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరింది. నాలుగు నెలలు కాకముందే పార్లమెంటు ఎన్నికల గంట మోగింది. ఈ ఎన్నికల్లో ఏజెండాగా రైతుల రుణమాఫీ ముందుకొచ్చింది. ప్రచారాస్త్రంగా మారిపోయింది. దాదాపు 33 జిల్లాల్లోని 40 నుంచి 50 లక్షల మంది రైతులు ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో మళ్లీ రుణమాఫీ చర్చనీయాంశమైంది. రాజకీయ వేడిని రగిలిస్తున్నది. నేతల మధ్య కాకను మరింత పెంచుతున్నది. రుణమాఫీ పథకాన్ని రాష్ట్రంలో అమలుచేస్తే దాదాపు రూ. 40 వేల కోట్లు అవసరమవుతాయని అధికారిక అంచనా. సీఎం రేవంత్ నేతృత్వంలో పవర్‌లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆరు గ్యారెంటీల అమలుకు పూనుకున్న సంగతి తెలిసిందే. రైతుబంధు అమలుచేయడానికి ఇబ్బంది పడిందనే విమర్శలను మొదట్లోనే మూట కట్టుకుంది. ఇప్పుడు ఇప్పుడు 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో సత్తా చాటేందుకు ప్రయత్నిస్తున్నది. ఎలాంటి పరిస్థితుల్లోనూ కేంద్రంలో ఇండియా కూటమిని గద్దెనెక్కించాలని రేవంత్ సర్కారు భావిస్తున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్షాల నుంచి రాజకీయ విమర్శలు, ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. ఎన్నికలనగానే సాధారణంగా విమర్శలు చేసుకుంటూనే ఉంటారు. అయితే ప్రస్తుత రాజకీయ వాగ్బాణాలు ఒకింత తీవ్రంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ పనిఅయిపోయిందనీ, ఒకటి, రెండు సీట్లు మాత్రమే వస్తాయనే వ్యాఖ్యానాలు నేపథ్యంలో ఆపార్టీ నేతలు కాంగ్రెస్ సర్కారు, సీఎం రేవంత్ టార్గెట్ చేశారు. ఇదిలావుండగా రైతు రుణమాఫీ పంద్రాగస్టులోగా అమలుచేస్తామని సీఎం రేవంత్ ఎన్నికల సభలో ప్రకటించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ 'ఆగస్టు 15లోగా రుణమాఫీ అమలుచేయకపోతే రాజీనామా చేస్తావా' అని సీఎం రేవంత్‌పైకి ఎన్నికల బాణాన్ని నేరుగా వదిలారు. ఇందుకు సీఎం రేవంత్ స్పందిస్తూ 'రుణమాఫీని మేము అమలుచేస్తే, మీరు బీఆర్ఎస్‌ను రద్దుచేసుకుంటారా' అని కౌంటర్ ఎటాక్ చేయడంతో మరింత అగ్గిరాజేసినట్టయింది. ఇరువురు కీలకనేతలు చేసుకుంటున్న విమర్శలు, ప్రతివిమర్శలు రాష్ట్రంలో చర్చనీయాంశమవుతున్నాయి. ఔరా ! అంటూ జనం ముక్కున వేలేసుకునే పరిస్థితికి కారణమవుతున్నాయి. నేతలిద్దరూ వ్యక్తిగత ప్రతిష్టకు వెళుతున్నారనే వ్యాఖ్యానాలు రాజకీయ విశ్లేషకుల నుంచి వస్తున్నాయి. రైతుబంధే సరిగ్గా అమలుచేయలేదంటూ హరీశ్ ఇంకో బాంబు పేల్చారు. రేవంత్ అంటే మాటల కోతలు, కాంగ్రెస్ అంటే కరెంటు కోతలు అంటూ విరుచుకుపడ్డారు. ఇందుకు సీఎం రేవంత్ 'అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలుచేశాం..కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు..ఆయన చేసిన అప్పులకు రూ.24 వేల కోట్లు మిత్తి కట్టాం..రుణమాఫీ చేస్తానని నేను హామీ ఇచ్చా..చేసిన వెంటనే బీఆర్ఎస్‌ను రద్దుచేస్తారా ? ఏ రైతు అధైర్యపడాల్సిన అవసరం లేదు..బ్యాంకులు ఇబ్బంది పెట్టొద్దు..రుణమాఫీ చేసే బాధ్యత నాది..కాంగ్రెస్ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలి" అని వ్యాఖ్యానించారు. ఇలా విమర్శ, ప్రతివిమర్శలతో ఎన్నికల ప్రచార వేడి సైతం ఎండల వేడిలాగే 45 డిగ్రీలు దాటిపోతున్నది.

ఆర్టీసీ బస్సు చక్రాల కింద నలిగిన బతుకు

- కింద పడిన యువకుడిపై నుంచి వెళ్లటంతో మృతి



నవతెలంగాణ-ఉప్పల్

ఆ యువకుడు బీటెక్ పూర్తి చేశాడు. విదేశాలకు వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడాలని కలలు కన్నాడు. కానీ కాలం యువకుడి ఆశలను చిదిమేసింది. వాహనం అదుపు తప్పి కింద పడిన అతనిపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం పర్వతాపురం గ్రామం సత్యనారాయణపురానికి చెందిన దొంతురి మధుసూదన్ రెడ్డి, సుష్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో వర్షిత్(23) బీటెక్ పూర్తి చేసి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. మంగళవారం ఉదయం వర్షిత్ బోడుప్పల్ నుంచి హిమాయత్ నగర్‌కు బ్యాంకు పనిమీద బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఉప్పల్ నల్లచెరువు సమీపంలో వాహనం స్కిడ్ అయ్యి జారిపడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు అతని తలపై నుంచి వెళ్లడంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని గుండెలు బాదుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసులు.. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల తొలగింపు

- 29న తిరిగి కొత్తగా విధుల్లోకి : విద్యాశాఖ ఉత్తర్వులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య బట్టు మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సీఆర్పీలు, ఎంఆర్పీలు, డీపీవోల్లో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లు (ఐఈఆర్పీలు), క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీలు), డీఎల్ఎంటీ, మెస్సెంజర్లు, సిస్టం అనలిస్టులు, ఏపీవోలు, అకౌంటెంట్లు, డిస్ట్రిక్ట్ టెక్నికల్ పర్సన్లు, ఆఫీసు సబార్డినేట్లు, వాచ్‌మెన్ వంటి వారిని తొలగిస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయిలో భవిత కేంద్రాలు, ఐఈఆర్పీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు హెల్పర్, ఆయాలను తొలగించామని పేర్కొన్నారు. 2024-25 వచ్చే విద్యాసంవత్సరానికి మూడు రోజుల విరామం తర్వాత అంటే ఈనెల 28న సాధారణ సెలవు దినం అయినందున 29న వారిని కొత్తగా విధుల్లోకి తీసుకుంటామని వివరించారు. ఆ ఉద్యోగులతో వ్యక్తిగతంగా తిరిగి ఒప్పందం కుదుర్చుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే విద్యాసంవత్సరంలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు హెల్పర్, ఆయాల సర్వీసులను తీసుకునేందుకు ప్రత్యేకంగా ఉత్తర్వులను జారీ చేస్తామని తెలిపారు.

తొలగింపు విధానాన్ని ఎత్తేయాలి : సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ ఏటా తొలగించే విధానాన్ని ఎత్తేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం సురేందర్, కార్యదర్శి డి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం తొలగించడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల తర్వాత తిరిగి విధుల్లోకి తీసుకోవడమంటే ఉద్యోగులకు నష్టం చేయడమేనని విమర్శించారు. వారికి చాలీచాలని జీతాలిచ్చి, వెట్టిచాకిరి చేయిస్తున్నారని పేర్కొన్నారు. నెలరోజులపాటు సమ్మె చేస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్‌లో ధర్నాకు హాజరై సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇలా తొలగించి తమకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నీచంగా ప్రధాని మోడీ మాటలు



- ముస్లిముల పేరుతో కాంగ్రెస్‌పై అసత్యపు మాటలు
- కరీంనగర్‌లో ఎంపీగా సంజయ్ అభివృద్ధి శూన్యం
- వెలిచాల అభ్యర్థిత్వంపై కన్ఫ్యూజన్ ఏమీ లేదు.. త్వరలోనే అధికారిక ప్రకటన : రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంపదంతా ముస్లిములకు పంచిపెడతారని ప్రధాని మోడీ మాట్లాడిన మాటలు నీచంగా ఉన్నాయని, దేశంలోని అన్ని వర్గాల వారికీ సమాన హక్కులు, సంపద పంచాలన్న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వ్యాఖ్యలను వక్రీకరించారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 85 శాతం ఉన్న హిందువులకు కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా అన్యాయం చేసిందా..? వారికి వ్యతిరేకంగా ఏమైనా నిర్ణయం తీసుకుందా..? అంటూ ప్రశ్నించారు. ఎప్పుడూ దేశంలో విభజించు పాలించు అన్న సూత్రంతో వైరుధ్యాలు లేవనెతుతున్న బీజేపీ.. ఈ పదేండ్ల కాలంలో చేసిన ఘనకార్యమంతా ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఫక్తు వ్యాపారుల పార్టీ అయిన బీజేపీ పక్కా దళిత, గిరిజన, బలహీనవర్గాల వ్యతిరేకి అని విమర్శించారు. రాముడు అందరివాడని రాజకీయాల్లో వాడుకుంటూ లబ్దిపొందే అవకాశవాదమే తప్ప ఏనాడూ ప్రజలకు ఏం చేశారో.. ఏం చేయబోతున్నారో చెప్పలేని ఆ పార్టీని ఈసారి ప్రజలెవరూ నమ్మబోరని అన్నారు.తొలిదశ ఎన్నికల పోలింగ్ తరువాత మోడీ వెన్నులో వణుకు మొదలైందని, అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముస్లిములకు ఆస్తులు పంచుతుందని నీచంగా మాట్లాడటం మొదలుపెట్టారని విమర్శించారు. పదేండ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో మోడీ ఫొటోతో ఓట్లు రాలవని భావించి ఇప్పుడు రాముడి చిత్రంతో రంగంలోకి దిగారని ఎద్దేవా చేశారు. 'కరీంనగర్‌లో ఎంపీగా ఉన్న సంజయ్‌కి చదువురాదు.. భాష రాదు.. ఎదుటి వారిని గౌరవించడమూ తెలీదు' అంటూ విమర్శించారు. 'ఎంపీగా కరీంనగర్‌కు ఏం చేశారు? తల్లీబిడ్డల గురించి ఆయన అవమానకరంగా మాట్లాడారు. రాష్ట్ర అధ్య క్షునిగా సంజయ్‌ని ఎందుకు తొలగించారో చెప్పాలి' అంటూ తీవ్రస్థాయిలో విమర్శించారు.మంచి రోజు కావడంతోనే కరీంనగర్‌లో తమ పార్టీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ వేశారని, ఆయన అభ్యర్థిత్వంపై ఎలాంటి కన్ఫ్యూజన్ అవసరం లేదన్నారు. త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల ఇన్‌చార్జులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గెలుపెవరిదో..?

- సిట్టింగ్ సీటు కోసం కాంగ్రెస్ కసరత్తు
- పట్టు కోసం బీఆర్ఎస్ పాకులాట
- రాజకీయ భవిష్యత్ కోసం ఈటల ఆరాటం
- 'మల్కాజిగిరి' తీర్పు ఎప్పుడూ విలక్షణమే



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ సెగ్మెంట్ మల్కాజిగిరి. ఈ సెగ్మెంట్‌కు ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరగ్గా.. ఓటర్లు ప్రతిసారీ విలక్షణమైన తీర్పునే ఇస్తూ వస్తున్నారు. రెండుసార్లు కాంగ్రెస్, ఒకసారి టీడీపీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ సెగ్మెంట్ పరిధిలో దాదాపు 37 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా.. ఇందులో దాదాపు 14 లక్షల వరకు సెటిలర్లు ఉన్నారు. గెలుపోటముల్లో సెటిలర్లే కీలక పాత్ర పోషించనున్నారు. ఇక్కడ ఇప్పటి వరకు బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించలేదు.

జాతీయ పార్టీలవైపే ఓటర్లు

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2007లో సిద్దిపేట నుంచి విడిపోయి మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ ఏర్పాటైంది. ప్రస్తుతం ఈ సెగ్మెంట్ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సగం హైదరాబాద్ నగరం ఇక్కడే ఉంది. దేశంలోని అన్ని ప్రాంతాల ఓటర్లు మల్కాజిగిరి పరిధిలో ఉండటంతో వారు ఎక్కువగా జాతీయ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకసారి బీజేపీ మిత్రపక్షంగా ఉన్న టీడీపీని, రెండుసార్లు కాంగ్రెస్‌ను గెలిపించారు. గడిచిన మూడు ఎన్నికల్లో జాతీయ పార్టీలు, జాతీయ పార్టీల మిత్ర పక్షాలకు పట్టం కట్టిన మల్కాజిగిరి ఓటర్లు ఈ సారి ఎటువైపు మొగ్గు చూపుతారో అంతుచిక్కడం లేదు. గతం కంటే రాష్ట్రంలో రాజకీయాలు భిన్నంగా ఉండటంతో ఓటర్ల నాడి కోసం అభ్యర్థులు తీవ్ర కృషి చేస్తున్నారు.

14 లక్షల సెటిలర్ ఓటర్లు

ప్రధానంగా వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చి నివాసముండే వారు ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోనే ఎక్కువగా ఉన్నారు. ఓవైపు పారిశ్రామిక వాడలు, మరోవైపు మధ్యతరగతి నివాసయోగ్యమైన కాలనీలు, వ్యాపార సముదాయాలు ఉండటంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రజలు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర భారతదేశానికి చెందిన ప్రజలు ఇతర నియోజకవర్గాలతో పోల్చుకుంటే ఇక్కడే ఎక్కువగా ఉన్నారు. దీంతో దేశంలో ఏ లోక్‌సభ నియోజకవర్గంలో లేని విధంగా ఓటర్ల సంఖ్య దాదాపు 37 లక్షలకు పైగా చేరింది. ఇందులో దాదాపు 14 లక్షల వరకు సెటిలర్లే ఉన్నారు.

ఈటలకు రాజకీయ భవిష్యత్..

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఈ ఎన్నికలు చావో.. రేవో అన్నట్టుగా మారాయి. ప్రస్తుతం ఈటల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేసి ఓటమిపాలు కావడంతో ఈటల గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. ఎంపీ ఫలితం కూడా వ్యతిరేకంగా వస్తే రాజకీయ భవిష్యత్ దెబ్బతింటుందనే భావనలో ఉన్న ఈటల, గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఓటమిని చవిచూసిన ఈటల తన రాజకీయ భవిష్యత్‌ను, సామాజిక అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన ఈటల అనూహ్య పరిస్థితుల్లో బీజేపీలో చేరడంతో రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

అసెంబ్లీలో గెలిచి.. పార్లమెంట్‌లో..

ఉమ్మడి రాష్ట్రంలో కంటోన్మెంట్, ఎల్బీనగర్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, బీజేపీకి ఏ మాత్రమూ పట్టు లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగింది. అసెంబ్లీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. కానీ పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బోణీ కొట్టలేకపోయింది. కాంగ్రెస్ చేతిలో ఓటమిపాలైంది. బీజేపీ సైతం రెండుసార్లు బరిలో నిలవగా ఒక్కసారి కూడా గెలుపొందలేదు. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మాత్రం 40 సీట్ల వరకు గెలిచింది. బీఆర్ఎస్ నాలుగోసారి, బీజేపీ మూడోసారి ఎన్నికల బరిలో నిలిచాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునితా మహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్ బరిలో ఉన్నారు.

'మల్కాజిగిరి' తీర్పు విలక్షణం

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఓటర్ల తీర్పు విలక్షణంగా ఉంటుంది. ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరగ్గా.. రెండు సార్లు కాంగ్రెస్, కూటమిలో భాగంగా ఒక్కసారి టీడీపీ గెలిచింది. ఇక్కడ మొదటి సారి 2009 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వే సత్యనారాయణ విజయం సాధించారు. 2014లో రెండోసారి నాటి ఎన్డీఏ కూటమి మిత్రపక్షమైన టీడీపీ అభ్యర్థిగా నేటి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, 2019లో నాటి కాంగ్రెస్ అభ్యర్థి, నేటి సీఎం రేవంత్ రెడ్డి గెలుపొందారు.

దేశం కోసం మా అమ్మ తాళినే త్యాగం చేసింది

(మొదటిపేజీ తరువాయి)

ప్రియాంక మాట్లాడుతూ.. "గత రెండు రోజులుగా కాంగ్రెస్ వాళ్లు మీ మంగళసూత్రం, బంగారం లాక్కోవాలనుకుంటున్నారని బీజేపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏండ్లు అయ్యింది, 55 ఏండ్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది, అప్పుడు ఎవరైనా బంగారం లాక్కున్నారా? మీ మంగళ సూత్రాన్ని గుంజుకున్నారా? దేశంలో యుద్ధం జరిగినప్పుడు, ఇందిరా గాంధీ తన బంగారాన్ని దేశానికి అందించారు. ఈ దేశం కోసం నా తల్లి మంగళసూత్రాన్ని (రాజీవ్ గాంధీని) త్యాగం చేశారు." అని అన్నారు.

"మంగళసూత్రం' ప్రాముఖ్యతను మోడీజీ అర్థం చేసుకుని ఉంటే ఇలాంటి మాటలు మాట్లాడేవారు కాదు.. నోట్ల రద్దు జరిగినప్పుడు మహిళల పొదుపు సొమ్మును ఎత్తుకెళ్లారు.. రైతుల నిరసనలో 600 మంది రైతుల ప్రాణాలు బలిగొన్నారు. ఆ రైతుల ఇల్లాలి 'మంగళసూత్రం' గురించి ఆలోచించాడా? మణిపూర్‌లో ఒక మహిళను వివస్త్రగా ఊరేగించినప్పుడు, ఆమె 'మంగళసూత్రం' గురించి ఆయన ఆలోచించాడా? ఈ రోజు మహిళలను భయపెట్టడానికి అలాంటి మాటలు మాట్లాడుతున్నాడు. వారు భయపడి ఓటు వేస్తారని భావిస్తున్నాడు" అని అన్నారు.

సత్య మార్గంలో నడవడం, ఇతరులకు సేవ చేయాలనే స్ఫూర్తితో దేశానికి సేవ చేయడం హిందూ సంప్రదాయంతోపాటు రాజకీయ సంప్రదాయమని ప్రియాంక అన్నారు. పార్టీలకు అతీతంగా గత ప్రధానమంత్రులందరూ దేశ ప్రజల కోసం అంకితభావంతో పనిచేశారు. అయితే నేడు నరేంద్ర మోడీ ప్రభుత్వంలో అబద్ధాలే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ప్రభుత్వాలను పడగొట్టడానికి ప్రజాస్వామ్య విలువలన్నింటినీ తుంగలో తొక్కిన బీజేపీని ఖండించే సాహసం ఎవరూ చేయడం లేదు అని తెలిపారు.

నైతికతను వదులుకుని నాటకాలు..

దేశంలోనే అతిపెద్ద నాయకుడు నైతికతను వదులుకున్నారని, ప్రజల ముందు నాటకాలు ఆడుతున్నారని, సత్య మార్గాన్ని అనుసరించడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఘాటుగా మాట్లాడారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం, వారి బ్యాంకు ఖాతాలు జప్తు చేయడం, ఇద్దరు ముఖ్యమంత్రులను జైల్లో పెట్టడం ద్వారా విపక్షాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. 'సూపర్‌మ్యాన్' చిత్రం చూశానని అయితే 'మెహంగైమాన్' వచ్చిందని ప్రియాంక అన్నారు. ఈ పదేండ్లలో ప్రభుత్వం ప్రజల కోసం ఏ పనీ చేయలేదన్నది నిజమని చెప్పారు.

బీజేపీ దేశాన్ని తప్పుదోవ పట్టించింది.

ఎలక్టోరల్ బాండ్ స్కీమ్ పై ప్రియాంక మాట్లాడుతూ, దాడి చేసిన కంపెనీలు బీజేపీకి విరాళాలు ఇచ్చాయని, ఆపై వారిపై ఉన్న కేసులను మూసివేశారని అన్నారు. నోట్ల రద్దు ద్వారా నల్లధనాన్ని వైట్‌గా మార్చి బీజేపీ ఖాతాలో ఎలా జమ చేశారో ఇప్పుడు స్పష్టమైందని, రూ.100 కోట్లు కూడా సంపాదించలేని కంపెనీలు (ఎన్నికల ప్రచారంలో) బీజేపీకి డబ్బులు ఇచ్చాయని ఆరోపించారు. బాండ్ స్కీమ్ కింద రూ.1100 కోట్లు విరాళం ఎలా ఇచ్చాయని ప్రశ్నించారు.

రాజ్యాంగాన్ని మారుస్తానని బీజేపీ నేత చేసిన ప్రకటనను గుర్తు చేస్తూ.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రియాంక కోరారు. రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడే వారి మాటలను జాగ్రత్తగా వినాలని, అది మీ జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈరోజు రాజ్యాంగాన్ని మార్చాలని మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో దేశంలోని అతిపెద్ద పార్టీలలో ఒకటైన బ్యాంకు ఖాతాలు మూసివేయబడ్డాయని వివరించారు.

'మోడీ అంత గొప్ప నాయకుడైతే..

ఉపాధి, విద్య, ఆరోగ్య సౌకర్యాల గురించి బీజేపీ నాయకులు ఎప్పుడూ మాట్లాడరు, కానీ వారు కేవలం ఆవేశపూరితమైన, దారి మళ్లించే అంశాలపై మాత్రమే మాట్లాడుతున్నారు. మోడీ ప్రపంచంలోనే గొప్ప నాయకుడని అంటున్నారు. ఇంతటి పలుకుబడి, అహంకారం, కీర్తి, అహంకారంతో మోడీ ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలను ఒక్క క్షణంలో ఆపగలరని అంటారు. నేను మిమ్మల్ని అడగాలనుకుంటున్నాను, అతను (మోడీ) అంత పెద్ద నాయకుడైతే, అతన్ని ఎవరూ ప్రశ్నించలేనంత ప్రభావం ఆయనకు ఉంటే, అతను మీకు ఉపాధి కల్పించడంలో ఎందుకు విఫలమయ్యాడు, ద్రవ్యోల్బణం ఎందుకు తగ్గించలేకపోయాడు. యువత కోసం కొత్త పథకం ఎందుకు తీసుకురాలేదు, మీ కుటుంబాల్లో ఎందుకు అభివృద్ధి జరగలేదు?అని సూటిగా ప్రశ్నించారు.

బిజినెస్

వ్యవసాయ ఎగుమతుల్లో 9 శాతం పతనం



న్యూఢిల్లీ : భారత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో పతనం చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు 8.8 శాతం క్షీణించి 43.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఎర్ర సముద్ర సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం పరిణామాలకు తోడు బియ్యం, గోధుమలు, పంచదార వంటి కీలక వస్తువుల ఎగుమతులపై విధించిన పరిమితుల వల్ల పతనం చోటు చేసుకుంది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ గణంకాల ప్రకారం.. 2022-23 ఇదే 11 మాసాల్లో 47.9 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు జరిగాయి.భారత వ్యవసాయ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లోనూ భారీ తగ్గుదల చోటు చేసుకుంది. 2022-23లో 4.7 శాతం వృద్ధిని సాధించగా.. 2023-24లో కేవలం 0.7 శాతం పెరుగుదలను నమోదు చేసింది. అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ) జాబితాలోని 24 ప్రధాన వస్తువులలో 17 ఉత్పత్తులు సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. తాజా పండ్లు, గేదె మాంసం, ప్రాసెస్ చేసిన కూరగాయలు, బాస్మతి బియ్యం, అరటిపండ్లు ఎగుమతుల్లో వృద్ధి చోటు చేసుకుంది.గత ఆర్థిక సంవత్సరంలో బియ్యం, గోధుమలు, చక్కెర, ఉల్లి వంటి వస్తువులపై ఆంక్షలతో సుమారు 5-6 బిలియన్ డాలర్ల వ్యవసాయ ఎగుమతులను దెబ్బతీశాయని ఒక అధికారి తెలిపారు. 2022-23 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి కాలంలో 4.2 బిలియన్ డాలర్ల బాస్మతీ బియ్యం ఎగుమతయ్యాయి. 2023-24 ఇదే సమయంలో 22 శాతం వృద్ధితో 5.2 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి.ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధం ఎగుమతులపై ఎటువంటి ప్రభావం చూపలేదని ఓ అధికారి తెలిపారు. అధిక విలువ కలిగిన ఇండియన్ బ్రాండ్‌ల సరఫరాలో మంచి వృద్ధిని సాధించడంతో పాటు భారతీయ ఆల్కహాలిక్ పానీయాల ఎగుమతుల్లోనూ పెరుగుదల చోటు చేసుకు ందన్నారు. ప్రపంచం 2022లో 113.66 బిలియన్ల విలువైన ఆల్కహాలిక్ పానీయాలను దిగుమతి చేసుకుంది. కాగా.. భారతదేశ ఎగుమతులు 2022లో 180 మిలియన్లుగా నమోదయ్యాయి. ఆల్కహాలిక్ పానీయాల ప్రపంచ ఎగుమతులలో భారతదేశం ప్రస్తుతం 40వ స్థానంలో ఉంది.

25వేల యువతకు హెచ్‌సీసీబీ నైపుణ్య శిక్షణ

న్యూఢిల్లీ : దేశంలోని 25,000కు పైగా యువతకు నైపుణ్య శిక్షణ అందించినట్లు హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) తెలిపింది. ఎనిమిది రాష్ట్రాల్లోని యువతకు విక్రయాలు, మార్కెటింగ్‌కు సంబంధించి అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేశామని పేర్కొంది. వై4డి ఫౌండేషన్ భాగస్వామ్యంతో దీన్ని నిర్వహించినట్టు వెల్లడించింది.


మసాల నమూనాల సేకరణ

- సింగపూర్, హాంకాంగ్ నిషేధంతో..

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన రెండు కంపెనీల మసాల దినుసుల్లో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని.. వాటిని నిషేధిస్తున్నామని సింగపూర్, హాంకాంగ్ ప్రకటించడంతో కేంద్రం అప్రమత్తమయ్యింది. ఈ నేపథ్యంలోనే ఎవరెస్ట్, ఎండిహెచ్ మసాల తయారీ కంపెనీలపై చర్యలకు ఉపక్రమించింది. ఆ రెండు కంపెనీలకు చెందిన అన్ని మసాలా దినుసుల తయారీ యూనిట్ల నుండి నమూనాలను సేకరించాలని ప్రభుత్వం ఫుడ్ కమిషనర్‌లను ఆదేశించింది. అదే విధంగా దేశంలోని అన్ని మసాల దినుసుల తయారీ యూనిట్ల నుంచి నమూనాలను సేకరిస్తున్నట్లు ప్రభుత్వ ఉన్నత వర్గాలు తెలిపాయి.

సీపీఐ(ఎం)పై మోడీ నిందలు

- అణు నిరాయుధీకరణ వైఖరికి వక్ర భాష్యం
- దేశ భద్రత ప్రమాదంలో పడుతుందట
- వంతపాడిన రాజ్‌నాథ్



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ తన ఎన్నికల ప్రచార సభలలో ప్రతిపక్ష ఇండియా కూటమిపై అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారు. సీపీఐ (ఎం)ను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షమైన ఒక పార్టీ అణు నిరాయుధీకరణను కోరుకున్నదని ఈ నెల ప్రారంభంలో నిందలు వేశారు. ఇది ఏకపక్ష నిరాయుధీకరణకు పిలుపునివ్వడమే అవుతుందని, ఒకవేళ మన శత్రువుల వద్ద అణ్వాయుధాలు ఉంటే అప్పుడు మన దేశ భద్రత ప్రమాదంలో పడుతుందని చెప్పుకొచ్చారు. దేశాన్ని రక్షించుకోవాలంటే మన వద్ద అణ్వాయుధాలు ఉండాల్సిందేనని ప్రకటించారు. దీనికి భిన్నంగా మాట్లాడేవారు దేశాన్ని ఎలా రక్షించగలరని ప్రశ్నించారు.

ఆ తర్వాత కొద్ది రోజులకే ప్రధాని వాదనతో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఏకీభవించారు. ఆయన నేరుగా సీపీఐ (ఎం) పేరును ప్రస్తావిస్తూ ఆ పార్టీ ఉద్దేశాలను ప్రశ్నించారు. దేశాన్ని బలహీనపరచేందుకు సీపీఐ (ఎం) లోతైన కుట్ర చేస్తోందని ఆరోపించారు.

దీని పైనే ప్రధాని, కేంద్ర రక్షణ మంత్రి విమర్శలు కురిపించారు. అయితే 2019 ఎన్నికల సమయంలో పార్టీ విడుదల చేసిన ప్రణాళికను కూడా ఈ సందర్భంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. దీనివల్ల పార్టీ ఉద్దేశమేమిటో తెలుస్తుంది. భద్రతాపరమైన అంశాలకు సంబంధించిన సెక్షన్‌లో సీపీఐ (ఎం) ఇలా తెలిపింది...'ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రపంచవ్యాప్తంగా అణు నిరాయుధీకరణ జరగాలి.

పార్టీ వైఖరి ఏమిటంటే...

అణ్వాయుధాలను, రసాయన, జీవ ఆయుధాలు సహా మారణహోమానికి కారణమయ్యే ఇతర ఆయుధాలను పూర్తిగా నిర్మూలించాలని సీపీఐ (ఎం) తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పిలుపునిచ్చింది.

అణు పరీక్షల నిర్వహణపై పార్లమెంట్ మారటోరియం విధించాలి. దక్షిణాసియాను అణ్వస్త్ర రహిత ప్రాంతంగా మార్చాలి. డియాగో గార్సియాలోని అమెరికా స్థావరంలో ఉన్న అణ్వాయుధాలను తొలగించాలి'. అణ్వాయుధాలను సీపీఐ (ఎం) వ్యతిరేకిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

అయితే దీనికి వింత భాష్యం చెబుతున్నారు. ఏకపక్ష నిరాయుధీకరణను పార్టీ కోరుకుంటోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

మోడీ ప్రభుత్వ వైఖరి కూడా అదే

ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే వివక్షకు తావులేకుండా ప్రపంచవ్యాప్తంగా అణు నిరాయుధీకరణ జరపాలన్నది తన వైఖరి అంటూ మోడీ ప్రభుత్వం ఐరాసలోని భారత శాశ్వత మిషన్ వెబ్ పేజీలోనే ప్రకటించింది. 2019 సెప్టెంబర్ 27న జరిగిన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ ప్రపంచవ్యాప్తంగా అణు నిరాయుధీకరణకు, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధానికి తమ ప్రయత్నాలు కొనసాగిస్తామని తెలిపారు. దీనిని బట్టి అణు నిరాయుధీకరణకు మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్న విషయం స్పష్టమవుతోంది. తాను అణు నిరాయుధీకరణకు మద్దతు తెలుపుతూ, అదే వైఖరితో ఉన్న సీపీఐ (ఎం)పై నిందలు వేయడం కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమేనని దీనిని బట్టి అర్థమవుతోంది.

నదుల అనుసంధానంతో తెలంగాణకు ప్రమాదం



- నీటి వాటాలు తేల్చకుండా గోదావరి నీళ్లను తరలించుకుపోయే కుట్ర
- తెలంగాణకు 968 టీఎంసీల నీళ్లపై రాష్ట్రం స్పందించాలే..
- దిష్టిబొమ్మల్లా బీజేపీ ఎంపీలు ఉండొద్దు
- పెండింగ్ ప్రాజెక్టుల అనుమతులు ఇచ్చాకనే... 'ఇచ్చంపల్లి' ముచ్చట : కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలోని నదుల అనుసంధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓ భారీ ప్రాజెక్టుకు అడుగులు వేసిందని, ఇది ప్రజాప్రయోజనాల దృష్ట్యా బాగానే కనిపిస్తున్నా.. గోదావరినదిపైనే ఆధారపడిన తెలంగాణ జలాలను తరలించుకుపోయే కుట్ర జరుగుతోందని మాజీ ఎంపీ, కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. 365రోజులూ ప్రవహించే గంగా, బ్రహ్మపుత్ర నదులతో జత కట్టి రాష్ట్రంలోని గోదావరి నీటిని ఇచ్చపల్లి ప్రాజెక్టు ద్వారా కిందికి తరలించుకుపోయేందుకు ప్లాన్ చేసిందన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే గంగుల నివాసంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నదుల అనుసంధాన ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే నష్టంపై వివరించారు. తెలంగాణ ప్రాంతానికి గోదావరి నది ఒక కల్పతరువని, కోటి ఎకరాలకు సాగునీరు, రాష్ట్ర ప్రజలకు, హైదరాబాద్‌లాంటి మహానగరానికి తాగునీరు ఇక్కడి నుంచే పోతాయని తెలిపారు. అలాంటి నదిపై కేంద్రం ఎంటయూ పేరుతో రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపిందని వివరించారు. వరంగల్ జిల్లా పరిధిలోని ఇచ్చంపల్లిలో పెద్ద డ్యాం కట్టి నీళ్లను ఇతర రాష్ట్రాలకు తరలిస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఉత్తర భారతంలోని గంగా నది నుంచి ఒడిషాలోని మహానది మీదుగా రాష్ట్రంలోని గోదావరి నుంచి కృష్ణ... అక్కడి నుంచి కావేరికి నదిని అనుసంధానం చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. అయితే గంగా నది నుంచి మహానది వరకు ఇంతవరకూ సర్వే జరగలేదని, కల్పతరువుగా ఉన్న తెలంగాణ గోదావరి జలాలను దోచుకునే కుట్రకు తెరతీస్తున్నారని అన్నారు. 1966లో ఫిన్‌లాండ్ రాజధాని హెల్సింకీ ప్రపంచ జల శిఖరాగ్ర సదస్సులో ఆయా ప్రాంతాల్లో ప్రవహించే నదుల్లోని నీటిని మొట్టమొదట ప్రాజెక్టులు కట్టి ఎవరు వాడుకుంటారో వారికే ఆ నీటిపై సర్వహక్కులు ఉంటాయని ఓ కీలక తీర్మానం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దీన్నే 'రైపేరియర్ రైట్స్'గా చెప్పారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఏడాదిలో 80 రోజులు నిరంతర ప్రవాహం ఉండే గోదావరిపై రోజుకు రెండు టీఎంసీలు ఎత్తిపోసే కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును బీఆర్ఎస్ పూర్తి చేసిందన్నారు. అయినా గోదావరిలో వాటా కింద 968 టీఎంసీలు రాష్ట్రానికి రావాల్సి ఉందన్నారు. రైపేరియర్ రైట్స్ కింద అదే కాళేశ్వరం నుంచి మరో అదనపు టీఎంసీని కూడా ఎత్తిపోసే విధంగా ప్రాజెక్టు చేపడితే.. దోచుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేస్తుందంటూ ఇక్కడి విపక్షాలు అసంబద్ధ ఆరోపణలు చేశాయని అన్నారు. ఆ అదనపు టీఎంసీ ఎత్తిపోతకు కేంద్రం అనుమతి ఇవ్వకుండానే ఇప్పుడు గోదావరి జలాలను దోచుకునే కుట్రకు తెరతీసిందన్నారు. ఇప్పటికే కర్నాటకలో కృష్ణా నదిపై అడ్డగోలుగా బ్యారేజీలు కట్టడంతో మనకు ఆ నీళ్లు వచ్చే పరిస్థితి లేదని, ఇప్పుడు గుండెకాయలా ఉన్న గోదావరి నీళ్లు పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. కనీసం నలుగురు బీజేపీ ఎంపీలు అయినా స్పందించాలని, దిష్టిబొమ్మల్లా ఉండకూడదని కోరారు. ఏమాత్రం ఆలస్యం చేసినా ఈ నదుల అనుసంధానంతో కరీంనగర్, వరంగల్ జిల్లాలు ఎడారిలా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు ముదురుతున్న క్రమంలో కాళేశ్వరం ప్రాధాన్యత రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. ఇన్నాళ్లూ మేడిగడ్డపై రాజకీయ రాద్ధాంతం చేసి ఇప్పుడు కుంగిన పిల్లర్ల వద్ద కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి ఆలోచిస్తోందని, ఇప్పటికైనా తేరుకోవడం శుభపరిణామమని అన్నారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణ, మేయర్ సునీల్‌రావు సహా పార్టీ శ్రేణులు ఉన్నారు.

డిస్పెన్సరీలకు నిధులు విడుదల చేయండి

- ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఈఎస్ఐ డిస్పెన్సరీలకు వెంటనే నిధులు విడుదల చేయాలని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మంగళవారం మెయిల్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు. రాష్ట్రంలో కార్మికులకు వైద్య సేవలు అందిస్తున్న ఈఎస్ఐ డిస్పెన్సరీలలో ఎక్కువ భాగం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. అద్దెలు చెల్లించలేకపోవడంతో డిస్పెన్సరీలు మూతపడుతున్నాయని, వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కొన్ని నెలలుగా అద్దెలు చెల్లించకపోవడంతో భవన యజమానులు బలవంతంగా తాళాలు వేసి మూసేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే మిర్యాలగూడ, బీబీనగర్, మేడ్చల్, బొల్లారం, షామీర్‌పేట్ డిస్పెన్సరీలు మూతపడ్డాయన్నారు. మరికొన్ని డిస్పెన్సరీలు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. డిస్పెన్సరీలు మూతపడటంతో కార్మికుల వైద్య సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఈఎస్ఐ డిస్పెన్సరీల భవనాల అద్దెల చెల్లింపులు రూ.2 కోట్లా 10 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వెంటనే నిధులు విడుదల చేయాలని, మూతపడిన డిస్పెన్సరీలను తెరవాలని వినతిపత్రంలో కోరారు.

మోడీ మాటల్లో నిజమెంత...?

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతోందన్న వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారాలూ లేవు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారమే గత కొన్ని ఏళ్ల నుంచి ముస్లింల సంతానోత్పత్తి రేటు సిర్ధంగా ఉంది. అదేవిధంగా ఇతర మతాల సంతానోత్పత్తి రేటు, ముస్లింల సంతానోత్పత్తి రేటు మధ్య ఉన్న అంతరం తగ్గుతోంది. సంతానోత్పత్తి రేటు అంటే ఒక స్త్రీ తన జీవితకాలంలో కలిగి ఉన్న పిల్లల సగటు సంఖ్య. ఇది స్థిరంగా ఉంటే జనాభా సంఖ్య కూడా స్థిరంగానే ఉంటుంది. ప్రభుత్వ సంస్థల గణాంకాల ప్రకారమే ఇతర మతాల సంతానోత్పత్తి రేటుతో పాటు ముస్లింల సంతానోత్పత్తి రేటు కొన్ని సంవత్సరాలుగా బాగా తగ్గుతోంది. 2019-21 సమాచారం ప్రకారం ముస్లింల సంతానోత్పత్తి రేటు 2.36. అలాగే హిందు, ముస్లిం సంతానోత్పత్తి రేటు మధ్య అంతరం రేటు తగ్గుతూ వస్తోంది. 20 ఏండ్ల క్రితం 0.81గా ఉన్న రేటు ప్రస్తుతం 0.42గా ఉంది. దేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇదే విధంగా ఉంది. దీనిని బట్టీ దేశంలో ముస్లిం జనాభా వేగంగా పెరుగుతుందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు.అలాగే 'దేశ వనరులపై ముస్లింలకే మొదటి హక్కు' అని మాజీ ప్రధానమంత్రి, కాంగ్రెస్ నాయకులు మన్మోహన్ సింగ్ చెప్పారని మోడీ ఆరోపించారు. మోడీ చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు. మన్మోహన్ సింగ్ చెప్పారని మోడీ చెబుతున్నది ఒక ప్రభుత్వ ప్రకటన గురించి. ఒక ప్రభుత్వ ప్రకటనలో ప్రధానమంత్రి హోదాలో మన్మోహన్ సింగ్ చెప్పిన విషయాన్ని మోడీ తనకు అనుకూలంగా చెబుతున్నారు.

డిసెంబర్ 6, 2006న ఒక ప్రభుత్వ పత్రికా ప్రకటనలో డాక్టర్ సింగ్ ఈ విధంగా పేర్కొన్నారు. 'మా సమిష్టి ప్రాధాన్యతలు స్పష్టంగా ఉన్నాయని నేను నమ్ముతున్నాను. వ్యవసాయం, నీటిపారుదల, నీటి వనరులు, ఆరోగ్యం, విద్య... ఎస్సీ-ఎస్టీలతో పాటు ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, మహిళలు, చిన్నారుల సంక్షేమానికి చెందిన కార్యక్రమాలు ముఖ్యంగా ముస్లిం మైనారిటీలకు భరోసా కల్పించేందుకు మేము వినూత్న ప్రణాళికలను రూపొందించాలి. దీంతో అభివృద్ధి ఫలాలను సమంగా పంచుకునే అధికారం ఉంది. దేశంలోని వనరులపై వారికే (మైనార్టీలు) మొదటి హక్కు ఉండాలి' అని సింగ్ తెలిపారు. ఈ ప్రకటనలో మన్మోహన్ సింగ్ సమాజంలోని అన్ని బలహీన వర్గాలను ప్రస్తావించినా, మోడీ మాత్రం ముస్లింల గురించే మన్మోహన్ సింగ్ చెప్పారని మోడీ అసత్య ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ నిజంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ మైనార్టీల్లో ముస్లిం మైనార్టీల గురించే చెప్పారని అనుకున్నా ఆ సమయంలో విడుదలైన అనేక సూచీల ప్రకారం ముస్లింలు ఇతర మతస్థులు కంటే అనేక అంశాల్లో వెనుకబడి ఉన్నారు. ముఖ్యంగా విద్యా, ఉపాధి, నవజాత శిశువుల మరణాలు వంటి వాటిల్లో ముస్లింలు, ఇతర మతస్థుల మధ్య అంతరం చాలా దారుణంగా ఉంది. ఇప్పటికే అదే పరిస్థితి కొనసాగుతోంది.

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ముస్లిం జనాభా 17.22 కోట్లుగా ఉంది. అప్పుడు దేశ జనాభా మొత్తం 121.08 కోట్లు. అందులో 14.2 శాతం మంది ముస్లింలు ఉన్నారు. అంతకంటే ముందు 2001 జనాభా లెక్కల ప్రకారం ముస్లిం జనాభా 13.81 కోట్లుగా ఉంది. ఇది దేశ జనాభాలో 13.43 శాతం. అప్పుడు దేశ జనాభా 102.8 కోట్లుగా ఉంది.

2001-2011 మధ్య కాలంలో ముస్లిం జనాభా 24.69 శాతం పెరిగింది. ఇది దేశ చరిత్రలో అతి తక్కువ జనాభా వృద్ధి రేటును సూచిస్తోంది. 1991-2001 మధ్య, ముస్లిం జనాభా 29.49 శాతం వృద్ధి రేటు ఉంది. దీనిబట్టి ముస్లిం జనాభా వృద్ధి రేటు పెరుగుదలలో తగ్గుదల ఉందని స్పష్టం అవుతుంది.

నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఒ) ప్రకారం, ఇతర మతాలతో పోలిస్తే ముస్లిములలో లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్ఎఫ్‌పిఆర్), వర్కర్ పాపులేషన్ రేషియో (డబ్ల్యుపిఆర్) తక్కువగా ఉన్నాయి. అదనంగా, ఎల్ఎఫ్‌పిఆర్, డబ్ల్యుపిఆర్‌లలో క్షీణతను ఎదుర్కొంటున్న ఏకైక మతం కూడా ముస్లిములు. అయినప్పటికీ, ముస్లిములలో నిరుద్యోగిత రేటు (యుఆర్) జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. ఎల్ఎఫ్‌పిఆర్ అనేది జనాభాలోని శ్రామిక శక్తి (ఉద్యోగంలో ఉన్నవారు, ఉపాధిని కోరుకునేవారు, పని కోసం అందుబాటులో ఉన్నవారు) వ్యక్తుల నిష్పత్తిని సూచిస్తుంది. డబ్ల్యుపిఆర్ జనాభాలో ఉపాధి పొందిన వ్యక్తుల శాతాన్ని సూచిస్తుంది. కార్మిక శక్తిలో ఉన్నవారిలో నిరుద్యోగుల శాతాన్ని యుఆర్ సూచిస్తుంది.

మూడు పెండ్లిండ్లు చేసుకున్న.. నిత్య పెండ్లి కొడుకు

- తాజాగా మరో యువతితో ప్రేమాయణం
- నిందితున్ని కఠినంగా శిక్షించాలి : బాధితులు

నవతెలంగాణ కాశీబుగ్గ



గ్రేటర్ వరంగల్ 14 డివిజన్ సుందరయ్య నగర్‌కు చెందిన మద్ది రాజేష్(26) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తూ ఒకరికి తెలియకుండా మరొకరిని ఇలా ముగ్గురిని వివాహం చేసుకుని వేరువేరుగా కాపురాలు పెట్టాడు. కాగా, ఇప్పుడు మరో యువతితో ప్రేమాయణం కొనసాగిస్తున్నాడు. దాంతో మోసపోయామని తెలిసిన బాధిత మహిళలు, వారి కుటుంబ సభ్యులు రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సుందరయ్య నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత మహిళ తల్లిదండ్రులు నిడిగొండ సునిత, శ్యాంసుందర్ మాట్లాడారు. సుందరయ్య నగర్‌కు చెందిన రాజేష్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తూ 2022 ఫిబ్రవరిలో నగరంలోని చార్‌బౌలి ప్రాంతానికి చెందిన సుమప్రియను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆమెపై మోజు తీరిన తర్వాత అదే ఏడాది మే నెలలో హైదరాబాద్‌కు చెందిన శ్రావణిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెతో కొన్నాళ్లు కాపురం చేసిన రాజేష్.. సుందరయ్య నగర్‌కు వచ్చి అదే ప్రాంతానికి చెందిన నిడిగొండ సారికతో ప్రేమాయణం సాగించి 2024 ఫిబ్రవరిలో హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో మూడో వివాహం చేసుకున్నాడు. మూడు పెండ్లిండ్లు చేసుకున్న రాజేష్.. తెలివిగా ముగ్గురిని వేరువేరుగా మూడు చోట్ల అద్దెకు ఉంచాడు. తాజాగా ఇప్పుడు కరుణ అనే అమ్మాయితో తిరుగుతుండటంతో సుమప్రియ, సారిక తల్లిదండ్రులు ఆరా తీయగా రాజేష్ గతంలో చేసుకున్న పెండ్లిండ్ల గురించి తెలిసింది. సోమవారం సుందరయ్య నగర్‌కు వచ్చిన రాజేష్‌ను సారిక తల్లిదండ్రులు నిలదీయగా వారి కండ్లు కప్పి అక్కడనుండి పరారయ్యాడు. దాంతో రాజేష్‌పై ఇంతెజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సారిక తల్లిదండ్రులు సునిత, శ్యామ్ తెలిపారు. ప్రేమ, పెండ్లిండ్ల పేరుతో అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటున్న రాజేష్‌పై కఠిన చర్యలు తీసుకొని మరో అమ్మాయికి అన్యాయం జరగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

హాజరు మినహాయింపు దరఖాస్తు

గడువు మే 1

- ఇంటర్ బోర్డు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రయివేటుగా హాజరయ్యే విద్యార్థులకు హాజరు మినహాయింపు దరఖాస్తు గడువు వచ్చేనెల ఒకటో తేదీ వరకు ఉందని ఇంటర్ బోర్డు ప్రకటించింది.

ఈ మేరకు బోర్డు కార్యదర్శి శృతి ఓజా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హాజరు మినహాయింపు కోసం గురువారం నోటిఫికేషన్‌ను విడుదల చేస్తామని తెలిపారు.

విద్యార్థులు హాజరు మినహాయింపు ఫీజు రూ.500 చెల్లించాలని కోరారు. ఆర్ట్స్/హ్యుమానిటీస్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు tsbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రంలో 191కి చేరిన నామినేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో నామినేషన్ల జోరు కొనసాగుతోంది. ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో దిగుతున్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజక వర్గాల్లో మంగళవారం సాయంత్రం వరకు మొత్తం 191 నామినేషన్లు దాఖలైనట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. అత్యల్పంగా అదిలాబాద్ స్థానంలో నలుగురు నామినేషన్ దాఖలు చేయగా, అత్యధికంగా భువనగిరిలో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌తో పాటు మొత్తం 18 మంది బరిలో నిలిచారు. రాష్ట్రంలోని చాలా నియోజక వర్గాల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇంకా నామినేషన్లు దాఖలు చేయలేదు. ఈ నెల 25 చివరి రోజు కావడంతో బుధ, గురువారాల్లో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

విద్యుత్ తీగల సాయంగా... విద్యుత్ స్తంభం



వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం ముంచిప్పుల గ్రామ చెరువు శిఖంలో విద్యుత్ స్తంభం ప్రమాదభరితంగా దర్శనమిస్తోంది. కేవలం విద్యుత్ తీగల సాయంతో ఒక వైపునకు వంగి ఎప్పుడు కూలుతుందో ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి. ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని పడిపోక ముందే అధికారులు స్పందించి సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు

నవతెలంగాణ-నల్లబెల్లి

ఏఐటీయూసీ
మండల ప్రధాన కార్యదర్శిగా సక్క నాయక్



నవతెలంగాణ - హయత్ నగర్

హయత్‌నగర్ మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శిగా రమావత్ సక్క నాయక్‌ను కమిటీ నియమించింది. ఇటీవల హయత్ నగర్‌లో జరిగిన నిర్మాణ మహాసభలలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గోల్కొండ నాగరాజు, ఉపాధ్యక్షుడుగా శ్రీధర్‌రెడ్డి, సురేందర్, బాలరాజు, వెంకట్, సహాయ కార్యదర్శిలుగా కృష్ణ, జానీ, చంటి, స్వరూప, వీరితో పాటుగా మరో 17మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నవతెలంగాణ 7

సమగ్ర తెలుగు దినపత్రిక

ఎల్బీనగర్ -మహేశ్వరం

బుధవారం | ఏప్రిల్ 24, 2024 | www.navatelangana.com



నవతెలంగాణ -ఎల్బీనగర్

ఆపన్న హస్తం ట్రస్టు వారి ప్రత్యేక ఆహ్వానం మేరకు మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డిలు చైతన్యపురిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. అనంతరం చైతన్యపురిలోని హనుమాన్ ఆలయంలో జరిగిన జయంతి ఉత్సవంలో పాల్గొన్నారు. వారివెంట ముద్దగోని లక్ష్మీ ప్రసన్న, మంజులా రెడ్డి, శ్యామ్ చరణ్ రెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎండీ జహంగీర్‌ను గెలిపించాలి

- సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ - హయత్ నగర్

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు కీసరి నర్సిరెడ్డిలు ప్రజలను కోరారు. భువనగిరి పార్లమెంట్ హైదరాబాద్ సెటిలర్స్ ముఖ్యుల సమావేశం గంటే పాకం ముత్యాలు అధ్యక్షతన మన్సూరాబాద్‌లోని ఎంఈ రెడ్డి ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు దేశంలో ప్రజాస్వామ్య, అంకితత్వం రాజ్యాంగ విలువలను దెబ్బతీస్తున్న మతతత్వ బీజేపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను, రైతు చట్టాలను రద్దుచేసి.. వాటి స్థానాల్లో కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం పొందే లేబర్ కోడులను తీసుకువచ్చారని మండిపడ్డారు. అందుకే కార్మిక వర్గం, రైతాంగం, ఉద్యోగ వర్గాలందరూ బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. భువనగిరి పార్లమెంటు పరిధిలో చిన్ననాటి నుండి ప్రజా ఉద్యమాలలో పాల్గొంటున్న..ప్రజలే తమ బలమని, ప్రజలను అంటిపెట్టుకొని ఉంటున్న ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరు హైదరాబాద్ సెటిలర్లను కలిసి ఇప్పుడు జరగబోయే సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశమునకు ముఖ్యులు 30 మంది పాల్గొనగా..ఈ నెల 29న ఎంఈ రెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగే భువనగిరి పార్లమెంట్ పరిధిలోని హైదరాబాద్ సెటిలర్ల మీటింగ్‌ను 2000 మంది తగ్గకుండా సమీకరించి, సమావేశాన్ని జయప్రదం చేయలని సూచించారు. ఈ సమావేశంలో సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సిహెచ్ వెంకన్న, కనకయ్య, దొడ యాదిరెడ్డి, ఏబూసి నరసింహ, ఎం. నరహరి, జనార్ధన్, వెంకట్ రెడ్డి, సిహెచ్. నర్సిరెడ్డి, సైదులు, శంకరయ్య, అనిల్ రెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారుల కసరత్తు

- నగరంలో పెద్ద ఎత్తున ఓటరు చైతన్య కార్యక్రమాలు
- పెద్దఎత్తున ర్యాలీలు, సమావేశాలు

నవతెలంగాణ - సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం పెంచేందుకు జీహెచ్ఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నగరంలో 100శాతం ఓటింగ్ శాతం పెంచేవిధంగా అన్ని చర్యలు తీసుకున్నా ఆశించిన తీరులో ఫలితాలు రాబట్టలేకపోయారు. ఈ సారైనా నగరంలో ఓటింగ్ శాతం పెంచేవిధంగా అన్ని విధాల కసరత్తు చేస్తున్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో ఓటింగ్ శాతం పెంచే దిశగా పెద్ద ఎత్తున ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఓటు యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా చిరువ్యాపారులు, స్వయం సహాయక మహిళా సంఘాల సమావేశం, బీ.ఎల్.ఓ, బీ.ఎల్.ఓ సూపర్ వైజర్‌లు కూడా ఓటరు అవగాహన కార్యక్రమంలో పాల్గొని చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. ఓటు ఫర్ షఉ్యర్ అంటూ నినాదాలతో అవగాహన కల్పిస్తున్నారు. ఓటు హక్కు యొక్క ప్రాధాన్యత, ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి ర్యాలీలో నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓటింగ్ శాతం పెంచే దిశగా మహిళా సంఘాలు, బీఎల్ఏలు సూపర్ వైజర్లు విశేష కృషి చేస్తున్నారు.

ర్యాలీలు, సమావేశాలతో ముందుకు

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాల మేరకు అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో చిరు వ్యాపారులకు, మార్కెట్, పలు విద్యా సంస్థల్లో, వ్యాపార కూడలిలో పెద్ద ఎత్తున ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటింగ్ పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. సిబ్బంది అందరూ కలిసి కట్టుగా ఓటరు చైతన్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టి ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనే విధంగా పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.





అయిదో రోజు.. అదే జోరు..!



- 4 లోక్ సభ స్థానాలకు 47 నామినేషన్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు లోక్‌సభ స్థానాలకు అయిదో రోజు నామినేషన్లు జోరు కనిపించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల స్థానాలకు మంగళవారం 47 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటి వరకు నామినేషన్లను దాఖలు చేసిన పలువురు అభ్యర్థుల తరఫున తిరిగి అదనపు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.

హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి 11 మంది అభ్యర్థులు నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు. సమీర్ వలీఉల్లా ఖాన్(కాంగ్రెస్), అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), మాదవత్ రుక్మిణి నాయక్ (కాంగ్రెస్), ఎం.జాన్సన్(ఆల్ ఇండియా మహిళా ఎంపవర్‌మెంట్ పార్టీ), అంటి హనుమంతరావు(సోషలిస్టు పార్టీ ఇండియా), గడ్డం హరీష్ (ధర్మ సమాజ్ పార్టీ), ఎల్. అశోక్ నాథ్(తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ), మాతంగి రమేష్ కుమార్(సకల జనుల పార్టీ), వాంకుడోత్ శంకర్ (యువతరం పార్టీ), బందెల క్రాంతి కుమార్ (ఇండియన్ నేషనల్ యువజన పార్టీ), బి. రాజేందర్ కుమార్ (ఇండిపెండెంట్)లు నామినేషన్‌లను దాఖలు చేశారు.

సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి 11 నామినేషన్లు దాఖలయ్యాయి. బి.వేణుగోపాల్ స్వామి(కాంగ్రెస్), బి.క్రాంతి కుమార్(ఇండియన్ నేషనల్ యువజన పార్టీ), గౌలి కార్ సోని (సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా), పగడిపల్లి శాంసన్ (విడుతలై చిరుతాయిగల్ కట్చ్), స్వతంత్ర అభ్యర్థులుగా పులిమామిడి వెంకటేష్ గుప్తా, వి. రవికిరణ్, బాతుల రవి, పీ. నర్సింహా నరేందర్, మహమ్మద్ అక్రం అలీ ఖాన్, రెడ్డిమల్ల పార్వతీ, ఉత్తమ్ ప్రవీణ్‌కుమార్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి 13 నామినేషన్లు దాఖలయ్యాయి. గడ్డం రంజిత్‌రెడ్డి(కాంగ్రెస్), కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్ఎస్), వనం సుధాకర్ (ఎంసీపీఐ-యూ), ఫణి ప్రసాద్ కటకం(సోషల్ జస్టిస్ పార్టీ), చింతలగారి వెంకట స్వామీ(బ్లు ఇండియా పార్టీ), శ్రీదేవి(అలెయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్), బింగి రాములు(యుగ తులసీ పార్టీ), స్వతంత్ర అభ్యర్థులుగా సప్తగిరి విశ్వకర్మ, ఉమేష్ బోయా, మహ్మద్ పాషా, గోవింద్ లాల్, మర్క సతీష్ సాగర్, గోనె శ్రీనివాస్ రెడ్డిలు నామినేషన్లను దాఖలు చేశారు. మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రాగిడి లక్ష్మా రెడ్డి(బీఆర్ఎస్), మేడ్ సత్యం (అలియన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్), తల్లాడ వెంకటేశ్వర్లు (అలియన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్), కేవి గీత (రాష్ట్రీయ మానవ పార్టీ), మంచిని ఆంజనేయులు(విడుతలై చిరుతాయిగల్ కట్చ్), జక్కుల నర్సింలు(శ్రమజీవి పార్టీ), కొండా అప్పారావు (రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ), కేపీ విజయ్‌కుమార్(బహుజన్ ముక్తి పార్టీ), చేపూరి రాజు (అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్), స్వతంత్ర అభ్యర్థులుగా గంటా చరిత రావు, దొంతుల భిక్షపతి, ముస్త్యాల రామచంద్రంలు నామినేషన్లు దాఖలు చేశారు.

ఎల్బీనగర్ నియోజకవర్గ
ఓటర్ల వివరాలు వెల్లడి

నవతెలంగాణ - ఎల్బీనగర్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలను ఎల్బీనగర్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజం మంగళవారం విడుదల చేశారు. ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు ఆరు లక్షల 4 వేల 716 ఓటర్లు తమ ఓటు హక్కు కలిగి ఉన్నారని అధికారులు వెల్లడించారు. వీరంతా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అని చెప్పారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ఓటర్స్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పురుషుల ఓటర్లు మూడు లక్షలా 14వేల 75 ఓటర్లు, అదేవిధంగా మహిళల ఓట్లు రెండు లక్షల 90 వేల 507 ఓటర్స్, వికలాంగుల ఓటర్లు 6 వేల 765 ఓటర్లు, ఎన్ఆర్ఐ ఓటర్లు 52 మంది, 18 నుండి 19 సంవత్సరాల వయసు కలిగిన యువ ఓటర్లు11వేల 796 ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఓటింగ్ కోసం 570 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 243 ప్రాంతాలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. పోలింగ్ జరిగిన తర్వాత ఈవీఎం బాక్స్‌లను సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో భద్రపరచనున్నట్లు అధికారులు తెలిపారు.

బాగ్ హయత్ నగర్
మాదిగ సంఘం అధ్యక్షుడిగా బాబురావు



నవతెలంగాణ - హయత్‌నగర్

హయత్ నగర్ గ్రామంలోని బృందావన్ కాలనీ రోడ్ నెంబర్ 4 పోచమ్మ దేవాలయంలో బాగ్ హయత్ నగర్ ఏరియాకు సంబంధించిన మాదిగ కుల సంఘం పెద్దలు మంగళవారం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు ఏకగ్రీవంగా నూతన అధ్యక్షుడిగా చింతపట్ల బాబురావు, ప్రధాన కార్యదర్శిగా క్యాదాస్ సుధాకర్, జాయింట్ సెక్రెటరీగా రంద సాయి, వైస్ ప్రెసిడెంట్లుగా బట్టిల మహేందర్, సుంచు కుమార్, పారంద దశరథ్, సుక్క వెంకటేష్, క్యాదాస్ జగన్ మోహన్, ఎర్ర ప్రేమ, పారంద అరవింద్, కోశాధికారిగా ఎర్ర మహేందర్, ఉప కోశాధికారిగా పారంద యాదగిరి, ఆర్గనైజర్‌గా పారంద యాదగిరి (చిన్న), మేడి హరీష్, క్యాదాస్ సతీష్, గడ్డం అర్జున్, బొజ్జ బాబు, పారంద భరత్, చింతపట్ల కిషన్ బాబు, ఎర్ర హరి కృష్ణ, సంస్కృతిక కార్యదర్శులుగా క్యాదాస్ శ్రీను, పారంద రమేష్ (చిన్న), మేడి నరేష్, ఎర్ర శ్రీను, క్యాదాస్ జగదీష్, బట్టిల కుమార్, మేడి మహేష్, మేడి బాబ్జి ఎగ్జిక్యూటివ్ నెంబర్స్‌ను, ఇతర సభ్యులను కూడా ఈ కమిటీలో ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ అణగారిన వర్గాలుగా ఉన్న మా కులంలోని వారందరినీ ఒక తాటి పైకి తీసుకొచ్చి, ఐక్యతగా ముందుకు వెళ్లేందుకే ఈ కమిటీని ఏర్పాటు చేసుకున్నామన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతాల వారికి ఆదర్శవంతంగా నిలిచేందుకు ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

బీఆర్ అంబేద్కర్ గొప్ప మేధావి : రవికుమార్

నవతెలంగాణ - నాగోల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్ప మేధావి అని పద్మశ్రీ నర్రా రవికుమార్ అన్నారు. ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం నాగోలు డివిజన్‌లోని బండ్లగూడలో ఉన్న జీఎస్ఐ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ నర్రా రవికుమార్, జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ ప్రసాద్, ఎస్సీ, ఎస్టీల వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆధర్ల మహేష్, ప్రధాన కార్యదర్శి మధిర సత్యనారాయణతో పాటు జీఎస్ఐ సంస్థ అధికారులు, ఉద్యోగులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత పద్మశ్రీ నర్రా రవి కుమార్ మాట్లాడుతూ చట్ట సభలలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచినట్టు గుర్తుచేశారు. డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీలలో ఇంకా నిరక్షరాస్యత ఉందని, అందరు చదువు నేర్పించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ రవి కుమార్ నర్రా, డైరెక్టర్ జనరల్ జనార్ధన్ ప్రసాదలను అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజినల్ సెక్రెటరీ మధిర సత్యనారాయణలు ఘనంగా సన్మానించారు.





ఓట్ల కోసం
ప్రజలను హిందూ ముస్లింలుగా విడగొట్టొద్దు



- కొండ సంగీతా విశ్వేశ్వర్‌రెడ్డి
- ఎంపీ ఎన్నికల ప్రచారంలో ఆసక్తికర వ్యాఖ్యలు

నవతెలంగాణ - మీర్‌పేట్

ఓట్ల కోసం ప్రజలను హిందూ ముస్లింలుగా విడగొట్టి రాజకీయం చేయొద్దని బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి భార్య కొండ సంగీత రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీజేపీ అధ్యక్షులు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో బీజేపీకి ఓటు వేయాలని కోరుతూ మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండ సంగీత రెడ్డి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజలు హిందువులు, ముస్లింలు అనే తేడా లేకుండా అందరూ శోధన భావంతో కలిసిమెలిసి ఉన్నారని తెలిపారు. కానీ కొంతమంది రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు ప్రజలను హిందువులు ముస్లింల పేరుతో ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని అది కరెక్ట్ కాదని హితవు పలికారు. దేశంలో మోడీకి పోటీ ఎవరూ లేరని, ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలే నిదర్శనం అని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి కొండ విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కొండ విశ్వేశ్వర్‌రెడ్డి గెలవాలంటే ముస్లింల ఓట్లు కూడా కీలకమని గ్రహించి బీజేపీ నాయకులను ఉద్దేశించి అలా మాట్లాడి ఉంటారని రాజకీయ వర్గాల్లో ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో బీజేపీ మీర్‌పేట్ ఇంచార్జి కొలను శంకర్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్లు పెండ్యాల శివపార్వతి, నీలా రవి నాయక్, కరుణానిధి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర



నవతెలంగాణ - సంతోష్ నగర్

హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ఆలయంలో అంజనేయ స్వామి దేవాలయం నుండి శోభయాత్రను ఘనంగా నిర్వహించారు. మందమల్లమ్మ చౌరస్తా, విశ్వాస్ ఆసుపత్రి, చంపాపేట్ గాంధీ స్టాచ్, చంపాపేట్ చౌరస్తా, ఐఎస్ సదన్ డివిజన్ చౌరస్తా, ధోబి ఘాట్ చౌరస్తా, సైదాబాద్ ఏసీపీ ఆఫీస్ ఆవరణ నుండి సరూర్ నగర్ రోడ్ ప్రాంతాల మీదగా నిర్వహించిన ఈ యాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సౌత్ ఈస్ట్ జోన్ హైదరాబాద్ డీసీపీ జానకి ధారావత్ ఆధ్వర్యంలో గట్టి భద్రత ఏర్పాట్లు చేపట్టారు. పలు డివిజన్ పరిధిలోని సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ సభ్యులు నరసింహాచార్యులు, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి బాటిల్స్, ధోబి ఘాట్, సైదాబాద్ సంతోష్ నగర్ పరిధిలోని భక్తులకు లస్సి ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఏసీపీ లక్ష్మణ్, సంతోష్ నగర్ ఏసీపీ మహమ్మద్ గౌస్, ఐఎస్ సదన్ సీఐ వెంకట రామయ్య, ఎస్సైలు, ట్రాఫిక్ సీఐలు నరసింహ నాయక్, శ్రీను నాయక్, ట్రాఫిక్ ఎస్ఐలు, సంతోష్ నగర్ మాదన్న పేట్ ఐఎస్ సదన్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, నాగపురి నరసింహాచార్యులు, జర్నలిస్ట్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉప్పల'ను కలిసిన కిరణ్ కుమార్ రెడ్డి





నవతెలంగాణ- నాగోల్

భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి..నాగోల్ డివిజన్‌లోని కోపరేటివ్ కాలనీలో ఉన్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల శ్రీనివాస గుప్తా నివాసంలో మంగళవారం శ్రీనివాస గుప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత కిరణ్ కుమార్ రెడ్డి తన గెలుపునకు సహాయ సహకారాలను అందించాలని ఉప్పల శ్రీనివాస గుప్తను కోరారు. సానుకూలంగా స్పందించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త.. కచ్చితంగా తన మద్దతు ఉంటుందని, త్వరలోనే భువనగిరి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో పర్యటించి చామల కిరణ్ కుమార్ గెలుపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తట్టి అన్నారం మైసమ్మ టెంపుల్ చైర్మన్ సుక్క శ్రీనివాస్, ఎల్బీనగర్ డివిజన్ దళిత సంఘం అధ్యక్షులు జోగు రాములు, చిరంజీవి గౌడ్, భవాని గౌడ్, సాయి గౌడ్, మాల వెంకట స్వామి, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు, కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ ప్రెసిడెంట్ శరత్ రెడ్డి, ఐవీఎఫ్ సికింద్రాబాద్ ప్రెసిడెంట్ బల్దే రవి కుమార్ గుప్త, స్టేట్ అడిషనల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్ గుప్త, ప్రభాకర్ గుప్త, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాకర్స్‌తో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి



నవతెలంగాణ - హయత్ నగర్

ఓట్లు అడిగేందుకు గాను మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి ఆటోనగర్ హరిణ వనస్థలి పార్క్ నందు మార్నింగ్ వాకర్స్ సభ్యులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాకర్స్ సభ్యులకు గతంలో మూత్రశాలలు ఏర్పాటు చేశాం..కానీ నీటి కనెక్షన్ ఇవ్వలేదన్నారు. అనంతరం మేము గెలిచాక నీటి సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. అలాగే ఓపెన్ జిమ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు మరికొన్ని వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మరింత అభివృద్ధి జరగాలంటే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్సురాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, లక్ష్మా రెడ్డి, వాకర్స్ సభ్యులు సునీల్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నాగోలులో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ - నాగోల్

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆయన సతీమణి జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమలా సుధీర్ రెడ్డిలు నాగోలు డివిజన్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డివిజన్ పరిధిలోని శివపూరి కాలనీలో గడప, గడపకూ వెళ్లి ఓటర్లను కలుస్తూ.. గత పదేండ్ల కాలంలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, రాష్ట్ర అభివృద్ధిని గమనించాలని కోరారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటల గారడిగానే మిగిలిపోయిందని విమర్శించారు. అందుకే కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మి మరోసారి మోసపోవద్దని తెలియజేస్తూ.. కేసీఆర్ బలపరిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వినియోగించుకొని కారు గుర్తుకు ఓటేసి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని ఎంపీగా ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారి వెంట డివిజన్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాళ్లు రంగేశ్వరి, శిల్పారెడ్డి, కవిత, రంజిత్ గౌడ్, శ్రీధర్ గౌడ్, ఉమ, మంగమ్మ పాల్గొన్నారు.



ఈద్ మిలాప్‌కు హాజరైన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హెచ్‌బీ కాలనీలో ఉన్న మసీదు-ఈ-అలంగీర్‌లో మంగళవారం నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వారి వెంట ఉప్పల్ నియోజకవర్గ మైనార్టీ నాయకులు ఉన్నారు.

హరీశ్‌రావును కలిసిన బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఆయన నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట కార్పొరేటర్లు జెర్రిపోతుల ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, తదితరులున్నారు.

'జలమండలి ద్వారా నీటి సరఫరా చేయాలి'



- మంచినీటి బోర్ల మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించాలి
- కీసర మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చ

నవతెలంగాణ-కీసర

వేసవి కాలంలో గ్రామాలకు జలమండలి ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. మంగళవారం కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా బోర్లు ఎండిపోయి మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. బోర్లకు మరమ్మతులు చేయడానికి పంచాయతీల్లో డబ్బు లేనందున ప్రత్యేక నిధులు కేటాయించాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం అయిపోయిందని, ప్రస్తుతం పదవుల్లోనే కొనసాగుతున్న ఎంపీటీసీలను జిల్లా స్థాయిలో నిర్వహించిన సమావేశానికి ఎందుకు పిలవలేదని ఎంపీటీసీలు టి.నారాయణ శర్మ, ఎస్.వెంకట్ రెడ్డి, జె.వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. తకు సమాచారం ఇస్తే గ్రామాల్లోని సమస్యలను ప్రస్తావించేవాళ్లమని పేర్కొన్నారు. యాద్గార్‌పల్లి గ్రామ పంచాయతీలో గత ఐదేండ్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని సభ్యులు డిమాండ్ చేశారు. ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తున్న జిల్లా స్థాయి అధికారులు కనీసం వారంలో ఒక్కసారైనా గ్రామాలకు వచ్చేలా చూడాలని కోరారు. అక్రమ లే అవుట్లు, నిర్మాణాలను ప్రారంభంలోనే నివారించాలని ఎంపీడీవో గ్యామనాయక్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో కూలీలను ఎంపిక చేసి ఉపాధిహామీ పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ ఆర్.ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీవో గ్యామనాయక్, మండల విద్యాధికారి శశిధర్, వైద్యాధికారి డా సరిత, వ్యవసాయాధికారి మాధవి, పశువైద్యాధికారి శ్యామల పాల్గొన్నారు.

చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరికలు



నవతెలంగాణ-కీసర

కేంద్రంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సాయిసంజీవ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం పాలకవర్గం, కాలనీవాసులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. చేరిన వారిలో అధ్యక్షులు విజయ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, నారాయణరావు, ట్రెజరర్ సత్యదేవ్, లక్ష్మీ ప్రసాద్, రమేష్, చందన్, హరి, అమర్నాథ్ శర్మ, నాగేశ్వర శాస్త్రి, రవి, స్వామి, గోవింద్ ఉన్నారు.

పాస్టర్ల సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ బాప్టిస్ట్ చర్చి ఏర్పాటు చేసిన పాస్టర్ల సమావేశానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, తెలంగాణ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్, ధన్‌పాల్‌రెడ్డి, ఎజెక్కిల్, వీరీరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని క్రైస్తవును కోరారు.

కేఎల్ఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా మేడ్చల్ మున్సిపాల్టీ 3వ వార్డు కౌన్సిలర్ జాకట దేవ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ జకట మల్లేష్ జన్మదిన శుభకాంక్షలు తెలిపారు. మంగళవారం కేఎల్ఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కిచన్నగారి లక్ష్మారెడ్డి భవిష్యత్ రాజకీయాల్లలో రాణించాలని కౌన్సిలర్ జకట దేవ ఆకాక్షించారు.

డిమాండ్లను నెరవేర్చాలని ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నవతెలంగాణ-శామీర్‌పేట

డిమాండ్స్ డే సందర్భంగా మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని హాకింపేట ఆర్టీసీ బస్సు డిపో ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని మంగళవారం ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు 2017 సంవత్సరంలో డ్రైవర్లకు డబ్బు ఏ విధంగా చెల్లించారో దాని ప్రకారమే కండక్టర్లకు కూడా చెల్లించాలన్నారు. 2017 ఆర్‌పీఎస్ పే స్కేల్ డబ్బు లెక్కించి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా బ్యాడ్జీలు పెట్టుకుని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్, భాస్కర్, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'మల్కాజిగిరి'కి 12 నామినేషన్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి మంగళ వారం 12 మంది అభ్యర్థులు నామినేష న్లు దాఖలు చేసినట్టు మేడ్చల్- మల్కా జిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. అలియన్స్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా మేడ్ సత్యం రెండు సెట్లు, తల్లాడ వెంకటేశ్వర్లు ఒక్క సెట్ నామినేషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రీయ మానవ పార్టీ అభ్యర్థిగా కె.వి. గీత కుమారి, విడుతలై చిరుతాయిగల్ కట్చ్ అభ్యర్థిగా మంచిని ఆంజనే యులు రెండు సెట్లు నామినే షన్ పత్రాలు దాఖలు చేశారు. శ్రమజీవి పార్టీ అభ్యర్థిగా జక్కుల నర్సింహులు, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా కొండా అప్పారావు రెండు సెట్ల నామినేషన్ పత్రా లు దాఖలు చేశారు. బహుజ న్ ముక్తి పార్టీ అభ్యర్థిగా కె.పి.విజయ కుమార్, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా చేపూరి రాజు నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థు లుగా గంటా చరితా రావు, దొంతుల భిక్షపతి, ముస్త్యాల రామ చంద్రం ఒక్క సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు ఆర్ఓ తెలిపారు.

అభా కార్డు పేరుతో బీజేపీకి అధికారుల ఎన్నికల క్యాంపెయిన్

- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

అభా కార్డు పేరుతో అధికారులు బీజేపీ ఎన్నికల క్యాంపెయిన్ చేస్తున్నారా..? అని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆభా కార్డు పేరుతో ఆశ వర్కర్స్‌పై వేధింపులు అరికట్టాలన్నారు. ఆశాలు పనికి పారితోషికం ప్రాతిపాదికన పని చేస్తున్నారనీ, వారితో పారితోషకం లేని పనులు చేయించకూడదన్నారు. పల్స్ పోలియో డబ్బులు ఎల్సీడీసీ డబ్బులు వెంటనే ఇవ్వాలన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికారులు ఆశాలతో రోజుకు 100 అభా కార్డులు చేయాలని బలవంతం చేస్తున్నారని తెలిపారు. అభా కార్డు కేంద్ర ప్రభుత్వం స్కీమ్ అనీ, ఎన్నికల సమయంలో అభా కార్డులను చేయడం బీజేపీకి ఓటు సంపాదించి పెట్టడమే తప్ప ప్రజలకు ఉపయోగం ఏమీ లేదన్నారు. ఇప్పటికే అభా కార్డు ఎన్‌రోల్‌మెంట్ చేయించుకున్న వారు ట్రీట్‌మెంట్ కోసం హాస్పిటల్స్‌కి వెళ్తే ఆ కార్డు పని చేయడం లేదన్నారు. ఆశాలు రాష్ట్రంలో టెన్త్, ఇంటర్ ఎగ్జామ్ డ్యూటీ చేస్తున్నారనీ, ఇతర అన్ని రకాల సర్వేల్లో వీరిని పూర్తిస్థాయిలో ఉపయోగించు కుంటున్నారు కానీ పారితోషికాలు మాత్రం ఇవ్వడం లేదన్నారు. అధికారులు ఆశాలను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సెంటర్లలో కూర్చోమని చెబుతున్నారని తెలిపారు. ఇచ్చిన ఏరియాల్లో రోజు సర్వే చేసి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాల్సిన ఆశాలను కింది స్థాయిలో ఉన్న అధికారులు వారి చుట్టూ కూర్చోబెట్టి అధికారులు చేయాల్సిన పనులను వీరితో చేపిస్తున్నారని తెలిపారు. పని చేయకపోతే రాజీనామా చేసి వెళ్ళిపోమని బెదిరిస్తున్నారనీ, అంతటితో ఆగకుండా నోటికొచ్చిన దుర్భాష వాడుతున్నారని తెలిపారు. సమాజంలో అట్టడుగున, బలహీనవర్గంలో ఉన్న ఆశాలను అధికారులు దుర్భాషగా మాట్లాడటం సరికాదనీ, అలాంటి అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆశాలను అడ్డం పెట్టుకుని బీజేపీకి ఎన్నికల క్యాంపెయిన్ చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లడిగే హక్కు లేదు





బండారి రవీందర్

- బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి
- పీర్జాదిగూడలో పార్టీని బలోపేతం చేస్తాం
- మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- పీర్జాదిగూడ కార్పొరేషన్ గులాబీ దళపతిగా బండారి రవీందర్

నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లడిగే హక్కు లేదని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేయడంలో భాగంగా కేటీఆర్ ఆదేశాల మేరకు మేడిపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశానికి చామకూర మల్లారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నగర నూతన అధ్యక్షుడిగా బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శిగా ఏడవల్లి రఘువర్ధన్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు నాలుగు నెలలకే ఆవిరై పోవడంతో ప్రజలు అయోమయంలో పడ్డారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వృద్ధులకు, వికలాంగులకు పింఛన్, కేసీఆర్ కిట్, ఐటీ, పారిశ్రామిక రంగాల అభివృద్ధి, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో ఇంటింటికీ మంచి నీరు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు కష్టాలు వచ్చాయని తెలిపారు. నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నా, పండిన పంట సరైన ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రైతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని పేర్కొన్నారు. రైతు బంధు, రైతు భరోసా, రూ.4వేల పింఛన్ పథకాలను నీరుగార్చారని తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై నమ్మకం పోయిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్‌ను వీడిన నాయకులకు కాంగ్రెస్‌లో గౌరవం లేకపోవడం పార్టీ మారాలానే ఆలోచనలో ఉన్నారన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందజలో ఉందన్నారు. అందుకు కృషి చేసిన జక్క వెంకట్ రెడ్డి, పాలక మండలి సభ్యులను అభినందించారు.పార్లమెంట్ ఎన్నికల్లో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. స్థానికంగా ఉంటూ ఎన్నో సేవా, సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డిమాట్లాడుతూ..నేడు (24న) మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు కేటీఆర్ వస్తున్నారని, పార్టీ శ్రేణులు నామినేషన్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నూతన అధ్యక్షుడు బండారి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, జక్కవెంకట్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, కౌడె పోచయ్య, మధుసూదన్ రెడ్డి, ఏంపల్ల అనంత రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, బండి సతీష్ గౌడ్, కుర్ర శ్రీకాంత్ గౌడ్, ఏనుగు మనోరంజన్ రెడ్డి,జావీద్ ఖాన్,పైళ్ల ప్రభాకర్ రెడ్డి మల్లం వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, డివిజన్ల అధ్యక్ష కార్యదర్శులు, మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కేఎల్ఆర్ జన్మదిన వేడుకలు

- కాలేష ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ



నవతెలంగాణ-జవహర్‌నగర్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి 68వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుక్కమ్మ బస్తీలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు టీ. కాలేష నివాసంలో లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఆయన ఆర్థికంగా, రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ పిల్లలు, కుటుంబ సభ్యులు షర్మిల, షేక్ ముర్తుజా హైదర్, షేక్ అజ్మతుల్ హైదర్, నూర్ లైన్ ఫాతిమా, సూరజ్, సాధన, అస్మ పాల్గొన్నారు.

ఘనంగా దర్గా దయాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



- హాజరైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ మల్కాజిగిరి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ దర్గా దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆయన నివాసంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ హాజరై దయాకర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. దర్గా దయాకర్‌రెడ్డి కల్మషం లేని వ్యక్తి అని, ఆయన నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని కోరారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంగతుర్తి రవి, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, లీగల్ సెల్ అధ్యక్షులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు అమర్‌సింగ్, చంద్రారెడ్డి, భీంరెడ్డి నవీన్‌రెడ్డి, అంజిరెడ్డి, గుర్రాల వెంకటేష్, రంజిత్‌రెడ్డి, సక్రు నాయక్, దేశవేణి శ్రీనివాస్ గౌడ్, పాశం రాజు యాదవ్, శరత్ గౌడ్ తదితరులున్నారు.



100 రోజుల్లోనే ఐదు గ్యారెంటీలు అమలు



- కాంగ్రెస్ నాయకులు పిట్టల శ్రీనివాస్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత 'కాంగ్రెస్' ప్రభుత్వానిదేనని ఆ పార్టీ సీనియర్ నేత పిట్టల శ్రీనివాస్ అన్నారు. మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు మంగళవారం వినాయక నగర్ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజు ల్లోనే ఆరు గ్యారెంటీలలో ఐదింటిని అమలు చేసిందన్నారు. ఎన్నికల తర్వాత మిగిలిని ఒక్క గ్యారెంటీని అమలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ 'చేతి' గుర్తుపై ఓటు వేసి మల్కాజిగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పిట్టల నాగరాజు మాట్లాడుతూ.. బడుగు, బలహీ న వర్గాల అభివృద్ధి 'కాంగ్రెస్'తోనే సాధ్యమన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు కావాలంటే చేతి గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరిలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

- పలు చోట్ల పాల్గొన్న ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి, మల్లాపూర్, హౌసింగ్ బోర్డుతో పాటు డివిజన్లల్లో మంగళవారం నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌గౌడ్, జంపాల్‌రెడ్డి ఉన్నారు.

ఆంజనేయుడిని దర్శించుకున్న బొంతు శ్రీదేవి



హనుమాన్ జయంతి సందర్భంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని బీఎన్‌రెడ్డి కాలనీలోని ఆంజనేయస్వామిని, చర్లపల్లిలోని ఆంజనేయస్వామిని, చిన్న చర్లపల్లి లోని ఇండస్ట్రియల్ ఏరియాలోఉన్న పురాతన ఆంజనేయ స్వామి ఆలయంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ప్రభుగౌడ్, కొమ్ము నార్సింగ్ రావు, నాథం, వంశీ, రాజు, మల్లేష్, రాజు గౌడ్, పాండు ముదిరాజు,బ, భాను చందర్, బాబు, విజయ్, బాల్‌రాజు, రవి, వెంకటరెడ్డి,సదానందం, ప్రభాకర్‌రెడ్డి, భాను, రాజేష్, మల్లేష్ తదితరులున్నారు.

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీలో..



హనుమాన్ జయంతి సందర్భంగా మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీలోని ఆంజనేయుడిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డిలు దర్శించుకుని శోభయాత్ర పాల్గొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న ఈటల



హనుమాన్ జయంతి సందర్భంగా హౌసింగ్ బోర్డ్ కాలనీ, మౌలాలిలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో ఈటల రాజేందర్ పాల్గొన్నారు.

అల్వాల్‌లో..



అల్వాల్‌లోని 134 డివిజన్ రాజీవ్ వీకర్ సెక్షన్‌లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. వారిని ఆలయ అర్చకులు సత్కరించారు. కార్యక్రమంలో రవి, వెంకటేష్ గౌడ్, అఫ్జల్, భక్తులు హాజరయ్యారు.

మల్కాజిగిరి అభివృద్ధికి ఈటల రాజేందర్‌ను గెలిపించాలి

- కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గం సమగ్రాభివృద్ధికి ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి 'ఈటల రాజేందర్'ను భారీ మెజారిటీతో గెలిపించాలని వినాయక్ నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి కోరారు. మంగళవారం ఆమె, డివిజన్ పరిధిలోని నవ భారత కాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి పెట్టారు. కమలం గుర్తు కు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మల్కాజిగిరి అభివృద్ధి చెందాలంటే అది బీజేపీతోనే సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో మళ్ళీ వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. ఇది గుర్తించి 'కమలం' గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ ఓం ప్రకాష్, సాయిసురేష్,గోపాల్, శ్రీకాంత్ ,లత్,శ్రీధర్,సూరి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.



ప్రమాదవశాత్తు మెకానిక్ షెడ్‌కు అగ్నిప్రమాదం



నవతెలంగాణ-దుండిగల్

డీసీఎం వాహనానికి మెకానిక్ షెడ్‌లో వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు రెగ్జిన్ సీటుపై మంటలు వ్యాపించి, పక్కనున్న ఉన్న మరో మినీ బస్సుకు సైతం మంటలు వ్యాపించి అగ్నికి ఆహుతి అయిన సంఘటన దుండిగల్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్ పల్లి చౌరస్తా సమీపంలో గల మెకానిక్ షెడ్ లో మంగళవారం ప్రమాదవశాత్తు రెండు వాహనాలకు మంటలు వ్యాపించడంతో సమయానికి అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చారు. మొత్తంగా రూ.17 లక్షల వరకు నష్టం వాటిల్లిందని షెడ్ బాధితులు తెలుపగా దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



టీచర్ల హాజరును పటిష్టంగా నమోదు చేసేందుకుగాను పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ బడుల్లో జియో అటెండెన్స్‌ను అమలు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే జిల్లాలోని అన్ని పాఠశాలలకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. తాజాగా ఆ ట్యాబ్‌లకు సంబంధించిన సిమ్ కార్డులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తోంది. సోమవారం డీఈవో కార్యాలయం నుంచి వచ్చిన సిమ్ కార్డులను బహుదూరపురా డిప్యూటీ ఐవోఎస్ హరి నారాయణ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం మందడి వెంకట్ రెడ్డి, రవికాంత్, సీఆర్పీలు కౌసల్య, అపర్ణ, జూనియర్ అసిస్టెంట్ ఖలీలు తీసుకున్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

వేసవిలో విద్యార్థులు పుస్తక పఠనం చేయాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పురానాపూల్‌లోని ఎస్వీ నగర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల అఫ్జల్ గంజ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజాకుమారి అన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల చివరి దినంలో భాగంగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రగతి పత్రాలు (ప్రొగెసివ్ కార్డులను) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎండలు మండిపోతున్నాయని బయట తిరగకుండా టీవీ, సెల్‌ఫోన్‌లను వాడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోని పుస్తకాలపై విజ్ఞానం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు డాక్టర్. ఎస్. విజయ భాస్కర్, ప్రద్యుమ్న రెడ్డి, బల్వంత్ రెడ్డి, సుచరిత,కౌసర్ ఫాతిమా, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ మోహినుద్దీన్ విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆచార్యులు శ్రీమాన్ ఎస్ రాజగోపాల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి



నవతెలంగాణ-ధూల్‌పేట్

జియాగూడ రంగనాథ స్వామి దేవాలయంలో సుదీర్ఘ కాలం భక్తులకు సేవలందించిన రంగనాథ దేవాలయం ప్రధాన అర్చకులుగా ఉన్న శ్రీమాన్ ఎస్. రాజగోపాల్ ఆచార్యులు హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని జియాగూడ పేరెంట్స్ అసోసియేషన్ సంతాపం ప్రకటించింది. వారి కుటుంబ సభ్యులకు జియాగూడ పేరెంట్స్ అసోసియేషన్ తరుపున ప్రగాఢ సానుభూతిని తెలుపు తున్నామని అసోసియేషన్ కన్వీనర్ పి.నాగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర కౌన్సిల్‌కు పీడీఎస్‌యుకు ఎటువంటి సంబంధం లేదు

ప్రగతి శీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం

నవతెలంగాణ-ముషీరాబాద్

కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర కౌన్సిల్‌కు పీడీఎస్‌యుకు ఎటువంటి సంబంధం లేదని సంఘం నిర్మాణ ఉల్లంఘనకు పాల్పడిన సాంబ, వెంకట్ రెడ్డి, సతీష్, రత్నం రమేష్‌లను గత సమావేశంలో 15న పీడీఎస్‌యు నుంచి బహిష్కరించడం జరిగిందని పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరుశురాం తెలిపారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ పేరుతో పోస్టర్ విడుదల చేయడం హాస్యాస్పదం, ఈ కౌన్సిల్ మాకు ఎటువంటి సంబంధం లేదని పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. మార్చి 26 తేదీల్లో సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరగాల్సిన పీడీఎస్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ఎన్నిక ఎన్నికల కారణంగా వాయిదా వేస్తున్నామని సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఎన్నికల తర్వాత జనరల్ కౌన్సిల్ ఉంటుంది. కొత్తగూడెంలో ఏప్రిల్ 2న తల పెట్టిన కౌన్సిల్ కు పీడీఎస్‌యు రాష్ట్ర కమిటీకి సంబంధం లేదు. ఇది ఒకరిద్దరు అరాచక వాదులు, (సాంబ, వెంకట్ రెడ్డి) విచ్ఛిన్నకులు, బహిష్కృతులు తల పెట్టినదిగా విద్యార్థులు, తోటి విద్యార్థి సంఘాలు, మేధావులు అర్థం చేసు కోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పీడీఎస్‌యు పేరిట సాగిస్తున్న వీరి విచ్ఛిన్నకర, అబద్దపు, నీచమైన కుట్రల్ని తిప్పికొట్టాలని విద్యార్థులను కోరుతున్నామని తెలిపారు.

ఘనంగా విజయకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట:

కార్పొరేటర్ ఇ. విజయకుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు.బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లవంగు అంజనేయులు, మహేష్ ముదిరాజ్,వంజరి నాగరాజు ధరమ్ సింగ్, తిరుపతి, గౌస్ వినయ్, లవంగ నాగరాజు ,లవంగ గణేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ఇక్షోర భేష్..





నవతెలంగాణ-ధూల్‌పేట్

స్వచ్ఛతలో ఇక్షోర కంపెనీ స్వచ్ఛ తకు మారుగా పనిచేస్తుంది. బషీర్ బాగ్ లోక్ అదాలత్ సమీపంలో డంపింగ్ యార్డ్‌లా మారిన పరిసరాలను జీహెచ్ ఎంసీ ఇక్షోర కంపెనీ కార్మికులు పూర్తిగా పరిశుభ్రపరిచారు. మురికి కూపగ ఉన్న ఆ ప్రాంతం చెత్త చెదారం తొలగించి చల్లార్పు చల్లి ముగ్గులు వేయడంతో ఆ ప్రాంతా రూపు రేఖలు మారిపోయాయి. స్థానికులను ఆశ్చర్యపరిచింది. జీహెచ్ ఎంసీ అధికారులు పరిలించి అభినందించారు. పరిశుభ్ర పరచి స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ పాటించాలని అధికారులు సూచించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గుల్ గ్రామ పంచాయతీ స్థలాన్ని నాదర్ గుల్ మాజీ సర్పంచ్ కుమారుడు కబ్జా చేస్తున్నారని గ్రామ ప్రజలు బుధవారం మాజీ ఎంపీటీసీ కందాడి శ్రీరాం రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రఘుకు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఉన్న గ్రామపంచాయతీ స్థలాన్ని మా సొంత స్థలమని చెప్పి మాజీ సర్పంచ్ కుమారుడు కబ్జా చేసి ఆక్రమించుకొని భవన నిర్మాణ పనులు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయం తెలిసిన కూడా ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు తెలిసి తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే నాదర్ గుల్ మాజీ ఎంపీటీసీ సభ్యులు కందాడి శ్రీరామ్ రెడ్డి స్పందించి గ్రామస్తులను ఐక్యం చేసి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

- జిల్లావ్యాప్తంగా 76 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 17,055 మంది విద్యార్థులు
- గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 25న పరీక్షలు ప్రారంభమై.. వచ్చే నెల 2వ తేదీన ముగియనున్నాయి. ఇందుకోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లావ్యాప్తంగా మొత్తం 76 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొత్తం 17,055 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో పదో తరగతి విద్యార్థులు 8,712 మంది ఉండగా, ఇంటర్ విద్యార్థులు 8,343 మంది ఉన్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5.30గంటల వరకు మరో సెషన్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఇదిలావుంటే పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం తలెత్తకుండా ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశామని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్. రోహిణీ, జిల్లా సమన్వయకర్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కాగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా సంబంధిత అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్టు వారు చెప్పారు. కాగా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 76 సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 8 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సిద్ధం చేశారు. 76 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 76 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 30 మంది కస్టోడియన్లు, జాయింట్ కస్టోడియన్లతో పాటు ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు తెరవకుండా చర్యలు చేపట్టారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్తు సరఫరా, తాగునీరు, వసతి, అత్యవసర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్టు పేర్కొన్నారు.

విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

ఆర్.రోహిణి, డీఈవో, హైదరాబాద్



ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 8గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తాం. ఎగ్జామ్స్ సెంటర్స్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

డాక్టర్ ముజీబ్ సేవలకు గుర్తింపుగా 'తల్వార్' బహుకరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఉద్యోగులతో పాటు ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి సిక్కు సామాజిక వర్గ పెద్దలు మంగళవారం నాంపల్లి గృహకల్ప కార్యాలయంలో వారి కుల సంఘం 'తల్వార్'ను ఉద్యోగుల సమక్షంలో బహుమతిగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ సిక్కు సామాజిక వర్గం వారి ప్రేమ ఆప్యాయతకు సదా రుణపడి ఉంటానని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని, తాను చేస్తున్న ఈ కార్యక్రమాలకు తన తల్లిదండ్రుల ఆశీర్వాదం, కుటుంబ సభ్యుల మద్దతుతోనే అని తెలిపారు.



ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ రేణుక శంకర్ నాయక్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం పరిధిలోని తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన వార్షికోత్సవం ఈ కార్యక్రమంలో నాయకులు పార్టీ శ్రేణులు దంప తులకు పూలు మాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరిస్తూ కేక్ కట్ చేసి వివాహ వార్షికోత్సవం జరుపుకున్నారు.

నవతెలంగాణ-సంతోష్ నగర్

ఎర్లీ బర్డ్ పథకానికి వారం రోజులే గడువు

- పన్ను చెల్లిస్తే ఐదు శాతం రిబేట్ సొంతం
- రూ. 5.11 కోట్ల ఆస్తి పన్ను చెల్లించి రూ.26.92 లక్షల రిబేట్ పొందిన యశోద ఆస్పత్రుల యాజమాన్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎర్లీ బర్డ్ పథకానికి ఇంకా వారం రోజులే గడువు ఉంది. ఈ అవకాశాన్ని హైదరాబాద్ నగర ప్రజలు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పిలుపునిచ్చారు. ఎర్లీ బర్డ్ పథకంలో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరం హైదరాబాద్ నగరంలోని యశోద ఆసుపత్రుల యాజమాన్యానికి సంబంధించిన వివిధ ప్రాంతాల్లో 11 ఆసుపత్రులకు సంబంధించి ఈ సంవత్సరం ఆస్తి పన్ను చెల్లించారు. ఎర్లీబర్డ్ పథకంలో భాగంగా రూ. 5,38, 55, 471 లకు గాను రూ.5,11,73,133లు చెల్లించారు. 5 శాతం రిబేటు క్రింద రూ. 26,92, 790 పొందారని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆస్తిపన్నుకు సంబంధించిన చెక్కులను యాజ మాన్యం వారు కమిషనర్‌కు అందజేశారు. ఎర్లీ బర్డ్ పథకం ఈ నెల 30తో ముగియనున్నం దున 2024-25 ఆర్థిక సంవత్సరం సం బందించిన ఆస్తి పన్ను చెల్లించని వారు వెంటనే పన్ను మొత్తం చెల్లించి ఐదు శాతం రిబేటు పొందాలని కమిషనర్ సూచించారు.

పుస్తకం మంచి మిత్రులతో సమానం

- ఉప ప్రచార్యులు డాక్టర్. విప్లవధత్ శుక్లా



నవతెలంగాణ-ధూల్‌పేట్

పుస్తకం ఓ మంచి మిత్రులతో సమానమని ఉప ప్రచార్యులు డాక్టర్. విప్లవధత్ శుక్లా అన్నారు. గ్రంథాలయ శాస్త్ర విభాగం, ప్రభుత్వ సిటీ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. వివేకానందుడు, డాక్టర్. బి. ఆర్ అంబేద్కర్ వంటి వారు విజ్ఞానాన్ని పొందటానికి పుస్తకాలు ప్రధాన వనరులు అన్నారు. రాష్ట్రంలోనే లక్ష పుస్తకాలు గల గొప్ప గ్రంథాలయం సిటీ కళాశాలలో కొలువు తీరడం పై సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఈ గ్రంథ సంపదను ఉపయోగించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని, పుస్తకంను మిత్రునిగా, గురువుగా అన్ని విధాలుగా ఉపయోగించుకొని ఉన్నత విలువలు అందిపుచ్చుకోవాలన్నారు. వివిధ సామాజిక, సాహిత్య, జీవిత చరిత్రలు చదివి విజ్ఞానం సంపాదించాలన్నారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఏలూరు యాదయ్య మాట్లాడుతూ.. గ్రంథాలయంలో కాంపిటీటివ్ పుస్తకాలను చదువుకొని ఉద్యోగాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. సీనియర్ అధ్యాపకురాలు నీరజ మాట్లాడుతూ.. పుస్తకాల ద్వారా సమాజ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అన్ని పుస్తకాలు చదవాలని తెలిపారు. సీనియర్ అధ్యాపకులు రత్న ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు నవలలు, దిన పత్రికలు, కళాశాలలో ఉన్న ప్రముఖమైన గ్రంథాలను చదవాలని విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ఉత్తమ చదువు వనరులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నిర్వాహకుడిగా గ్రంథ పాలకులు డాక్టర్ రవికుమార్ చేగొని వ్యవహరించిన ఈ కార్యక్రమంలో అవధానం సుజాత, కేతరిన, అజ్మీర సుజాత, దూసి శ్రీనివాస్, ఝాన్సీ, పద్మానురాధ, అసిస్టెంట్ లైబ్రరీ ఫాతిమా తబుసం, బాలేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం

- మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి ఘన విజయం సాధిస్తారని బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని 20వ డివిజన్ లోని భీమిడి కాలనీ, శ్రీ లక్ష్మి ఎంక్లేవ్ కాలనీలో చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా. గడ్డం రంజిత్ రెడ్డికి మద్దతుగా ఉండాలని కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ వైస్ చైర్మెన్ చిగురింత నరసింహారెడ్డి స్థానిక కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని అందుకోసం ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సైనికుల్లా చేయాలని తెలిపారు. అలాగే కాలనీ వాసులు కూడా ఓటింగ్‌లో పాల్గొని అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో , భీమిడి చంద్ర పాల్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, కొవ్వూరి రాకేష్, ఆనంద్ రెడ్డి, గిరి ముదిరాజ్, ఎల్లేశ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో హనుమాన్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నాగోల్

హనుమాన్ జయంతి పురస్కరించుకుని నాగోల్ డివిజన్ జయపురి కాలనీలో ప్రతి యేటా హనుమాన్ మందిరంలో రుషి మహారాజు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆశీస్సులతో దేశ ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అతి పరాక్రమ వంతుడైన హనుమాన్ జయంతి సందర్భంగా ఆనందం, సామరస్యం, శ్రేయస్సు కలగాలని అందరికి పవన సుతుడి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, వీరేందర్, సాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్య వైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



అంబర్‌పేటలో..



అంబర్‌పేటలో..



ముషీరాబాద్‌లో..



సుల్తాన్‌బజార్‌లో..

నవతెలంగాణ-అంబర్‌పేట:

ఆధ్యాత్మికత చింతనతో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య కిషన్ రెడ్డి అన్నారు. హనుమన్ జయంతి సందర్భంగా మంగళవారం కాచిగూడ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో ఆలయ అధ్యక్షులు ఎస్.గోపాల్ రావు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అలంకారసేవ, సత్య నారాయణస్వామి పూజలు నిర్వహిం చారు. అనంతరం వేలాది మంది భక్తుల కు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ హాజ రై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో రాజుకుమార్విగ్, రాజేందర్ పటేల్, వీరాస్వామి, సాయి గిరిధర్, విజయ్‌కుమార్, బి. కృష్ణాగౌడ్, రతన్ విద్యాసాగర్, సత్య నారాయణ, నందకిషోర్ యాదవ్, శివకుమార్, యాదయ్య పాల్గొన్నారు.

చై నెంబర్‌లో..

హనుమాన్ జయంతి పురస్కరించుకొని చై నెంబర్ రామ మందిరం హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ సిబ్బంది గోకుల్ ప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మైసమ్మ ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివకుమార్, నాయకులు సంతో ష్ కుమార్, విశాల్ తివారీ, దేవేందర్, మనస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, సీనియర్ నాయ కులు డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్, ధాత్రిక్ నాగేందర్ బాబ్జి, సదానందు, బబ్లు సింగు, అంటో, నరసింహ, శ్రీకాంత్ యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముషీరాబాద్

హనుమాన్ జయంతి పురస్కరించుకొని తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులు సంస్థ సభ్యు లను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు, కోశాధికారి వెంకటేశ్వర్లు గుప్తా, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హనుమాన్ జయంతి సందర్భంగా భజరంగ్ దళ్ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో తల పెట్టిన వీర హనుమాన్ విజయ యాత్ర ఎంతో కన్నుల పండువగా సాగింది. వేలాది మంది హనుమాన్ భక్తులు హాజరై జై శ్రీరామ్, రామ్‌లక్ష్మణ్ జానకి జై భోలో హనుమాన్ అనే నినాదాలతో నగర రోడ్లు మారుమోగిపో యాయి. గౌలిగూడ నుండి తాడ్ బంద్ వరకు కాషాయమయంగా మారాయి. యాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బలగాలతో బందోబస్తును నిర్వహించారు. గౌలిగూడ నుంచి కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా, సుల్తాన్ బజార్, నారాయణగూడ, చిక్కడపల్లి, గాంధీనగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, కావడిగూడ, బైబిల్ హౌస్, ప్యారడైజ్ మీదుగా తాడ్ బంద్ హనుమాన్ దేవాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా గౌలిగూడ రామ మందిర్ వద్ద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే రాజాసింగ్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవిలతలు హాజరై యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బజరం గదళ్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు నరసింహమూర్తి ,జగ దీశ్వర్, బాలస్వామి, సుభాష్ చందర్ ,శివరాములు పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కోఠి బాట చౌరస్తాలో..

కోఠి బాట చౌరస్తా వద్ద హనుమాన్ జయంతి సంద ర్భంగా భక్తులకు స్వాగతం పలుకుతున్న శైలేందర్ యాదవ్ గులాబ్ శ్రీనివాస్ తదితరులు

నవతెలంగాణ- ధూల్‌పేట్

హనుమాన్ జయంతి సందర్భంగా శోభా యాత్ర పాతబస్తీ గోషామహల్ లో ఘనంగా నిర్వహించారు. జియాగూడ, ధూల్ పేట్, మంగళ్ హాట్, ప్రాంతాల మీదుగా బేగం బజార్, సిద్దంబర్ బజార్ ప్రాంతాల గుండా ర్యాలీ నిర్వహించారు. పాతబస్తీ గౌలి పుర, చత్రినాక, చార్మినార్, హుస్సేన్ అలం, సిటీ కళాశాల ర్యాలీలు కొనసాగించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా ప్రాంతాల గుండా వెళ్ళిన ర్యాలీ కనుగుంగా వాహనాలు ట్రాఫిక్ పోలీసులు దారి మళ్లించారు.

కండ్లు తెరిచాడంటూ వదంతులు..

పాతబస్తీ , కబూతర్ ఖానలో ప్రసిద్ధగాంచిన కాడివాల హనుమాన్ మందిర్‌లో హనుమంతుడు కండ్లు తెరిచాడని వదంతులు వ్యాపించాయి. ఉదయం భక్తులు హనుమాన్ పారా యణం జరుపుతున్న వేళ ఒక్కసారి గోడకు ఉన్న పంచముఖ హనుమాన్ విగ్రహం కండ్లు అటుగా తిప్పినట్లుగా కొందరు భక్తులకు అనిపించింది. వెంటనే ఈ విషయం వైరల్ అవ్వడంతోభక్తులు ఆలయానికి క్యూ కట్టారు.



అంబర్‌పేటలో..



ధూల్‌పేటలో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం | ఏప్రిల్ 24, 2024 | www.navatelangana.com

విద్యార్థులకు బీఎంఐపై అవగాహన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజ్ఞాన్‌జ్యోతి పబ్లిక్ స్కూల్, మధురానగర్ యూసఫ్‌గూడాలో బీఎంఐపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు, పోషక విలువలు గురించి జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖరరావు వివరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ్ కుమార్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లో వివిగిరినగర్‌లోని హనుమాన్ దేవాలయంలో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ యువనేత జయసింహ పాల్గొన్నారు.
నవతెలంగాణ - ముషీరాబాద్

ఓయూ అభివృద్ధి కోసం కనెక్ట్ టు రికనెక్ట్ థీమ్‌తో ఉత్సవాలు



- 3 రోజుల పాటు ఓయూ 107వ వార్షికోత్సవాలు
- ఉదయం 2కె, వాక్, 25న, ఓపెన్‌డే, 26న వ్యవస్థాప దినోత్సవ లెక్చర్..

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా తక్ష్-2024లో భాగంగా నేటి ఉదయం 2కిలోమీటర్ల నడక వాకథాన్‌తో ప్రారం భం కానుందని నిర్వాహకులు తెలిపారు. ఉస్మానియా అభివృద్ధి కోసం కలిసి నడిచేందుకు కనెక్ట్ టు రికనెక్ట్ థీమ్‌తో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు విశ్వవిద్యాలయ అధికార యంత్రాంగం సన్నద్ధమైందని, బుధవారం ఉదయం ఏడు గంటలకు ఇంజనీరింగ్ కళాశాల నుంచి 2కె నడక ప్రారంభమై ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఇటీవలే నిర్మించిన సెంటినరీ పైలాన్ వరకు సాగనుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొంటారు. 25వ తేదీన క్యాంపస్, కానిస్టిట్యూ ఏంట్ కళాశాలల్లో ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆయా కళాశాలల్లో జరుగుతున్న కార్యక్రమాలు, పరిశోధనలను ఈ కార్యక్రమం ద్వారా సందర్శకులు, సాధారణ ప్రజలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తారు. యూనివర్సిటీతో సమాజాన్ని కలిపే ఉద్దేశంతో అకడమిక్ వాతావరణాన్ని ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. వార్షికోత్సవాలు మూడోరోజు ఘనంగా ముగింపు ఉత్సవాలు జరగనున్నాయని, 26న, ఉదయం ఠాగూర్ ఆడిటోరియంలో ఉస్మానియా విశ్వవిద్యా లయ వ్యవస్థాపక దినోత్సవం జరగనుందన్నారు. నీతిఆయోగ్ గౌరవ సభ్యుడు డాక్టర్ విజయ్ కుమార్ సారస్వత్ ముఖ్య అతిథిగా హాజ రుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఓయూ పూర్వవిద్యార్థి, అమెరికాలోని ఇమాజియాకార్పొరేషన్‌వ్యవస్థాపకులు, ముఖ్య కార్యనిర్వ హణాధికారి వీణా గుండవల్లి ముఖ్య అతిథులుగా పాల్గొం టారన్నారు.మధ్యాహ్నం మూడు గంటలకు ఠాగూర్ ఆడిటోరియంలో సాంస్కృతి కార్యక్ర మాలు నిర్వ హించనున్నారని, విద్యార్థుల ఆట పాటల కార్యక్రమానికి ప్రముఖ కవి, గీత రచయిత జయరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొం టారన్నారు. ఈ మూడు రోజుల ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ట్యాంకర్ డెలివరీ సమయాన్ని తగ్గించాలి

- వీలైనంత త్వరలో ట్యాంకర్ డెలివరీ సమయాన్ని 12 గంటలకు తగ్గించాలి
- మార్చితో పోలిస్తే పెరిగిన ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్స్, పాయింట్స్
- తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- నీటి సరఫరాలో ఉద్దేశపూర్వక ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- తాగునీటి సరఫరాపై ఎండీ సమీక్ష

నవతెలంగాణ-సిటీబ్యూరో

తాగు నీటి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నీటిని సరఫరా చేయాలని జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. వేసవి కార్యాచరణ, ట్యాంకర్ మేనేజ్ మెంట్‌పై ఎండీ సుదర్శన్ రెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సమీక్ష సమావేశానికి సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నీటి సరఫరా, ట్యాంకర్ బుకింగ్స్, డెలివరీ టైమ్ తదితర వివరాల్ని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ట్యాంకర్ బుకింగ్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేయాలన్నారు. తొందర్లోనే ట్యాంకర్ డెలివరీ సమయాన్ని 12 గంటలకు తగ్గించాలని సూచించారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. జలమండలి తీసుకున్న ప్రత్యేక చర్యల వల్ల నగరంలోని సగానికి పైగా ఫిల్లింగ్ స్టేషన్లలో 24 గంటల్లోపే ట్యాంకర్ డెలివరీ చేస్తున్నామని వెల్లడించారు. ఏప్రిల్ మొదటి నుంచి ఈ రోజు వరకు పరిస్థితిని బట్టి రాబోయే రెండు నెలలకు ప్రణాళికలు రచించుకోవాలన్నారు.

పెరిగిన ట్యాంకర్లు, ట్రిప్పులు, డెలివరీలు..

మార్చి నెలతో పోలిస్తే కొత్త ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్స్ ఏర్పాటు చేశామన్నారు. రాత్రి వేళల్లో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయడంతో పెండెన్సీ బాగా తగ్గించు కున్నామని తెలిపారు. మార్చి నెలలో మొత్తం 1,68,996 ట్యాంకర్ ట్రిప్పులను డెలివరీ చేశామన్నారు. ఈ నెలలో 22 నాటికే 1,67,134 ట్రిప్పులు సరఫరా చేసినట్లు వెల్లడించారు. కాగా మార్చి 31 నాటికి 613 ట్యాంకర్లు ఉండగా, ప్రస్తుతం 816 వరకు పెంచుకున్నట్లు తెలిపారు. మరిన్ని ట్యాంకర్లు సమకూర్చుకుంటామని వివరించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎంసీసీకి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా మంచినీటి సరఫరాకు సంబంధించిన సమస్యలు, కలుషిత నీరు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే మురుగు నీటి నిర్వహణపైనా దృష్టి సారించాలని సూచించారు. నీటి సరఫరాలో ఉద్దేశ పూర్వకంగా ఆటంకాలు కలుగజేస్తే, ఎంతటి వారైనా సహించేది లేదని హెచ్చరించారు. ట్యాంకర్ల మళ్లింపు విషయంలోనూ కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో డైరెక్టర్ ఆపరేషన్స్-1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకర్ బుకింగ్, డెలివరీ

క్ర.సం.	వివరాలు	మార్చి 31నాటికి	ఏప్రిల్ 22 నాటికి
1	మొత్తం ట్యాంకర్లు	613	816
2	ఫిల్లింగ్ స్టేషన్లు	70	86
3	ఫిల్లింగ్ పాయింట్స్	108	151
4	రోజూవారీ బుకింగ్స్	4945	6064
5	రోజూవారీ డెలివరీ	6579	8390
6	సరఫరా చేసిన ట్రిప్పులు	1,68,996	1,67,134

ఘనంగా హనుమాన్ జయంతి





నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట పరిధిలోని హనుమాన్ దేవాలయాలలో, ఎస్‌పిరోడ్‌లోని వీర హనుమాన్ దేవా లయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం తెలంగాణ జేఏసీ అధ్యక్షుడు బద్రీనాథ్ ఆచార్యులు మాట్లాడుతూ ఎస్‌పీ రోడ్‌లోని వీరహనుమాన్ దేవాలయం ఎంతో ప్రాముఖ్యత కలిగిన దేవాలయంగా గుర్తింపు పొందిందని భక్తులు కోరిన కోరికలను నెర వేర్చే దేవుడిగా వీర హనుమాన్ దేవాలయం ఎంత ప్రసిద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువుగట్టు ఈవో నవీన్, సూపరిటెండెంట్ తదితరులు పాల్గొన్నారు

హనుమాన్ ఆలయంలో బాబా ఫసియుద్దిన్ పూజలు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



హనుమన్ జయంతి సందర్భంగా బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూజీ మేయర్ బాబా ఫసియుద్దిన్ బోరబండ బస్‌స్టాప్ వద్ద సాయిబాబా, హనుమన్ ఆలయాలలో పూజ కార్యక్ర మంలో పాల్గొన్నారు. అనం తరం బోరబండ నియోజకవర్గ ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహ రసాల, బోరబండ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బాబా ఫసియుద్దిన్



బొరబండ వీకెర్ సెక్షన్, నాట్కో స్కూలు, ఎదురుగా జైవాన్త్‌నగర్ బస్తీలో హనుమన్ జయంతి సందర్భంగా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్, బోరబండ, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దిన్ పాల్గొన్నారు.నరసింహ రసాల, కవిత, రేణుక, స్తానిక మహిళలు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి
రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శ్రీ మోతె శోభన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

జై హనుమాన్ జయంతిని పురస్కరించుకొని తార్నాక డివిజన్ హనుమాన్‌నగర్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయంలో అభయాంజనేయ స్వామి వారికి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి తెలంగాణ కార్మిక విభాగం అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మోతె శోభన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హనుమంతుడి అనుగ్రహంతో ప్రజల జీవితాల్లోని కష్టాలన్నీ తొలగిపోయి, ఎల్లప్పుడు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థిస్తూ, ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు
కార్పొరేటర్ సామల హేమ



హనుమాన్ జయంతి సందర్భంగా నామలగుండులోని శ్రీ విజయంజనేయ ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంజనేయుని అభయ హస్తం సమస్తలోకంపైన ఉండాలని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. సీతఫలమండిలోని మారుతి సంఘంతో పాటు పలు హనుమాన్ మండపాలను సందర్శించి దర్శించుకున్నారు. కరాటే రాజు కుమార్,జలంధర్ రెడ్డి,రవి, మండపాల సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజక వర్గంలోని జూబ్లీహిల్స్ డివిజన్ దుర్గభవాని నగర్ ఫిలింనగర్‌లో గల శ్రీశ్రీశ్రీ ఆంజనే యస్వామి వారి దేవాలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీ స్సులు తీసుకొని భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు మోహన్ యాదవ్, మహిళా నాయ కురాలు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి బీజేపీకే పరిమితం కాదు : రోహిన్ రెడ్డి

నవతెలంగాణ-బంజారాహిల్స్

హనుమాన్ జయంతి బీజేపీ వాళ్లకే పరిమితం కాదని, భగవంతుని అందరూ ఆరాధిస్తారని, భారతదేశం ఎప్పటికీ సెక్యులర్ దేశమేనని కాంగ్రెస్ పార్టీ నాయకులు రోహిన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు హనుమాన్ ఆలయాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సి.రోహిన్‌రెడ్డి, జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాటూరి రమేష్, ఏ బ్లాక్ అధ్యక్షులు బబ్లు, ఖైరతాబాద్ డీసీసీ జనరల్ సెక్రెటరీ శ్యామ్ నాయుడు, మాల మహానాడు అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్, ఖైరతాబాద్ వైస్ ప్రెసిడెంట్ యూత్ కాంగ్రెస్ జగదీష్, ఖైరతాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వనాథ్, ఉదయ్‌కిరణ్, సీనియర్ నాయకులు హరిప్రసాద్, శరత్, నిఖిల్, దినేష్ పాల్గొన్నారు.



ఘనంగా హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

హనుమాన్ జయంతి వేడుకలు సికింద్రాబాద్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మైలార్ గడ్డ మారుతి సంఘం ఆధ్వర్యంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ కుమార్ గౌడ్. జలంధర్ రెడ్డి. బ్యాంకు రమేష్ లంబు కుమార్. శ్రీనివాస్ గౌడ్ జాషువా నందేవ్ ఉన్నారు.



హనుమాన్ జయంతి పురస్కరించుకొని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
నవతెలంగాణ-బేగంపేట

బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత నామినేషన్ దాఖలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత సాయన్న మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. నాయకులతో కలిసి రిటర్నింగ్ అధికారి మధుకర్ నాయక్‌ను కలిసి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆమె మాట్లాడుతూ తన తండ్రి చేసిన అభివృద్ధి పనులు, కేసీఆర్ కంటో న్మెంట్‌కు చేసిన సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని నివేదిత ధీమా వ్యక్తం చేశారు.


నామినేషన్ దాఖలు చేసిన బీజేపీ అభ్యర్థి వంశ తిలక్



కంటోన్మెంట్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశ తిలక్ మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ నేతలతో కలిసి రీటనింగ్ ఆఫీసర్ మధుకర్ నాయక్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ భారత దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ, ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న బీజేపీకు ప్రజల మద్దతు ఉంటుందని తెలిపారు.

శిశువు మృతదేహం కలకలం

నవతెలంగాణ-బంజారాహిల్స్



మురుగునీరు పనులు నిర్వహిస్తున్న సమయంలో శిశువు మృతదేహం బయటపడ్డ ఘటన బంజారాహిల్స్ వెం కటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్‌లో చోటు చేసుకుంది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారంవాటర్‌వర్క్స్ సిబ్బంది, అధికారులు మురుగునీటి పనులు డ్రయినేజీలను క్లీన్ చేస్తుండగా శిశువు మృతదేహం బయటపడింది. గమనించిన కార్మికులు అధికారులకు, బంజా రాహిల్స్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం అధికారులు క్లూస్ టీంతో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పూర్తిగా కుళ్ళిపోయిన దశలో శిశువు మృతదేహం బయటపడినట్లు గమనించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పద్మారావుకు టీఏటీయూ మద్దతు




నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్‌యూనియన్ (టీఏటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో టకరా బస్తీలోని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.పద్మా రావుగౌడ్‌ని మంగళవారం ఆటో యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్‌కే ఉంటుందన్నారు. రేపటి నుంచి ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా జరుపుతామని వేముల మారయ్య తెలిపారు. అందరూ కష్టపడి బీఆర్ఎస్‌ని గెలిపించాలని యూనియన్ సభ్యులకు ఎంపీ అభ్యర్థి పద్మా రావు గౌడ్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు డి.శ్రీనివాస్,నిరంజన్,పెద్దిరాజు, రాకేష్, కుమార్, ఎల్లయ్య , వెంకటేష్, పాల్గొన్నారు.

జూన్ 20న చలో హైదరాబాద్

- నంగారాబేరి లంబాడి హక్కుల పోరాట సమితి

నవతెలంగాణ-బంజారాహిల్స్



ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు 100శాతం రిజర్వేషన్ అమలు కోసం పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలంటూ జూన్ 20న ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వేదికగా పెద్ద ఎత్తున ఎస్టీ సంఘాల ఐక్యవేదిక, అన్ని ఎస్టీ ఉపకులాల ఆధ్వర్యంలో ధ ర్నా చేపట్ట నున్నట్టు లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గంగులోతు రాజేష్ నాయక్ తెలియజేశారు. ఈ సందర్భంగా మంగళవారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్ సన్నా హక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రెండు సార్లు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ పార్టీ గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్ అమలులో జాప్యం చేసే గిరిజనులను మోసం చేసిందన్నారు. అందుకే ఆ పార్టీని గిరిజనులము అందరం కలిసి ఎన్నికలలో ఓడించామన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన గిరిజనుల ఓట్లు అత్యంత కీలకంగా ఉంటాయని విషయాన్ని అన్ని పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. అదే విధంగా గిరిజన ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ట్రైబల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసి 100 శాతం గిరిజన రిజర్వేషన్‌పై తీర్మానం చేసి అమలుపై పార్లమెంట్ ఎన్నికల ముందే స్పష్టత ఇవ్వాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీని జరగబోయే పార్లమెంటు ఎన్నికలలో ఓడించి తీరుతామని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడి సామాజిక వర్గానికి చెందిన నాయకులకు తమ మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొమరం బుచ్చయ్య దొర, ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జాదవ్ సోమేశ్, తెలంగాణ గోండ్వాన విద్యార్థి సంక్షేమ పరిషత్ కన్వీనర్ ఇర్పా ప్రకాష్ దొర, మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా ఏజెన్సీ జేఏసీ జిల్లా అధ్యక్షులు వడ్డిత్యా రాజు నాయక్, లంబాడి విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య కుమార్,వి రమేష్,ఆర్ స్వామి పెందూర్,దీపక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
హైదరాబాద్
HMDA
బుధవారం | ఏప్రిల్ 24, 2024 | www.navatelangana.com

సమాజాన్ని చైతన్యపరిచే సమాచారం అందించాలి : గుత్తా సుఖేందర్ రెడ్డి



నవతెలంగాణ-కల్చరల్

పరిణామం సహజమని అన్ని రంగాలలో మార్పు జరుగుతున్నా పత్రికా రంగంలో ఆశాజనకంగా మార్పు లేదని రాష్ట్ర శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గత ఐదేండ్ల కాలం నుంచి సామాజిక మాధ్యమాలు యూ ట్యూబ్ ఛానెల్స్ అధికంగా రావటం తో సరైన సమాచారం అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై సీల్ వెల్ కార్పొరేషన్ శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో క్రోధి ఉగాది సందర్భంలో పాత్రికేయ శిరోమణి ఉత్తమ పాత్రికేయ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా సుఖేందర్ రెడ్డి పాల్గొని పాత్రికేయ శిరోమణి పురస్కారాలు కనక దుర్గ నందిరాజు రాధా కృష్ణ,కాసుల ప్రతాపరెడ్డి, తాడి ప్రకాష్ , వున్న కృష్ణ మూర్తి లకు ఉత్తమ పాత్రికేయ పురస్కారాలు గీతాంజలి,విరహత్ ఆలీ, శ్రీర్ , గుర్నాథ్ మోహన మూర్తి రవి చంద్ర లకు బహుకరించి మాట్లాడారు. అవాస్తవాలు కాకుండా సమాజాన్ని చైతన్య పరిచే సమాచారం అందించాలని సూచించారు. అధ్యక్షత వహించిన కళ పత్రిక సంపాదకుడు రఫీ పురస్కార గ్రహీతలు ను పరిచయం చేశారు వేదిక పై కుసుమ భోగరాజు రామ కృష్ణ తదితరులు పాల్గొనగా గాంధీ తులసీ రామ్ వ్యాఖ్యానం చేశారు. తొలుత ప్రముఖ గాయని ఆమని సహా గాయకులు సుభాష్ రాజన్ శ్రీ లక్ష్మీ తదితరులతో కలిసి విఖ్యాత గాయని ఏస్.జానకి జన్మ దిన సందర్భంలో ఆమె సినిమాలలో పాడిన పాటలు మధురం గా ఆలపించారు

ఐపీఎల్ మ్యాచ్..

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- అర్ధరాత్రి వరకు మెట్రో రైలు సేవలు
- రేపు సన్‌రైజర్స్ హైదరాబాద్, బెంగళూర్ జట్ల మధ్య మ్యాచ్







నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని ఉప్పల్ స్టేడియం వేదికగా గురువారం సాయంత్రం సన్ రైజర్స్ హైదరాబాద్- బెంగళూర్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో క్రికెట్ ప్రియులను దృష్టిలో ఉంచుకొని టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియంకు 60 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు టీఎస్ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రికెట్ అభిమానులు వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక బస్సులు గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11:30 గంటలకు అందుబాటులో ఉంటాయని, నగరంలోని 24 డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆయన వివరించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ మ్యాచ్ అనంతరం క్రికెట్ వీక్షకులు తమ తమ గమ్యస్థానాలకు సులువుగా చేరేందుకుగాను స్టేడియం వద్ద కంటోన్మెంట్, ఇబ్రహీంపట్నం, ముషిరాబాద్‌కు చెందిన డిపో మేనేజర్లను ఇన్‌చార్జిలుగా నియమించారు. ఇతర ఎదైనా సమాచారం కోసం కోఠి, రైతిఫైల్‌లో ప్రత్యేక సహాయ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు.

మెట్రో అదనపు సర్వీసులు..

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ను దృష్టిలో పెట్టుకుని మెట్రోరైళ్లను ఆరోజు అర్ధరాత్రి వరకు నడపనున్నారు. రాత్రి 7.30 గంటలకు మొదలయ్యే మ్యాచ్‌ను చూసేందుకు మధ్యాహ్నం నుంచే క్రికెట్ అభిమానులు స్టేడియంకు చేరుకునే అవకాశం ఉంది. అదేవిధంగా మధ్యాహ్నం 3.30గంటల నుంచే ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతి ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పల్ మార్గంలో మెట్రో రైలు సమయం పొడిగించామని, రైళ్లు నిర్ణీత సమయానికి మించి నడుస్తాయని మెట్రో ఎండీ ఎన్వీఎస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగోల్, ఉప్పల్ స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్లలో చివరి రైళ్లు రాత్రి 12:15 గంటలకు బయలుదేరి 1:10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయని ఆయన చెప్పారు.

స్కూబా డైవింగ్ ప్రత్యేకతతో అతి పెద్ద ఆక్వా టన్నెల్ ఎగ్జిబిషన్





నవతెలంగాణ - కూకట్ పల్లి

వేసవి సెలవులలో మీ చిన్నారులతో పాటు మిమ్మల్ని అలరించేందుకు సిద్ధంగా ఉంది కూకట్ పల్లి మెట్రో ట్రాక్ పార్కింగ్ గ్రౌండ్‌లో అతిపెద్ద ఎక్వటన్నల్ ఎగ్జిబిషన్ . స్కూబా డైవింగ్ ల ప్రత్యేకతతో నగరవాసులు కోసం కూకట్ పల్లి మెట్రో వై జంక్షన్ హుడా ట్రక్ పార్కింగ్ గ్రౌండ్‌లో, అతి పెద్ద ఫెరానా చాప ముక ద్వారంతో స్వాగతం పలుకుతూ ప్రారంభించారు. ముఖ్యంగా భారతదేశంలోనే అతి పెద్ద ఎక్వటన్నల్ లో 600ల రకాల చేపలతో ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు రాజశేఖర్ రెడ్డి తెలిపారు ఆయన మాట్లాడుతూ. మొట్ట మొదటిసారిగా దేశంలో స్కూబా డైవింగ్ ప్రదర్శనకు ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఈ స్కూబా డైవింగ్ విదేశాలలో, అది కూడా సముద్రంలో జరిగే ఈ విన్యాస ప్రదర్శన, దేశంలో మొదటి సారిగా కూకట్‌పల్లి ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీన్ని ప్రత్యేకంగా భూమిపై ఈ కళను ప్రదర్శించే విధంగా ప్రత్యేక ఎక్వటన్నల్‌ను తయారు చేయించారు. స్కూబా డైవింగ్‌లో ఆరితేరిన వారు ప్రదర్శనలో పాల్గొని కనువిందు చేయనున్నారు. అంతే కాకుండా ఇందులో అన్ని రాష్ట్రాలకు చెందిన హాండిక్రాఫ్ట్, పర్నిచర్, ఇమిటేషన్ జ్యువెల్లరి, రాజస్థాన్ క్రాఫ్ట్, ఫుడ్ కోర్టు, చాట్ బండార్, వంటి 300 స్టాల్స్ ఇందులో ప్రత్యేకత. కుటుంబ సమేతంగా ఆనందించేందుకు ఇటాలియన్ పార్క్, చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ఇందులో ఆనందించే విధంగా ఏర్పాటు చేశారు. కాబట్టి సెలవు రోజుల్లో కుటుంబంతో పాటు ఎంజాయ్ చేసేందుకు ఈ ఎగ్జిబిషన్ వేదిక బాగుంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా హనుమాన్ జయంతి శోభయాత్ర

- ముఖ్య అతిథిగా హాజరైన

కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్



నవతెలంగాణ - బాలానగర్

హనుమాన్ జయంతి సందర్భంగా కూకట్ పల్లి సర్కిల్ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ హస్మత్ పేట ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో యువజన సంఘం వారి ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓల్డ్ బోయిన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ హాజరై లాలి నిధి నృత్య అకాడమీ వారు నిర్వహించిన చిన్నపిల్లలు చేసిన నృత్యాలను తిలకించి వారికి షీల్డ్ లు అందజేశారు. అనంతరం శ్రీ ఆంజనేయ యువజన సంఘం సభ్యులు మామిడి మృత్యుం జయ మూర్తి, రాజా గౌడ్, అజయ్ కుమార్, రుద్ర ప్రతాప్, మోహన్, ఎం శ్రీనివాస్, వేద రాజన్, నరేందర్ తదితరులు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించి షీల్డ్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గడ్డం నర్సింగ్ రావు, మన్య ఉదయ్, యాదవ్ బుర్రి, యాదగిరి, మట్టి శ్రీనివాస్, రాజు గౌడ్, శేఖర్ గౌడ్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డా.కారుమంచి నిర్మల సంతాప సభ




నవతెలంగాణ-సిటీబ్యూరో

వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల హిందీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.కారుమంచి నిర్మలకు శ్రద్ధాంజలి ఘటిస్తూ, సంతాప సభ నిర్వహించారు. డాక్టర్ కారుమంచి నిర్మల గుండె పోటు కారణంగా 20.04.2022 నాడు అర్ధరాత్రి నాగోల్ లోని సుప్రజ హాస్పిటల్ లో ఐ.సి.యు.లో చేరారు. చికిత్స పొందుతున్న క్రమంలో వెంటిలేటర్ మీద పోరాడుతూ పరిస్థితి విషమించి సోమవారం సాయంత్రం 7 గంటలకు ఆమె తుది శ్వాస విడిచినట్టు హాస్పిటల్ వర్గాలు ప్రకటించాయి. అందరితో కలివిడిగా ఉంటూ ఎప్పుడూ సంతోషంగా అందరినీ పలకరించే కె.నిర్మల తమ మధ్య నుండి హఠాత్తుగా లేకుండా పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని కళాశాల స్టాఫ్ క్లబ్ సెక్రటరీ ఎస్.రవి ప్రసాద్‌తో పాటు పలువురు అధ్యాపకులు తమ సంతా పాన్ని ప్రకటించారు. అధ్యాపకులు మాట్లాడుతూ డా.కె. నిర్మల వారి పిల్లల చిన్నతనంలోనే భర్త చనిపోవడంతో ఉద్యోగం సాధించి, జీవితంలో ఎన్నో ఒడిదుడు కులను ఎదుర్కొని, పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దారన్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఆప్యాయంగా పలుకరిం చేవారని, అకస్మాత్తుగా దూరమవ్వడాన్ని జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ, అందరూ 2 నిమిషాలు మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యులకు ఆత్మ స్థైర్యం కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య, వైఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా అబ్రహం, అధ్యాపకులు ఎ.తిరుపతి, పి.వెంకట్ ఈశ్వర్, డా.జె.చిన్నబాబు, ఎ.కవిత, డా.కిశోర్ కుమార్, కరుణాకర్, కృష్ణ కుమార్ మొదలుకొని అధ్యాపకులందరూ పాల్గొన్నారు. సీతాఫల్ మండి డిగ్రీ కళాశాల అధ్యాపకులు కూడ సభలో పాల్గొని తమ సంతాపాన్ని ప్రకటించారు.

నవతెలంగాణ
12
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
బుధవారం | ఏప్రిల్ 24, 2024 | www.navatelangana.com

రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు తరలిరండి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నామినేషన్ వేయనున్నారనిఎమ్మెల్యే మాధవరం కష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కావున కావున బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బస్తి కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బుధవారం ఉదయం 9 గంటల వరకు శామీర్ పేట రోడ్డు లోని, తూముకుంట మైసమ్మ ఆలయం కలెక్టరేట్ రోడ్డు చౌరస్తా వద్దకు అందరూ చేరుకోవాలని తెలిపారు.

కాసాని నామినేషన్‌లో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, సబితా ఇంద్ర రెడ్డి , ప్రకాష్ గౌడ్ ,కాలే యాదయ్య , మాజీ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్ రెడ్డి, మెతుకు ఆనంద్, మహేష్ రెడ్డి, శేర్లింగంపల్లి కార్పొరేటర్లు పాల్గొన్నారు. మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, పార్టీ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, గొట్టిముక్కల పెద్ద భాస్కరరావు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డ్ మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, బస్తి కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేయోభిలాషులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద తదితరులు పాల్గొన్నారు.



నేర్చుకోవాలి.. ఉపాధిగా మార్చుకోవాలి..

- ఎస్.పి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత ఉపాధి శిక్షణను నేర్చుకోవాలని.. ఉపాధిగా మార్చుకోవాలని..ఎస్.పి.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్,టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి పేర్కొన్నారు. ఎస్.పి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్‌లోని చిత్తరమ్మదేవి నగర్‌లో ఎస్.పి.ఆర్ గ్లోబల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.పి.ఆర్.ట్రస్టును స్థాపించికొంత కాలంగా సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు పేద విద్యార్థులకు,పేదలకు నిరాధారణ గురైన వృద్ధులకు,అనాథాలకు,అభాగ్యులకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తున్నట్టు తెలిపారు. ఇదే కాకుండా ట్రస్ట్ నేతత్వంలో ప్రస్తుతం పేద,మధ్యతరగతి వారికి ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ కోర్స్‌తో పాటు కమ్యూని కేషన్స్ స్కిల్స్‌లలో పలు రకాలుగా ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రస్తుత ఆధునిక సమాజంలో పోటీని ఎదుర్కొనే విధంగా సమాచార నైపుణ్యతను పెంపొందించుకోవడంతోపాటు ఉద్యోగ అవకాశాల వేటలో ఎంతగానో ఉపయోగపడే ఇంగ్లీష్ భాషపై పట్టును సాధించి ఎదగాలని సూచించారు.భవిష్యత్తులో కూడా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తతం చేస్తానని స్పష్టం చేశారు.



మల్కాజిగిరిలో గెలిచేది బీఆర్‌ఎస్ పార్టీనే

- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద
- పలు ప్రాంతాల్లో అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మల్కాజిగిరి బరిలో గెలిచేది బీఆర్‌ఎస్ యేననిఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్ - 1,2,3,4, వెంకటేశ్వర కాలనీ ఈస్ట్ అండ్ వెస్ట్ కాలనీలలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేండ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలోని అన్ని నియోజకవర్గాలను ఎంతో అభివద్ధి చేసిందని తెలిపారు. కానీ మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి మాత్రం ఒక్క రూపాయి కూడా ఎక్కడ ఖర్చుపెట్టిన దాఖలాలు లేవన్నారు. ఇలాంటి వారికి పదవులు, రాజకీయాలు మాత్రమే అవసరమని ప్రజా సంక్షేమం కాదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కిషన్‌రావు, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, సమ్మయ నేత, గుమ్మడి మధుసూదన్ రాజు, జ్ఞానేశ్వర్, ఎల్లా గౌడ్, తోకల నాగేష్, ఇందిరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

ప్రజా శ్రేయస్సు కోసం పనిచేసే నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద అన్నారు. సూరారం డివిజన్ నెహ్రూ నగర్ నందు మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓట్ల కోసం రాజకీయాలు చేసే నాయకులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒకవైపు అయితే ప్రజా సంక్షేమ కోసం రాజకీయాలకతీతంగా ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మరొకవైపు అని అన్నారు. ప్రజా సేవ చేయడానికి రాజకీయాల్లోకి రావాలి కానీ పదవుల కోసం కాదన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిత్యం పనిచేసే నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డిని మే 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, ఉపాధ్యక్షులు అఖిల్, సీనియర్ నాయకులు ఫెరోజ్, ప్రశాంత్, కిరణ్, దశరథ్, జలీల్ మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి, అరుణ, ధనలక్ష్మి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట : ఆరు గ్యారెంటీ ల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ మనుగడ సాధించలేదని, ప్రజల విశ్వాసం కోల్పోతున్నదని ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సంజయ్ పురి కాలనీలో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్ తోనే సాధ్యమన్నారు. ఇప్పటికే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని దాదాపు అన్ని నియోజకవర్గ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారేనని,ఎంపీ కూడా బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఉన్నట్టయితే గణనీయమైన అభివద్ధి జరుగుతుందన్నారు.మే 13న జరిగే ఎన్నికల్లో రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించడానికి కారు గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లగోపుల బాబుగౌడ్,యూత్ నాయకులు కొలుకుల జైహింద్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి మారయ్య,డివిజన్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిరా గౌడ్, సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, అప్పల శ్రీను, పాపులుగౌడ్, రాములు, మల్లారెడ్డి, నర్సింగ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.





మద్యం సీసాలు స్వాధీనం

నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్ పల్లి మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో బెల్టు షాపు నిర్వహిస్తున్న తులసీరామ్ అనే వ్యక్తి నుంచి కూకట్ పల్లి పోలీసులు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అందులో 24 క్వార్టర్ సీసాలు, 10 బీర్ సీసాలు ఉన్నాయి. అదేవిధంగా కూకట్‌పల్లి భాగ్ అమీర్ లో నివాసం ఉండే మధుసూదన్ గౌడ్ వద్ద నుంచి 46 లీటర్ల కల్లు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఎన్నికల తనిఖీల్లో భాగంగా వై జంక్షన్ లో ఓ వ్యక్తి నుంచి రూ. ఒక లక్ష ఐదు వేలు నగదు లభించడంతో కూకట్ పల్లి పోలీసులు సీజ్ చేశారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత





నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న పలు అక్రమ నిర్మాణలు, షెడ్‌లను ఎట్టకేలకు మంగళవారం మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చి వేశారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన పలు అక్రమ నిర్మాణాలను గండి మైసమ్మ పరిధిలో, గాగిల్లాపూర్ , సారేగూడెం లో గుర్తించిన అధికారులు.. మున్సిపాలిటీ రూల్స్ ప్రకారం నోటీసులు జరిచేసారు. అయినా నిర్మాణాలు ఆపకపోవటంతో మున్సిపల్ కమిషనర్ కల్వకుంట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో టీపీవో అధికారి సంజన కూల్చివేతలు చేపట్టారు. అయితే కొన్ని నిర్మాణాల పైన మాత్రమే చర్యలు తీసుకుంటున్నారని, రూ. లక్షల్లో మునిసిపాలిటీ ఆదాయానికి గండి కొట్టే బడా సంస్థలపై అధికారుల ఎందుకు ఉదాసీనత గా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి దశల వారీగా అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాలనీ వాసులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి కార్పొరేటర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, డ్రయినేజీ, మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డివిజన్ పరిధిలో మంజూరైన అభివద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ... త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సుధాకర్, నాగేష్, వేణు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



నవతెలంగాణ - కూకట్ పల్లి

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ అసోసియేషన్ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ సమస్యల గురించి చర్చించారు. అదేవిధంగా కాలనీలోని నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో ఉన్న డ్రయినేజీ, సీసీ రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ సభ్యులందరూ కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకష్ణ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ సయ్యద్ ఇంత్యాజ్, ధనుంజయ్, వరలక్ష్మి, భాస్కర్, యాదగిరి, సంగమేష్, మోజెస్, మహేష్, రవి.సురేష్, మురళి, వెంకటేశం, మహబూబ్, నగేష్, కృష్ణయ్య, రాజు, మస్తాన్ వలీ, కృష్ణ, సయ్యద్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తా

- కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తానని కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేపీహెచ్ బీ కాలనీ గాంధీ విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించారు. ఆమెతో పాటు కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు, కార్యకర్తలు కలిసి రోడ్ నెంబర్ 1 నుండి 4 వరకు గల్లి గల్లి తిరుగుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. మల్కా జిగిరి ప్రజలు తనకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తు న్నారన్నారు. బండి రమేష్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పార్లమెంటు ఎన్నికల తర్వాత వెంటనే ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ అభివద్ధి కార్యక్రమాలు ప్రతీ ఇంటికి తీసుకెళుతున్నామన్నారు. ప్రజల్లో పార్టీ పట్ల సానుకూల ఏర్పడుతుందని గెలుపు సుసాధ్యమవుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ రెడ్డి, విజయ రెడ్డి, టిపిసిసి కార్యదర్శి సత్యం శ్రీ రంగం, తూము వేణు, సతీష్ రెడ్డి, కృష్ణ రాజ్ పుత్, సాధు ప్రతాప్ రెడ్డి, మోయిజ్, మైకేల్, ఫణి కుమార్, అప్పారావు, అరవింద్ రెడ్డి, నయీమ్ ,రేష్మ, సంధ్య, మారుతి, వనజ, నాగమణి, వాణి పాల్గొన్నారు



అర్బన్ కార్యదర్శికి వడ్డేపల్లి శుభాకాంక్షలు

నవతెలంగాణ - కూకట్‌పల్లి

వివేకానంద నగర్ డివిజన్‌లోని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు నివాసంలో, నూతనంగా బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శిగా ఎన్నికైన స్రవంతిని మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదువులు పొందాలన్నారు. స్టేట్ కౌన్సిల్ మెంబర్ సురేందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, జిల్లా కో కన్వీనర్ పద్మయ్య అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక



నవతెలంగాణ-కూకట్ పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక మంగళవారం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా మురళీ కష్ణ మోహన్,, లింగారెడ్డి , రఘుపతి రావు, ప్రధాన కార్యదర్శిగా స్వరూప , నిర్వహక కార్యదర్శిగా హన్మంతరావు , కోశాధికారిగా శ్రీనివాస్ రావు, సంయుక్త కార్యదర్శిగా చంద్రశేఖర్ , శ్రీధర్, కిషోర్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్రెడ్డి, చిన్న కొండయ్య, హన్మంతరావు, శ్రీధర్, శ్యామల రావు, వినోద్ , రామకోటేశ్వర్‌రావు, లావణ్య, గోపాల్‌లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పై నమ్మకం ఉంచి మమ్మల్ని ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. నూతన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో, కాలనీ అభివద్ధికి పాటుపడతామని నూతన కార్యవర్గ అధ్యక్షులు సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన సంఘ ప్రతినిధులను కాలనీ వాసులు అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ గ్రామం టీడీపీ మాజీ అధక్షులు, మాజీ ఉప సర్పంచ్ కొలన్ జనార్ధన్ రెడ్డి, బీఆర్‌ఎస్ కోఆప్షన్ మెంబర్ తలారి వీరేష్, నిజాంపేట్ మాజీ వార్డ్ మెంబర్ తులసి అశోక్ తదితర మిత్రబృందం 50 మంది కాంగ్రెస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి , ఎస్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, ఎస్ఎంసి వర్కింగ్ ప్రెసిడెంట్ బేకుల ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణ తిరుపతిలో వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 131 - కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మా నగర్ ఫేస్ 1 నందు మంగళవారం నిర్వహిస్తున్న శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి షోడశ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేఎం.గౌరిష్, ఆలయ కమిటీ వినోద్ కుమార్, సత్తిరెడ్డి, ముత్యాలు, విజయ్, గురుబ్రహ్మం, బ్రహ్మం, శంకరయ్య, రంగసుబ్బయ్య, సుధాకర్, కృష్ణ, నాయకులు కిషోర్ చారి,రమణారెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటేష్, అజయ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహిళా దారుణ హత్య

నవతెలంగాణ-దుండిగల్

క్యాటరింగ్ విధుల్లో భాగంగా పనిచేసేందుకు వెళ్లిన మహిళ కనిపించకపోగా నిర్మానుష్య ప్రదేశం సంపులో హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ డి పోచంపల్లి పరిధి సర్వే నెంబర్ 120 లో నివసించే ముడావత్ సక్కుబాయి (45) తన కుమారునితో నివసిస్తూ క్యాటరింగ్ లేబర్ పని నిర్వహిస్తున్నది. ఈ నెల 20 వ తేదీన సాయంత్రం కుమారుడు శేఖర్ తన తల్లి సక్కుబాయిని క్యాటరింగ్ వృత్తి విధుల్లో భాగంగా గండి మైసమ్మ నుచి తీసుకువెళ్లి బహదూర్ పల్లి వద్ద వదిలి వచ్చాడు. మరిసటి రోజు సక్కుబాయి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుమారుడు శేఖర్.. తల్లి ఆచూకీ కోసం వెతికాడు. అయినా ఫలితం లేకపోవడంతో దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారించగా బహదూర్ పల్లి సతీష్ సొసైటీలోని ఒక సంపులో మహిళ హత్యకు గురైందని తెలిసింది. సంఘటన స్థలానికి వెళ్లి మహిళ మృతదేహాన్ని వెంటనే పోస్టుమార్టానికి పంపించి విచారణ చేపట్టినట్టు, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సీఐ తెలిపారు. పూర్తి ఆధారాలు ఇంకా తెలియవలసి ఉందని చెప్పారు.

ఘనంగా 'హనుమాన్ విజయోత్సవం'



నవతెలంగాణ - జగద్గిరిగుట్ట/కుత్బుల్లాపూర్

హనుమాన్ విజయోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట, రంగారెడ్డి నగర్ డివిజన్ వెంకట్రామిరెడ్డి నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ నందు నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రంగారెడ్డి నగర్ డివిజన్ వెంకట్రామిరెడ్డి నగర్ నందు పలు కాలనీలకు చెందిన యువత (గాంధీనగర్, వెంకటరామిరెడ్డి నగర్, నందనగర్, మారుతి నగర్, విజయనగర్ కాలనీ) ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ విజయోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కార్పొరేటర్లు కొలుకుల జగన్ ముఖ్య అతిథులుగా హాజరై ర్యాలిని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జల్దా లక్ష్మీనాథ్, సంక్షేమ సంఘం సభ్యులు కార్తీక్ గౌడ్, బాలు నేత, అంజి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ డివిజన్ ఎన్టీఆర్ నగర్ నందు నిర్వహించిన హనుమాన్ విజయోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తిరెడ్డి, కిషోర్ చారి,స్థానిక నాయకులు శివా రెడ్డి, నాగేష్, రాజు, ముని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్టలో నిర్వహించిన హనుమాన్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విజయోత్సవ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్ కొలుకుల జగన్,శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మెన్ వేణు యాదవ్,యూత్ నాయకులు కొలుకుల జైహింద్,డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్,వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు ఎత్తారి మారయ్య,మనోజ్, వేణు, గిరి, గణేష్ ,సంతోష్, ప్రభాకర్,రాజు,విగ్నేష్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






గాజులరామారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి స్థానిక కార్పొరేటర్ గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం శోభ యాత్ర ర్యాలీలను ప్రారంభించారు.డివిజన్ పరిధి ఉమాదేవి నగర్ ప్రాంతంలో స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో కమిటీ సభ్యులు కే.కరుణాకర్ రాజు పి.సమ్మయ్య యాదవ్, స్.కష్ణమూర్తి గుప్త,పి. రాముల గౌడ్,ఎం.అశోక్ చారి,కే.శ్రీ రామరాజు శ్రీనివాస్ యాదవ్ యూత్ సభ్యులు క్రాంతి బస్తి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కుత్బుల్లాపూర్ : దేవేందర్ నగర్, శ్రీనివాస్ నగర్,ఎన్.టి.ఆర్ నగర్,ఐ.డి.పి.ఎల్ గుడెన్ మెట్ ,ద్వారకా నగర్,సుదర్శన్ రెడ్డి నగర్, పద్మా నగర్ లో ఆంజనేయ స్వామి ఆలయాలలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారిని దర్శించుకున్నారు. తదుపరి అన్నదాన కార్యక్రమాలలో, హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ శోభయాత్రలో పాల్గొన్నారు. వెంకటేశ్వర రెడ్డి, వెంకట్ రెడ్డి, నార్లకంటి ప్రతాప్, సాయిలు, కూన శ్రావణ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి,శ్రవణ్,దత్తు, శివ, శ్యామ్,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ జయంతి సందర్భంగా, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు కూకట్ పల్లి లోని హనుమాన్ టెంపుల్ లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పి. బాబు రావు, తూము శ్రావణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ - కూకట్ పల్లి



మూసాపేట్ గూడ్స్ షెడ్ రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు, ఎర్రగడ్డ ఆంజనేయ స్వామి దేవాల యాల్లో స్వామి వారిని మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బబ్బుగూడ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రధాన కార్యదర్శి తిరుపతి, శ్రీనివాస్, అంజి, రాజిరెడ్డి, సుందర్ తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ - కూకట్ పల్లి



హనుమాన్ జయంతితో పాటు మాజీ సర్పంచ్, కార్పొరేటర్ కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి పెండ్లి రోజు సందర్భంగా అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవతెలంగాణ-దుండిగల్

మనకంటూ ఓ పునాది ఉండాలి



సివిల్స్‌లో సెలక్ట్ కావాలంటే ఊపిరాడకుండా చదవాలి... క్షణం కూడా వేస్ట్ చేయకూడదు. అన్నీ పక్కన పెట్టి ఇదే ప్రపంచంగా భావించాలి. సివిల్స్ ప్రిపరేషన్‌కు రాక ముందు సాధారణంగా చాలా మంది ఇలాగే అనుకుంటారు. కానీ జాబ్ చేస్తూ కూడా గ్రూప్స్‌లో విజయం సాధించవచ్చు అని రుజువు చేసింది మన తెలుగమ్మాయి మోనిక అడుసుమిల్లి. మూడుసార్లు విఫలమైనా కుంగిపోలేదు. పట్టుదలతో ప్రయత్నించింది. పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూనే 487వ ర్యాంక్ సాధించిన ఆమె పరిచయం నేటి మానవిలో...

మా అమ్మ సునీత, హౌజ్ వైఫ్. నాన్న వెంకట ప్రేమ్ చంద్, సొంత రెస్టారెంట్ వుంది. అమ్మానాన్నలకు నేనొక్కదాన్నే. ప్రస్తుతం మేము రాజమండ్రిలో ఉంటున్నాం. మా సొంతూరు విజయవాడ. పదో తరగతి వరకు అక్కడే మిషనరీ కాన్వెంట్‌లో చదువుకున్నాను. ఇంటర్ శ్రీచైతన్య కాలేజీలో పూర్తి చేశాను. తర్వాత హైదరాబాద్ బిట్స్ పిలానీలో ఇంజనీరింగ్ చేశాను. అది పూర్తి చేసిన వెంటనే జాబ్ వచ్చింది. మూడున్నరేండ్లు న్యూటానిక్స్ కంపెనీలో జాబ్ చేశాను. ప్రస్తుతం మైక్రోసాఫ్ట్‌లో చేస్తున్నాను. జాబ్ చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాను.

జాబ్ చేస్తూనే సివిల్స్...

కాలేజీ రోజుల నుండే సమాజానికి సేవ చేయాలనే ఆలోచన ఉండేది. కార్పొరేట్ జాబ్‌లో ఉంటే సేవా కార్యక్రమాలు చేసే అవకాశం చాలా తక్కువ. చాలా పరిమితులు ఉంటాయి. వర్క్ టెన్షన్ ఉంటుంది. అదే సివిల్స్ అయితే మన జాబ్ సక్రమంగా చేస్తే చాలు, సమాజానికి సేవ చేసిన వాళ్ళం అవుతామనే ఆలోచన ఉండేది. అందుకే జాబ్ చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేరయ్యాను. గతంలో మూడు సార్లు పరీక్షలు రాస్తే నాలుగో సారి సెలక్ట్ అయ్యాను. 487 ర్యాంక్ వచ్చింది. 2020లో మొదటి సారి పరీక్షలు రాశాను. ఇంటర్వ్యూకు వెళ్ళడం ఇదే మొదటి సారి. నాలుగో సారి పరీక్షలు రాసినప్పుడు ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు.



నా జాబే నాకు ధైర్యం

2019లో బెంగుళూరులో ఓ కోచింగ్ సెంటర్‌లో చేరి కొన్ని నెలలు వీకెండ్స్‌లో క్లాసులకు వెళ్ళాను. తర్వాత కోవిడ్ వల్ల ఇంట్లోనే ఉంటూ ప్రిపేర్ అయ్యాను. నాలుగు సార్లు పరీక్షలు రాశాను కాబట్టి ఆ అనుభవాలు నాకెంతో ఉపయోగపడ్డాయి. ఒకసారి చేసిన పొరపాట్లు మరోసారి చేయకుండా జాగ్రత్తలు తీసుకున్నాను. అలా నాలుగోసారి సెలక్ట్ అయ్యాను. మూడు సార్లు సెలక్ట్ కాకపోయినా ఎలాంటి బాధా కలగలేదు. ఎందుకంటే చేస్తున్న ఉద్యోగమే నాపై నాకు నమ్మకాన్ని ఇచ్చింది. చదువుకోడానికి కూడా టైం తక్కువ ఉండేది. అయినా జాబ్‌ని నేను ఎప్పుడూ భారంగా భావించలేదు. ఎందుకంటే జాబ్ నాకు ఓ ధైర్యాన్ని ఇచ్చింది. ఒక వేళ నేను సెలక్ట్ కాకపోతే నా పరిస్థితి ఏంటీ అని ఆందోళన పడాల్సిన పని లేదు. అందుకే నా జాబ్ అంటే నాకు చాలా ఇష్టం. 'నీకు నేనున్నాను' అనే ధైర్యాన్ని ఇస్తుంది. ఇప్పుడు నాకు వచ్చిన ర్యాంక్‌కి ఐఏఎస్, ఐపీఎస్‌లో రాదు. ఆడిట్స్, అకౌంట్స్, రైల్వేస్‌లో వచ్చే అవకాశం ఉంది.

చాలా నేర్చుకున్నాను

మన తెలుగు గురించి తెలుసుకోవాలనే ఉద్దేశంతో తెలుగు లిటరేచర్ ఆప్షనల్‌గా తీసుకున్నాను. మొదట్లో చాలా కష్టంగా ఉండేది. అప్పట్లో బెంగుళూరులో జాబ్ చేస్తున్నాను. తెలుగులో కోచింగ్ ఎవరు బాగా ఇస్తారు అని గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే హైదరాబాద్‌లో సత్యనారాయణ సార్ గురించి తెలిసింది. శంకరన్ ఐఏఎస్ అకాడమీ తరపున ఆన్‌లైన్ క్లాసులకు హాజరయ్యాను. కొన్ని రికార్డింగ్ క్లాసులు విని నోట్స్ రాసుకునేదాన్ని. తీసుకునేటప్పుడు చాలా ఆసక్తితో తీసుకున్నాను. కానీ మొదటి ఏడాది చాలా కష్టంగా అనిపించింది. చాలా టైం పట్టేది. రాయడం కూడా చాలా కష్టంగా ఉండేది. మెయిన్స్‌లో రెండు పేజీలు రాయడానికి ఏడు నిమిషాలే ఉంటుంది. ఇంగ్లీష్ అయితే కలిపిరైటింగ్ ఉంటుంది కాబట్టి స్పీడ్‌గా రాయొచ్చు. కానీ తెలుగులో ఆ పరిస్థితి లేదు. చాలా ఇబ్బందే అయ్యింది. ప్రాక్టిస్ చేస్తూ అలవాటు చేసుకున్నాను. వీడియోలు మళ్ళీ మళ్ళీ చూసి నేర్చుకున్నాను. శ్రీశ్రీ, గురజాడ గురించి చదువుతూ చాలా నేర్చుకున్నాను. 'సొంత లాభం కొంత మానుకో.. పొరుగు వారికి తోడుపడవోయ్' వంటివి చదివినప్పుడు సమాజం పట్ల మన బాధ్యత ఏమిటో తెలుసుకున్నాను.

నీకు నచ్చితే చెయ్యి అంటారు

ఇంట్లో వాళ్ళు ఎప్పుడూ నాకు సపోర్ట్ చేస్తారు. 'నీకు ఏది ఇష్టమో అదే చెయ్యి' అని ప్రోత్సహించారు. బిట్స్ పిలానీ అన్నా, జాబ్ అన్నా, సివిల్స్ అన్నా నీ ఇష్టం అన్నారు. ఇప్పటికీ నీ ఇష్టమైంది నువ్వు చెయ్యి అంటున్నారు. 25 ఏండ్లు వచ్చాయి పెండ్లి చేసుకో అంటూ ఇప్పటి వరకు ఎప్పుడూ నన్ను ఇబ్బంది పెట్టలేదు. సమాజానికి మంచి జరుగుతుంది అనుకుంటే కచ్చితంగా నీకు నచ్చింది చెయ్యి అనే అంటారు. అమ్మాయిలకు సాధారణంగా చాలా ఇబ్బందులు, అడ్డంకులు ఉంటాయి. అలాంటివి ఏవీ నాకు ఎదురు కాలేదు. సెలక్ట్ అయినా, కాకపోయినా ట్రై చెయ్యి అన్నారు. అయ్యో ట్రై చేయలేదే అనే ఫీలింగ్ ఉండకూడదు అని ప్రోత్సహించారు.

మన పని మనం టైంకి చేస్తే...

ఏ సర్వీస్‌కి అయినా దాని ప్రత్యేకత దానికి ఉంటుంది. నాకు ఏ పోస్ట్ వచ్చినా దాని నుండి సమాజానికి నా వంతుగా ఏం చేయగలను అనే ఆలోచిస్తాను. ఎప్పటి పని అప్పుడు చేయడం అనేది



నేను నేర్చుకున్న పాఠం. మన పని మనం టైంకి చేస్తే సమాజంలో చాలా పనులు వాయిదా పడకుండా జరిగిపోతాయి. కార్పొరేట్ ఉద్యోగమైనా, ప్రభుత్వ ఉద్యోగమైనా ఏ రోజుకారోజు నా ప్రయత్నం వంద శాతం ఇవ్వాలి. ఇంటర్వ్యూలో 'ఇప్పుడు నీకు లక్షల జీతం వస్తుంటే ఇటు ఎందుకు వస్తున్నావు' అని అడిగారు. చేయాల్సింది మాత్రం ఇంకా చాలా ఉంది.

ప్లానింగ్ చాలా అవసరం

నాకున్న అనుభవంలో సివిల్స్‌కు ప్రిపేర్ కావడమంటే గొప్ప విషయం. అయితే దీనికి ప్రిపేర్ అవుతూనే మనకంటూ వెనక ఓ పునాది వుండాలి. ప్లాన్ ఎ, ప్లాన్ బి రెండూ ఉండాలి. ఒక దానిపైనే ఆధారపడి ఉండొద్దు. ముఖ్యంగా సివిల్స్‌లో ప్లానింగ్ చాలా అవసరం. రెండు ప్లాన్లు ఉంటే మనకు చాలా ధైర్యంగా ఉంటుంది. మధ్యలో చాలా డౌట్స్ వస్తాయి. 'ఎప్పటికైనా క్వాలిఫై కాగలమా, ఇంటర్వ్యూ వరకు వెళ్ళగలమా' అనే అనుమానాలు కచ్చితంగా వస్తాయి. అలాంటి వన్నీ పక్కన పెట్టి మనం చేయాల్సిన పని చేస్తుంటే కచ్చితంగా విజయం సాధించగలం అనిపించింది.

- సలీమ

మట్టికుండ నీరు..



వేసవిలో చల్లని నీటికి ఆవాసంగా ఉండడంతో పాటు బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది మట్టి కుండ. ఒకప్పుడు మన ఇళ్లల్లో మట్టి పాత్రలను విరివిగా ఉపయోగించేవారు. ఇప్పుడు వాటి వినియోగం తగ్గింది. కానీ, వేసవిలో మాత్రం తాగునీటి కోసం కుండలను ఉపయోగిస్తున్నవారు ఇప్పటికీ ఉన్నారు. వేసవిలో కుండ నీరు చల్లగా అవటానికిగాను ఇళ్లల్లోనూ, చలివేంద్రాల వద్ద కింద ఇసుక పోసి, అందులో కుండ పెడతారు. దాని చుట్టూ గుడ్డ పెట్టి అప్పుడప్పుడూ తడుపుకుంటూ ఉంటే ఆ కుండలోని నీరు చల్లబడుతుంది. ఆ నీరు తాగితే ఆహ్లాదకరంగా ఉంటుంది.

ప్యూరిఫైడ్ నీటితో సమానం

కుండలో పోసిన నీళ్ల నూరు శాతం ప్యూరిఫైడ్ చేసిన నీటితో సమానమని నిపుణులు చెబుతున్నారు. ఈ నీటిని తాగటం వల్ల పలు అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. నీటిలో ఉండే మలినాలను పీల్చుకునే శక్తి కుండకు ఉంటుంది. మట్టి కుండల్లోని నీళ్ల సహజ మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ కోల్పోకుండా ఉంటాయి. పోషకాలు, ఖనిజ లవణాలు వృథా కాకుండా ఉంటాయి. కుండ నీటిలో సహజ సిద్ధమైన ఆల్కలీన్లు యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. శరీరంలోని టాక్సిన్లను బయటకు నెట్టేస్తాయి. శరీరంలోని పిహెచ్ విలువను స్థిరంగా ఉండటంలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తాయి. ■

కవితను అరెస్ట్ చేయం అని ఎప్పుడూ చెప్పలేదు

ట్రయల్ కోర్టు ముందు ఈడీ వాదనలు

నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం మనీలాండరింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేయాలని తామెప్పుడూ చెప్పలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రౌస్ అవెన్యూ కోర్టుకు వెల్లడించింది. గతంలో సుప్రీంకోర్టులో కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై గతేడాది సెప్టెంబర్‌లో విచారణ సందర్భంగా ... తర్వాతి 10 రోజులు లేదా విచారణ తేదీ వరకు మాత్రమే ఆమెను సమన్లను పంపమని తాము చెప్పినట్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను ఎక్కడా ఉల్లంఘించలేదని స్పష్టత ఇచ్చింది. ఈడీ కేసులో కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం మరోసారి ట్రయల్ కోర్టు ముందు వాదనలు జరిగాయి. కవిత తరపున సీనియర్ న్యాయవాది నితీష్ రాణా, మోహిత్ రావులు, ఈడీ తరపున జోహెబ్ హుస్సేన్‌లు వాదనలు వినిపించారు. మహిళను సూర్యాస్తమయం తర్వాత అరెస్ట్ చేశారన్న పిటిషనర్ వాదనలపై జోహెబ్ హుస్సేన్ అభ్యంతరం తెలిపారు. కవిత సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌లో దర్యాప్తు సంస్థలు తన ఇంటికి వచ్చి విచారణ చేయాలని కోరినట్టు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అంతేకానీ అరెస్ట్ చేయవద్దని ఎక్కడా కోరలేదని వాదించారు. అరెస్ట్ విషయంలో సుప్రీంకోర్టు కూడా కవితకు అనుకూలంగా ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. అయితే కవిత అరెస్ట్ తర్వాత నాలుగు రోజులకు అంటే మార్చి 19న సుప్రీంకోర్టులో మరోసారి ఈ పిటిషన్ విచారణకు వచ్చిందన్నారు. అయితే పిటిషనర్ తరపు న్యాయవాది సుప్రీం ఆదేశాలను ఈడీ ఉల్లంఘించిందని, కవితను అక్రమంగా అరెస్ట్ వాదించలేదన్నారు. ఎలాంటి అంశాలు లేవనెత్తకుండా 'ఒన్లీ పిటిషన్ విత్ డ్రా' చేసుకుంటున్నట్టు కోర్టుకు తెలిపారన్నారు. దీన్ని బట్టి చూస్తే, కవితది అక్రమ అరెస్ట్ కాదని వారు అంగీకరించినట్టే అభిప్రాయపడాల్సి ఉంటుందన్నారు.

ఈడీకి ఎలాంటి పరిధి ఉండదు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జాతీయ దర్యాప్తు సంస్థ అని, ఈ సంస్థకు ఎలాంటి పరిధి ఉండదని ఈడీ తరపు న్యాయవాదులు వాదనలు కొనసాగించారు. మనీలాండరింగ్ నిరోధించేందుకు ప్రత్యేక చట్టం ఉందని, ఈడీ జాతీయ దర్యాప్తు అథారిటీ అని తెలిపారు. రాష్ట్ర పోలీసులకు మాత్రమే పరిధులు ఉంటాయని, వారు ట్రాన్సిట్ ఆర్డర్ తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతేకానీ ఈడీ అరెస్ట్ చేసిన నిందితులను రాష్ట్రాల పరిధి దాటించడానికి ఎలాంటి ట్రాన్సిట్ ఆర్డర్ అవసరం లేదన్నారు. ఒకవేళ మహిళను సూర్యాస్తమయం తర్వాత అరెస్ట్ చేస్తే.. స్థానిక మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచాల్సి ఉంటుందని తెలిపారు. అయితే కేవలం '24 హవర్స్ రూల్' మాత్రమే ఈడీకి వర్తిస్తుందని, ఈ నిబంధన ప్రకారం కవితను అరెస్ట్ చేసిన 24 గంటల్లో కోర్టులో హాజరుపరిచినట్టు వాదనలు కొనసాగించారు. ఈ అన్నీ నిబంధనలకనుగుణంగానే కవితను అరెస్ట్ చేశామన్నారు. హైదరాబాద్‌లో మార్చి 15న సాయంత్రం 6.26 గంటలకు కవితను అరెస్ట్ చేసినప్పుడు సూర్యాస్తమయం అయినట్టు జియోగ్రాఫికల్ డేటా(అక్షాంశాలు, రేఖాంశాల) ద్వారా వివరించారు. కానీ ఆమెను సాయంత్రం 5:20 గంటలకు అరెస్ట్ చేసినట్టు కోర్టుకు తెలిపారు. అరెస్ట్‌కు ముందు దాదాపు 20 నిమిషాలు కవిత అరెస్ట్ కాపీ చదివి, సంతకం చేసినట్టు వివరించారు. అంతేకానీ సూర్యాస్తమయం తర్వాత మహిళను అరెస్ట్ చేస్తే మెజిస్ట్రేట్ అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు.

అరుణ్ పిళ్లై కవితకు బినామీ

ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరుణ్ పిళ్లై కవితకు బినామీగా వ్యవహరించారని ఈడీ వాదనలు కొనసాగించింది. కవిత తరపున ప్రతినిధిగా మాత్రమే పిళ్లై వ్యవహరించారని ఆరోపించారు. లిక్కర్ కేసులో కవిత పాత్రపై అరుణ్ పిళ్లై స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు తెలిపారు. దినేశ్ అరోరా రూ. 100 కోట్ల వ్యవహారంపై విచారణ సందర్భంగా పలు విషయాలు వెల్లడించారన్నారు. బుచ్చిబాబు ఫోన్లోని నోట్స్‌లో లిక్కర్ స్కాం వ్యవహారంపై మరింత సమాచారం దొరికిందని వెల్లడించారు. తొలుత కవితకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చిన పిళ్లై..ఆ తర్వాత తన స్టేట్‌మెంట్లను వెనక్కి తీసుకుంటున్నట్టు చెప్పారన్నారు. అయితే ఈడీ వాదనలపై కవిత తరపు న్యాయవాది నితీశ్ రాణా అభ్యంతరం తెలిపారు. రిమాండ్ సమయంలో సెక్షన్ 50 స్టేట్‌మెంట్ వర్తించదని ఇటీవల హైకోర్టు ఆదేశాలిచ్చిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము దాఖలు చేసే రిజాయిండర్‌లో సమగ్ర వివరాలను పొందుపరుస్తామన్నారు. అయితే, నగదు లావాదేవీలు, మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టులు బెయిల్ నిరాకరించిన కేసులను ఈడీ న్యాయవాది హుస్సేన్ మెన్షన్ చేశారు. నగదు లావాదేవీలు, కుట్ర ఈ రెండు అంశాలు లిక్కర్ కేసులో అరెస్టైన కవితకు వర్తిస్తాయన్నారు. కవిత బెయిల్ పిటిషన్ పై ఈడీ తరపున సుదీర్ఘ వాదనలున్నాయని కోర్టుకు తెలిపారు. ఈడీ వాదనలపై తాము కౌంటర్ వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని కవిత తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇరు పక్షాల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకొన్న స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా.. తదుపరి వాదనలను బుధవారం (నేడు) మధ్యాహ్నం 2 గంటలకు వింటామని వెల్లడించారు.

మీ వ్యాపార ప్రకటనల కన్నా పెద్దవా..!

(మొదటిపేజి తరువాయి)

ప్రశ్నించింది. తమ ఆయుర్వేద ఉత్పత్తుల గురించి అభ్యంతరకరమైన, తప్పుదోవ పట్టించేవిధంగా ప్రకటనలను ప్రచురించినందుకు సుప్రీంకోర్టు ధిక్కార చర్యను పతంజలి, బాబా రామ్‌దేవ్, అతని సహచరుడు ఆచార్య బాలకృష్ణ ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. తప్పుదోవ పట్టించే ప్రకటనలు నిలిపివేస్తామని గత ఏడాది నవంబర్‌లో సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీని కూడా ఉల్లంఘించారు. వారు సమర్పించిన అఫిడవిట్లపై కూడా సుప్రీంకోర్టు అసంతృప్తిగా ఉంది. గత విచారణలో వీరు ముగ్గురూ బహిరంగ క్షమాపణలు చెబుతామని కోర్టు తెలిపారు. దీని గురించి మంగళవారం విచారణలో వివరాలు వెల్లడిస్తూ దేశవ్యాప్తంగా 67 వార్తాపత్రికల్లో క్షమాపణలు ప్రచురితమయ్యాయని వారి తరుపున న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టుకు తెలిపారు. పది లక్షల రూపాయలు ఖర్చుయ్యాయని చెప్పారు. దీనికి జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ 'క్షమాపణలు చెబుతూ మీరు ఇచ్చిన ప్రకటనలు గతంలో ఇచ్చిన ఫ్రంట్ పేజీ ప్రకటనల కంటే పెద్దవా.. వాటి కంటే ఎక్కువ ఖర్చయిందా' అన్ని ప్రశ్నించింది. ప్రచురించిన క్షమాపణలు యొక్క 'బ్లో-అప్' కాపీలను చూడమని స్పష్టం చేసింది. 'క్షమాపణలు ప్రచురించిన వార్తపత్రికల వాస్తవ కాపీలను చూడాలనుకుంటున్నాం. ఏ పేజీలో ప్రచురించారు. ఎప్పుడు ప్రచురించారు అనే విషయాలను తెలుసుకోవాలనుకుంటున్నాం' అని తెలిపింది. ఈ వివరాలను సమర్పించేందుకు ఈ నెల 30 వరకూ న్యాయవాది రోహత్గీకి సమయం ఇచ్చింది. అలాగే మంగళవారం విచారణలో కేంద్రానికి ధర్మాసనం మొట్టికాయలు వేసింది. అభ్యంతరకరమైన ప్రకటనలపై చర్యలు తీసుకునే డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్ 1945లో రూల్ 170ను ఈ కేసులో విస్మరించడంపై కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నుంచి ధర్మాసనం వివరణ కోరింది. స్వతంత్ర నిపుణుల సంఘం ఈ రూల్ 170ను సిఫారుసు చేసినా, తరువాత కేంద్రం ఎలాంటి వివరణ లేకుండా ఈ రూల్‌ను తొలగించడంపై కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. 'వినియోగదారులను రక్షిస్తామని, అభ్యంతరకర ప్రకటనలపై చర్యలు తీసుకుంటామని మంత్రి పార్లమెంట్‌లో హామీ ఇస్తారు. ఈ కేసులో రూల్ 170ను తొలగించారు' అని తెలిపిన జస్టిస్ కోహ్లి ఈ విషయంపై కేంద్రాన్ని వివరణ కోరారు. అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గత రెండేళ్లలో ఆయుష్ మంత్రిత్వ శాఖ దృష్టికి 948 అభ్యంతరకర ప్రకటనలను తీసుకుని వెళ్లిందని, "దీనిపై మీరు ఎలాంటి తదుపరి చర్య తీసుకున్నారు?" జస్టిస్ కోహ్లి ప్రశ్నించారు. అలాగే ఈ కేసులో కన్స్యూమర్ అఫైర్స్, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖలను కూడా కోర్టు పార్టీలుగా చేర్చింది. ఈ కేసు తదుపరి విచారణను మే 7కి వాయిదా వేశారు.

కేజ్రీవాల్, కవితలకు కస్టడీ పొడిగింపు

(మొదటిపేజి తరువాయి)

పెరగడంతో కోర్టు ఆదేశాల మేరకు ఆయనకు సోమవారం సాయంత్రం స్వల్ప మోతాదులో వైద్యులు ఇన్సులిన్ ఇచ్చారు. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. హనుమాన్ జయంతి సందర్భంగా తమకు ఈ వార్త ఎంతో ఆనందం కలిగించిందని ప్రకటించింది. ఎయిమ్స్ వైద్యుల సూచన మేరకు కేజ్రీవాల్‌కు లో-డోస్ ఇన్సులిన్ రెండు యూనిట్లు ఇచ్చినట్టు తీహార్ జైలు అధికారులు వెల్లడించారు.

కరువు సహాయక నిధులపై నిర్లక్ష్యం

(మొదటిపేజి తరువాయి)

మోడీ కారణంగా కర్నాటకకు ఊరట లభించలేదన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలా మాట్లాడుతూ కర్నాటకకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. బీజేపీ ప్రతీకార రాజకీయాలు తెరపైకి వస్తున్నాయన్నారు. రూ.18,172 కోట్లు ఇవ్వకుండా కర్నాటక గడ్డపై అడుగుపెట్టే హక్కు బీజేపీ నేతలకు లేదన్నారు.

నేడే ఇంటర్ ఫలితాలు

(మొదటిపేజి తరువాయి)

అందుబాటులో ఉంటాయి. రాష్ట్రంలో ఫిబ్రవరి 28న ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. గతనెల 19 వరకు అవి జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,78,718 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,02,260 మంది కలిపి మొత్తం 9,80,978 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. గతనెల నాలుగో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాల్లో జరిగింది. బుధవారం ఫలితాలను విడుదల చేస్తున్నారు.

మాడు మండుతోంది

(మొదటిపేజి తరువాయి)

అవకాశముందనీ, పలు ప్రాంతాల్లో వడగాల్పులు వీచే ప్రమాదముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వడగాల్పులు వీచే సూచనలున్న జాబితాలో నల్లగొండ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలున్నాయి. వచ్చే వారం రోజుల్లో వడగాల్పుల తీవ్రత మరింత పెరిగే ప్రమాదముంది. బుధవారం నాడు అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశాలున్నాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు కొమ్రంభీమ్ అసిఫాబాద్, ఖమ్మం, నారాయణపేట, కామారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ఒకటెండ్రు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జీహెచ్ఎమ్‌సీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముంది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

టీక్యాతండా (నల్లగొండ)	45.1 డిగ్రీలు
భద్రాచలం(భద్రాద్రి కొత్తగూడెం)	44.9 డిగ్రీలు
ములుగు	44.5 డిగ్రీలు
వేములపల్లి(నల్లగొండ)	44.5 డిగ్రీలు
తిమ్మాపూర్(నల్లగొండ)	44.4 డిగ్రీలు

మోడీనా.. మతోన్మాదా..!

(మొదటిపేజి తరువాయి)

బృందా కరత్ చెప్పారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ పాత్ర పూర్తిగా దిగ్భ్రాంతి కలిగించేలా ఉన్నదని అంటూ ప్రధానిపై చర్య తీసుకోకపోతే దాని విశ్వసనీయత ఏముంటు ందని ప్రశ్నించారు. భారత్ వంటి లౌకికదేశానికి నాయకుడైన ప్రధాని అలా ప్రసంగించడం ఊహించలేదని వ్యాఖ్యానించారు. 'ప్రధాని నుంచి వచ్చింది దిగ్భ్రాంతికరమైన ప్రకటనే. భారత్ వంటి లౌకిక దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాన మంత్రి నుంచి అలాంటి మాటలు రావడం అనూహ్యం. నిర్మొహమాటంగా చెప్పాలంటే ఆయన ఓ మతోన్మాదిలా మాట్లాడారు. ఆయన భారత ప్రధాని పదవికి అనర్హుడు. ఈ ఎన్నికలలో అలాంటి భాషను ఉపయోగించడం విద్వేష ప్రసంగమే అవుతుంది' అని బృందా కరత్ చెప్పారు. మోడీ ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకొన్నార ని, ఎన్నికల సీజన్‌లో ఓట్లను సమీకరించేందుకు విద్వేష ప్రసంగం చేస్తున్నారని ఆరోపించారు. విద్వేష ప్రసంగం, మత హింసకు సంబంధించిన ఐపీసీ సెక్షన్లను ఉదహరిస్తూ ప్రధాని మోడీపై పోలీసులకు ఫిర్యాదు చేశానని బృందా కరత్ తెలిపారు. అయితే తన ఫిర్యాదును స్వీకరించేం దుకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిరాకరించారని, దాంతో దానిని నేరుగా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు పంపాల్సి వచ్చిందని ఆమె చెప్పారు.

రుణమాఫీ చేస్తా..

(మొదటిపేజి తరువాయి)

సహకరించాలి' అని మద్దూర్‌లో జరిగిన కొడంగల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సభలో రేవంత్ కోరారు. బీఆర్ఎస్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలోనూ, ఉద్యోగాలను భర్తీ చేయడంలోనూ, నిధులను వెచ్చించడంలోనూ ఈ జిల్లాపై వివక్ష చూపిందని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉందన్నారు. కేసీఆర్ ఎంపీగా ఉన్నా మహబూబ్‌నగర్‌ను పట్టించుకోలేదన్నారు. రాజోలి, తుమ్మిళ్ల, పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు పూర్తయితే జిల్లా వ్యవసాయంలో అభివృద్ధి చెందుతుందన్నారు. దొంగలకు సద్ది మూటలు మోసే నేతలు మన జిల్లాలో కొందరు ఉన్నారని, అలాంటివారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. జాతీయ ఉపాధ్యక్షులు డికె.అరుణ, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో తమకు ఎలాంటి వివాదం లేదన్నారు. 'నరేంద్ర మోడీ కత్తి.. పాలమూరు కడుపులో పొడిచేందుకు ప్రయత్నిస్తోంది. దాని గురించే ఆందోళన తప్ప ఆమెతో నాకు పోటీ లేదు. ఆమె సొంత ఊరిలోనే ఆ పార్టీ డిపాజిట్ కోల్పోయింది.. ఆమెకు నాకు ఏం పోటీ. కొడంగల్‌ను దొంగ దెబ్బ తీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారు' అని డికే అరుణ్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. 'నాకు పాలమూరులో శత్రువులు.. ప్రత్యర్థులు ఎవ్వరూ లేరు" అని రేవంత్ స్పష్టం చేశారు. ఆనాడు మంత్రిగా ఉన్న అరుణ.. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నారని తెలిపారు. ఇంట్లో గెలిచి.. రచ్చ గెలవాలని అంటారని.. మన ఇల్లు కొడంగల్.. ఇక్కడ మనం పెద్ద మెజార్టీతో గెలవాలని కోరారు. బీజేపీ నేతలకు పిచ్చి పట్టిందని ఆరోపించారు. తామంతా హిందువులం.. పూజలు చేసిన వాళ్లమేనని భక్తి మన గుండెల్లో ఉండాలన్నారు. వారు గోడలమీద రాస్తూ పిచ్చి పిచ్చి చేష్టలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ పదేండ్లు తెలంగాణకు ఏమీ చేయలేదన్నారు. అందుకే సమాజంలో విభజన తెచ్చి లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్ పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గెలిస్తే.. ఆయనను మోడీ కాళ్ల కింద పెట్టడం ఖాయమని బిజినేపల్లి సభలో రేవంత్ అన్నారు. దొరల గడీలకు వ్యతిరేకంగా మాట్లాడి.. నియంతృత్వ విధానాలపై పోరాడి, గురుకుల ముఖ్య కార్యదర్శి పదవికి రాజీనామా చేసి.. బీఎస్పీలోకి.. ఆ తర్వాత బీఆర్ఎస్ చెంతకు ఎందుకు చేరారని ప్రశ్నించారు. ఏ లక్ష్యంతో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారో.. అది బీఆర్ఎస్‌లో ఎన్నటికీ నెరవేరదన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో పట్టుబడితే మార్షల్స్ చేత గెంటేయించిన కేసీఆర్ వర్గీకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. బీజేపీ నుంచి తలపడుతున్న భరత్ ప్రసాద్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఎంత పెద్ద దోమ అయినా ఏనుగు తొండానికి సరిపడదన్నారు.

ఐపీఎల్‌లో నేడు
ఢిల్లీ X గుజరాత్
వేదిక : న్యూఢిల్లీ , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



నెగెటివ్ ఇంపాక్ట్

- ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై దుమారం
- ఈ రూల్‌తో ఆల్‌రౌండర్ల పాత్రకు పాతర
- ఆటకు సైతం హాని చేస్తుందని ఆందోళన

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్‌లో సోమవారం వరకు 38 మ్యాచులు ముగిశాయి. ఇందులో 17 ఇన్నింగ్స్‌ల్లో 200 ప్లస్ పరుగులు నమోదు కాగా.. 190కి పైగా పరుగులు లెక్కలేనన్ని సార్లు వచ్చాయి. 250 పైచిలుకు పరుగులు ఏకంగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో నమోదు కాగా.. అందులో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒక్క జట్టే 277/3, 287/3, 266/7 భారీ ఇన్నింగ్స్‌లతో ఊచకోత కోసింది. బ్యాటర్లు భయమెరుగని దూకుడుతో చెలరేగుతుండగా, ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో జట్ల దూకుడు వ్యూహం మరింత పదునెక్కింది. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన తొలగిస్తేనే బంతికి, బ్యాట్‌కు సరసమైన సమరం ఉంటుందని క్రికెటర్లు, వ్యాఖ్యాతలు, విశ్లేషకుల మాట.

నవతెలంగాణ క్రీడావిభాగం



ఇంపాక్ట్ ప్లేయర్.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో చర్చనీయంశమైన వివాదాస్పద నిబంధన. దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీలో 2022లో ప్రయోగాత్మకంగా అమలు చేసి.. 2023 ఐపీఎల్‌లో ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను గ్లోబల్ తెరపైకి తీసుకొచ్చారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి దీనిపై విపరీత చర్చ నడుస్తుంది. 11 మంది ఆటగాళ్లు పోటీపడాల్సిన జెంటిల్‌మెన్ క్రికెట్ గేమ్ వాణిజ్య విలువలు, వినోదం హంగుల కోసం 12 మంది పోటీపడగల ఆటగా మార్చివేసింది. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో కొన్ని ప్రయోజనాలు సైతం ఉన్నాయి. కానీ ఈ తర్కంలేని నిబంధనతో క్రికెట్‌కు జరుగుతున్న చేటు అంచనాకు అందటం లేదు!. ప్రతి జట్టు మ్యాచ్‌లో ఏ దశలోనైనా ఇంపాక్ట్ ప్లేయర్ సేవలు వినియోగించుకోవచ్చు. తుది జట్టులోని ఏదేని ఆటగాడి స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్, స్పెషలిస్ట్ బౌలర్, స్పెషలిస్ట్ ఆల్‌రౌండర్‌ను జట్టులోకి తీసుకునే వెసులుబాటు ఇంపాక్ట్ రూల్‌తో కలిగింది. ఐపీఎల్‌లో కొన్ని జట్లు ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను గొప్పగా వాడుకుంటుండగా.. మరికొన్ని జట్లు ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో తీవ్రంగా నష్టపోతున్నాయి.

ఆల్‌రౌండర్ల అవసరం ఏదీ?

ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ ప్రధానంగా ఆల్‌రౌండర్లపై పడింది. హార్దిక్ పాండ్య మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్, రషీద్ ఖాన్ వంటి అగ్రశ్రేణి ఆల్‌రౌండర్లు ఇప్పటికీ తుది జట్టులో నిలుస్తున్నా.. వర్థమాన ఆల్‌రౌండర్లకు ఈ నిబంధన గుదిబండగా మారింది. సగటు ఆల్‌రౌండర్‌ను తుది జట్టులోకి తీసుకునే బదులు.. ఓ స్పెషలిస్ట్ బ్యాటర్, స్పెషలిస్ట్ బౌలర్‌తో ఆడే అవకాశం ఈ రూల్‌తో కలిగింది. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన క్రికెటర్లు సైతం ఈ రూల్ కారణంగా బరిలోకి దిగుతున్నారు. జోశ్ బట్లర్, కెఎల్ రాహుల్, రింకూ సింగ్ వంటి క్రికెటర్లు కేవలం బ్యాటింగ్‌కు మాత్రమే వస్తున్నారు. ఫీల్డింగ్ సమయంలో వీరి స్థానంలో ఇంపాక్ట్ ప్లేయర్ బరిలోకి దిగుతున్నాడు. నాణ్యమైన ఆల్‌రౌండర్ల కొరత భారత క్రికెట్‌ను ఇప్పటికీ వేధిస్తోంది. ఐపీఎల్‌తో నాణ్యమైన ఆల్‌రౌండర్లు తయారయ్యే అవకాశం పూర్తిగా పోయింది.

బౌలర్లకు మరింత కష్టం

ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను అన్ని జట్లు ప్రధానంగా బ్యాటింగ్ లైనప్‌ను బలోపేతం చేసుకునేందుకు వినియోగిస్తున్నాయి. సాధారణంగా ఓ ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు కుప్పకూలితే.. సహజంగానే పరుగుల రాక మందగిస్తుంది. కానీ ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌తో సమీకరణం మారిపోయింది. నాలుగు వికెట్లు పడినా.. ఆ తర్వాత బ్యాటర్ స్వేచ్ఛగా దూకుడు ప్రదర్శిస్తున్నాడు. ఇంపాక్ట్ రూపంలో స్పెషలిస్ట్ బ్యాటర్ సేవలు అందుబాటులో ఉండటంతో ఈ సీజన్లో భారీ స్కోర్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. భయమెరుగని బ్యాటింగ్, అదనపు బ్యాటర్ సేవలతో బౌలర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఓవర్‌లో ఆరు బంతులనూ స్టాండ్స్‌లోకి పంపించేందుకు బ్యాటర్లు దూకుడు చూపిస్తున్నారు.

మార్పు అనివార్యం

వాణిజ్య, వినోద విలువల కోసం ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తీసుకొచ్చినా.. అది ప్రతికూల ఫలితాలకు దారితీసింది. వచ్చే ఏడాది ఐపీఎల్‌లోనైనా ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తీసివేయాలని క్రికెటర్లు కోరుతున్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను కొనసాగించేందుకు మొగ్గుచూపితే.. పిచ్‌ల నాణ్యతలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. లేదంటే, ఐపీఎల్‌లో 300 పరుగుల స్కోరు చేసేందుకు ఎంతోకాలం పట్టదు!.

TATA IPL

చెపాక్‌లో చెన్నైకు షాక్

- భారీ శతకంతో చెలరేగిన స్టొయినీస్
- చెన్నైపై ఆరు వికెట్ల తేడాతో లక్నో గెలుపు
- గైక్వాడ్ సెంచరీ వృథా



చెన్నై: చెపాక్ స్టేడియంలో ఎదురులేని చెన్నైకు లక్నో జట్టు చెక్ పెట్టింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో లక్నో బ్యాటర్ మార్కస్ స్టొయినీస్(124నాటౌట్; 63బంతుల్లో 13ఫోర్లు, 6సిక్సర్లు) ఒంటిచేత్తో మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు కెప్టెన్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అజేయ శతకానికి తోడు.. శివమ్ దూబే అర్ధసెంచరీలతో మెరవడంతో సొంతగడ్డపై చెన్నై సూపర్ కింగ్స్ 210పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో లక్నో ఓపెనర్లు డికాక్(0), కెఎల్ రాహుల్(16) నిరాశపరిచినా.. స్టొయినీస్ (124నాటౌట్) అజేయ శతకంతో మ్యాచ్‌ను ముగించాడు. చివర్లో పూరన్ (34), హుడా(17నాటౌట్) స్టొయినీస్‌కు సహకరించారు. దీంతో లక్నో జట్టు 19.3ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 213పరుగులు చేసి సంచలన విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టొయినీస్‌కు లభించింది. తొలుత చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(108నాటౌట్)సెంచరీతో చెలరేగగా.. సిక్సర్ల శివం దూబే(66) తన తరహాలో రెచ్చిపోయాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకు టాపార్డర్ విఫలమైనా.. గైక్వాడ్ లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రవీంద్ర జడేజా(16)తో మూడో వికెట్‌కు 52 పరుగులు జోడించిన గైక్వాడ్.. దూబే కలిసి చెన్నై స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ సీజన్‌లో ఓపెనింగ్ సమస్యతో ఇబ్బంది పడుతున్న చెన్నైకి లక్నో పేసర్ హెన్రీ ఆదిలోనే షాకిచ్చాడు. ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే ఆఖరి బంతికి అజింక్యా రహానే(1)ను ఔట్ చేశాడు. 4పరుగులకే తొలి వికెట్ కోల్పోయిన చెన్నై.. డారిల్ మిచెల్(11) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. అయితే.. మొహ్సిన్ ఖాన్ ఓవర్‌లో జడేజా స్లో డెలివరీని అంచనా వేయలేక వికెట్ పారుసుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన శివం దూబే అండతో గైక్వాడ్ మరింత చెలరేగి ఆడాడు. వీళ్లిద్దరూ ఎడాపెడా బౌండరీలు బాదడంతో చెన్నై స్కోర్ 150 దాటింది. యశ్ ఠాకూర్ ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ బాదిన రుతురాజ్ ఐపీఎల్ రెండో సెంచరీని పూర్తి చేసుకు న్నాడు. ఇక మొహ్సిన్ ఖాన్ వేసిన 19వ ఓవర్లో దూబే సిక్సర్‌తో అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. వీళ్లిద్దరూ నాల్గో వికెట్‌కు 104 పరుగులు జోడించడంతో చెన్నై జట్టు 20 ఓవర్లు ముగిసేసరికి 4వికెట్లు నష్టపోయి 210పరు గుల భారీస్కోర్ నమోదు చేసింది. లక్నో బౌలర్లు హెన్రీ, మొహి సిన్ ఖాన్, యశ్ ఠాకూర్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి.

ప్రొఫెషనల్ స్క్వాష్‌కు సౌరవ్ ఘోషల్ వీడ్కోలు

న్యూఢిల్లీ: భారత స్టార్ స్క్వాష్ ఆటగాడు సౌరవ్ ఘోషల్ ప్రొఫెషనల్ స్క్వాష్‌కు వీడ్కోలు పలికాడు. 37ఏళ్ల సౌరవ్ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించాడు. 22ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు ఆ ప్రకటనలో తెలిపాడు. '22 ఏళ్ల క్రితం నా కెరీర్ మొదలైంది. అప్పుడు ప్రొఫెషనల్ స్క్వాష్‌లో సుదీర్ఘ కాలం ఆడతానని అనుకోలేదు. కానీ, ప్రతి దానికి ముగింపు ఉంటుంది. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్(పిఎస్ఎ)కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నా' అని తెలిపాడు. అయితే, ఇది స్క్వాష్‌కు పూర్తిగా వీడ్కోలు పలికినట్టు కాదని, తాను దేశం తరపున మరికొంత కాలం ఆడతానని పేర్కొన్నాడు. కాగా, ఘోషల్ తన కెరీర్‌లో 10పిఎస్ఎ టైటిల్స్ సాధించాడు. అంతేకాకుండా, టాప్-10 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో నిలిచిన ఏకైక భారత ఆటగాడు అతనే. వరల్డ్ డబుల్స్ చాంపియన్‌షిప్-2022లో మిక్స్‌డ్ డబుల్స్ కేటగిరీలో సౌరవ్ స్వర్ణం సాధించాడు. అదే ఏడాది కామన్వెల్త్ గేమ్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్, సింగిల్స్ కేటగిరీల్లో కాంస్యం సాధించగా.. ఆసియా క్రీడల్లో టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం, సింగిల్స్‌లో రజతం గెలుచుకున్నాడు.



నవచిత్రం



సీతా కళ్యాణ వైభోగమే హిట్ ఖాయం

సుమన్ తేజ్, గరీమ చౌహాన్ హీరో, హీరోయిన్లుగా డ్రీమ్ గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ నిర్మించిన చిత్రం 'సీతా కళ్యాణ వైభోగమే'. ఈ చిత్రాన్ని ఈనెల 26న భారీ ఎత్తున విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం చిత్ర బృందం నిర్వహించిన ప్రీ-రిలీజ్‌కు యాటా సత్యనారాయణ, విజయ్ కనకమేడల, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, నటుడు రమణారెడ్డి, నీరూస్ ప్రతినిధి హసీం తదితరులు అతిథులుగా విచ్చేసి, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

సుమన్ తేజ్ మాట్లాడుతూ, 'మా లాంటి కొత్త వాళ్లను ఎంకరేజ్ చేస్తున్న మా నిర్మాత యుగంధర్‌కి థ్యాంక్స్. మా దర్శకుడు సతీష్ మంచి పాత్ర ఇచ్చారు. నీరూస్ ఇచ్చిన సపోర్ట్ వల్లే ఈ రోజు ఇక్కడి వరకు సినిమా వచ్చింది. ప్రేక్షకులు మా సినిమాను చూసి ఆదరించండి' అని అన్నారు.

సీతలాంటి పాత్ర నా కెరీర్ ప్రారంభంలోనే రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. నా మీద ప్రేమ కురిపిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్' అని గరిమ చౌహాన్ చెప్పారు.

నిర్మాత రాచాల యుగంధర్ మాట్లాడుతూ, 'ఏ మాత్రం రెమ్యూనరేషన్ ఆశించకుండా పని చేసిన చరణ్ అర్జున్‌కు థ్యాంక్స్. డైరెక్టర్ సతీష్ సినిమా కోసం ఎంత దూరమైనా వెళ్తుంటాడు. సుమన్, గరిమ, గగన్ విహారి అందరూ అద్భుతంగా నటించారు. ఎన్ని కష్టాలు వచ్చినా రవన్న వల్లే ఈ సినిమా ముందుకు సాగింది' అని తెలిపారు. గగన్ విహారి మాట్లాడుతూ,'సీతమ్మ తల్లి పడ్డ కష్టాలు మనకు పూర్తిగా తెలియవు. ఈ చిత్రంలో నాలాంటి రావణ పాత్రతో సీత ఎలాంటి కష్టాలు పడిందో చూపించారు. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర' అని తెలిపారు.

ఎలా బతకాలో రామాయణం చెబుతుంది. రాముడు మామూలు మనిషి. కానీ దేవుడు అయ్యాడు. సీత ప్రేమ కోసం యుద్ధం చేయడం, రావణ సంహారం తరువాత దేవుడయ్యాడు.. ఈ ప్రేమ కథను తీయాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాను. ఆడపిల్ల పుడితే అదృష్టమని అంతా అనుకుంటాం. కానీ ఆడపిల్లకు సరైన కేరాఫ్ అడ్రస్ ఉండదు. మహిళలు ఎదుర్కొనే సమస్యలను ఎమోషనల్ జర్నీగా చూపించాను. సందేశాత్మక చిత్రమని ప్రేక్షకులను బోర్ కొట్టించం. ప్రస్తుత తరానికి నచ్చేలా ఈ సినిమాను తీశాను. ఆడపిల్ల ఉన్న ప్రతీ కుటుంబానికి ఈ సినిమా నచ్చుతుంది. సమ్మర్‌లో మా సినిమా పెద్ద హిట్ అవుతుంది. 'ఊరికి ఉత్తరాన' సినిమాను రాచాల యుగంధర్ విడుదల చేశారు. ఈ మూవీ కథ పూర్తిగా వినకుండా నమ్మకంతో ఈ ఆఫర్ ఇచ్చారు. గరిమ ఈ పాత్రకు వంద శాతం సరిపోయింది. సుమన్ తేజ్ అద్భుతంగా నటించాడు.

- దర్శకుడు సతీష్ పరమవేద

భిన్న ఎమోషనల్ థ్రిల్లర్



మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కళ్యాణ్, రవీంద్ర విజయ్ కీలక పాత్రల్లో నటిస్తున్న సినిమా 'ఆరంభం'. ఈ సినిమాను ఏవీటీ ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్ పై అభిషేక్ వీటీ నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్ వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎమోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మంగళవారం మేకర్స్ అనౌన్స్ చేశారు.

ఈ సినిమాను మే 10న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు తెలిపారు. అనౌన్స్ మెంట్ నుంచి ఈ సినిమా ప్రేక్షకుల్లో ఆసక్తి కలిగిస్తోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో పాటు హీరో శ్రీ విష్ణు చేతుల మీదుగా రిలీజ్ చేసిన 'అనగా అనగా..' లిరికల్ సాంగ్‌కు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. వైవిధ్యమైన కథా కథనాలతో ఓ డిఫరెంట్ మూవీ చూసిన ఎక్స్‌పీరియన్స్‌ను ఈ సినిమా ప్రేక్షకులకు ఇవ్వబోతోంది. ఈ చిత్ర విజయంపై మేకర్స్ ఎంతో నమ్మకంతో ఉన్నారు. లక్ష్మణ్ మీసాల, బోడెపల్లి అభిషేక్, సురభి ప్రభావతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటర్ - ఆదిత్య తివారీ, ప్రీతమ్ గాయత్రి, సినిమాటోగ్రఫీ - దేవ్ దీప్ గాంధీ కుందు, మ్యూజిక్ - సింజిత్ యెర్రమిల్లి, డైలాగ్స్ - సందీప్ అంగిడి, సౌండ్ - మాణిక ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ - వినయ్ రెడ్డి మామిడి.

సందీప్ కిషన్ నయా సినిమా షురూ



దిల్‌రాజు, సందీప్ కిషన్

హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తన 30వ చిత్రం కోసం 'ధమాకా' దర్శకుడు త్రినాధ రావు నక్కినతో చేతులు కలిపారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'సామజవరగమన, ఊరు పేరు భైరవకోన' వంటి వరుస హిట్‌లను అందించిన ప్రొడక్షన్ హౌస్ వారి కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్ కోసం రంగం సిద్ధం చేస్తోంది. పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తుండగా, బాలాజీ గుత్తా సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. మంగళవారం ఈ సినిమా గ్రాండ్‌గా ప్రారంభమైంది. ముహూర్తం షాట్‌కు విజయ్ కనకమేడల కెమెరా స్విచాన్ చేయగా, దిల్ రాజు క్లాప్ కొట్టారు. అనిల్ సుంకర తొలి షాట్‌కి గౌరవ దర్శకత్వం వహించారు.

త్రినాధరావు నక్కిన విజయవంతమైన ప్రయాణంలో భాగమైన రచయిత ప్రసన్న కుమార్ బెజవాడ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్ రైటర్‌గా పని చేస్తున్నారు. ఈ కొత్త సినిమా త్రినాధరావు నక్కిన, ప్రసన్నల మార్క్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోంది. రావు రమేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది.

పడమటి కొండల్లో..



అనురూప్ కటారి

హీరో సాయి దుర్గ తేజ్ 'ఎక్స్' వేదికగా 'పడమటి కొండల్లో' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. శ్రీదేవి క్రియేషన్స్ బ్యానర్ పై విన్విత ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ ద్వారా జయకృష్ణ దురుగడ్డ నిర్మాతగా ఈ చిత్ర నిర్మాణం జరిగింది. అనురూప్ కటారి హీరోగా నటిస్తున్నారు.

దర్శకత్వంతో పాటు సంగీతాన్ని కూడా అందించిన నరేష్ పెంట మాట్లాడుతూ,'ఈ సినిమాతో సరికొత్త ఎక్స్‌పీరియన్స్‌ని ప్రేక్షకులు పొందుతారు. ఈ చిత్రానికి ఒక మార్క్ ఉంటుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా కొనసాగే ఈ చిత్రంలో ఉండే ప్రేమకథ ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. సినిమా మొత్తం ఒక డిఫరెంట్ అండ్ విజువల్ ఫీస్ట్‌లా ఉండేలా ప్రదేశంలో చిత్రీకరణ జరుపుతున్నాం' అని అన్నారు.

తెలుగు చిత్ర పరిశ్రమ సమక్షంలో

అత్యంత వైభవంగా డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్



దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా మే 4వ తేదీని డైరెక్టర్స్ డే ఈవెంట్ ఘనంగా నిర్వహించ బోతున్నట్లు తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. మే 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డైరెక్టర్స్ డే ఈవెంట్‌ను గ్రాండ్ గా జరపనున్నారు.

ఈ ఈవెంట్ వివరాలను సోమవారం సాయంత్రం నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ అసోసియేషన్ వెబ్ సైట్, డైరెక్టర్స్ డే ఈవెంట్ లోగోను ఆవిష్కరించారు.

రూ.35 లక్షల విరాళం



ప్రభాస్

చిత్ర పరిశ్రమలో ఏ మంచి కార్యక్రమం జరిగినా అందులో భాగమవుతుంటారు ప్రభాస్. అందరి కంటే ముందుగా స్పందిస్తూ తన వంతు ఆర్థిక సహాయం అందిస్తుంటారు. మే 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్ చేసుకుంటున్న తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్‌కు ప్రభాస్ 35 లక్షల రూపాయల విరాళం అందించారు. దర్శకుల సంఘం సంక్షేమ నిధి కోసం ఈ డబ్బును వెచ్చించనున్నారు. టిఎఫ్‌డిఎ నిర్వహించిన డైరెక్టర్స్ డే ఈవెంట్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు మారుతి ఈ విషయాన్ని సంఘ సభ్యులకు తెలియజేశారు. రూ.35 లక్షల భారీ రూపాయల విరాళం అందించిన ప్రభాస్‌కు డైరెక్టర్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మదర్స్ డే, ఫాదర్స్ డే ఉన్నట్లే డైరెక్టర్స్ డే కూడా అంతే పేరు తెచ్చుకోవాలి. తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్‌కు మొత్తం దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమల్లో మంచి పేరుంది. ఇప్పటిదాకా మనం డైరెక్టర్స్ డేను ఇండోర్‌లో చిన్నగా చేసుకున్నాం. ఈసారి ఎల్బీ స్టేడియంలో ఘనంగా నిర్వహించు కోబోతున్నాం. హరీశ్ శంకర్, మారుతి, అనిల్ రావిపూడి వంటి దర్శకులు బిజీగా ఉన్నా మన అసోసియేషన్ కార్యక్రమంలో యాక్టీవ్‌గా పార్టిసిపేట్ చేస్తున్నారు. అసోసియేషన్ మన కుటుంబం అని ప్రతి ఒక్కరూ భావించడం వల్లే ఈ ఈవెంట్ కోసం అందరం కష్టపడుతున్నాం. డైరెక్టర్స్ డే వేడుకల్లో చిత్ర పరిశ్రమ నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుకుంటున్నా.

- తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్

'డైరెక్టర్స్ డేను ఇప్పటిదాకా మామూలుగా నిర్వహిస్తూ వచ్చాం. కానీ ఈసారి డైరెక్టర్స్ అసోసియేషన్‌కు కొత్త కమిటీ వచ్చాక చాలా గ్రాండ్‌గా నిర్వహించాలని ప్లాన్ చేశాం. మన స్టార్స్, దర్శకుల సంఘం కుటుంబ సభ్యులతో పాటు వేలాది మంది ప్రేక్షకుల సమక్షంలో ఈ ఈవెంట్ చేస్తున్నాం' అని తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాయి రాజేశ్ తెలిపారు.

దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ, 'ఈ అసోసియేషన్‌లో గతంలోకి ఇప్పటికీ తేడా కనిపిస్తోంది. నాలుగు గోడల మధ్యలో మనం ఇన్నాళ్లూ డైరెక్టర్స్ డే జరుపుకున్నాం. ఇప్పుడు ఘనంగా చేసుకోబోతున్నాం. ఈ వేడుకలతో మన దర్శకుల సంఘం గొప్పదనాన్ని దేశమంతా చాటి చెప్పాలి' అని తెలిపారు.

'డైరెక్టర్స్ డే నిర్వహణ అనేది మన అసోసియేషన్ తరపున ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి దర్శకుల సంఘం సత్తా చాటేలా డైరెక్టర్స్ డే వేడుకలు ఉండబోతున్నాయి. 24 విభాగాల నుంచి అందరం ఈ కార్యక్రమంలో పాల్గొంటాం' అని దర్శకుడు రాంప్రసాద్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

చెరువుల రక్షణ చర్యలు చెప్పండి : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

చాంద్రాయణగుట్టలోని జల్‌పల్లి ఇతర చెరువుల రక్షణకు తీసుకున్న చర్యలు వివరించాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశించింది. మెట్రో రైలు ప్రాజెక్టు వచ్చాక భూముల విలువలు పెరిగి కబ్జాదారుల కండ్లు చెరువులపై పడ్డాయంటూ వచ్చిన వార్తను హైకోర్టు పిల్‌గా తీసుకుని మంగళవారం విచారించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్, ఇరిగేషన్ ముఖ్యకార్యదర్శులు, జీహెచ్ఎంసీ కమిషనర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ, జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్, మెట్రో రైల్ ఎండీ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. చాంద్రాయణగుట్టలోని జల్‌పల్లి ఇతర చెరువుల ఆక్రమణల నివారణ, కాలుష్యం కాకుండా తీసుకున్న చర్యలు వివరించాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ జె. అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఎక్సైజ్ అధికారులకు మినహాయించారా? : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత రెవెన్యూ, హోం, ఇతర అన్ని శాఖల్లోని అధికారులను బదిలీ చేసినప్పటికీ ఎక్సైజ్ శాఖలో మాత్రం బదిలీ చేయలేదంటూ దాఖలైన వ్యాజ్యంపై వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘ అధికారులను హైకోర్టు ఆదేశించింది. వివరాలను బుధవారం అందజేయాలనీ, గురువారం విచారణ చేపడతామని చీఫ్ జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ జె అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ప్రకటించింది. ఎన్నికల బదిలీల నుంచి ఎక్సైజ్ అధికారులకు మినహాయింపు ఇవ్వడం అన్యాయమంటూ సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి పిల్ దాఖలు చేశారు. దీనిపై రిజిస్ట్రీ అభ్యంతరం చెప్పడంపై హైకోర్టు విచారణ జరిపింది. విచారణను ఈనెల 25వ తేదీకి వాయిదా పడింది.

నిందితులకు సంకెళ్లపై రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు

నవతెలంగాణ-హైదరాబాద్

కూకట్‌పల్లిలోని జిల్లా కోర్టుకు ముగ్గురు నిందితులను పోలీసులు సంకెళ్ల వేయడంపై దాఖలైన పిల్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ప్రాంగణలో ముగ్గురు నిందితులకు పోలీసులు బేడీలు వేయడం గురించి అందిన లేఖను హైకోర్టు పిల్‌గా తీసుకుని చీఫ్ జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ జె. అనిల్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనర్లకు నోటీసులు ఇచ్చింది. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం బేడీలు వేయరాదనీ, వ్యక్తి స్వేచ్ఛను హరించరాదని లేఖలో పేర్కొన్నారు. విచారణ వాయిదా పడింది.

కార్ల గ్యారేజీలో అగ్ని ప్రమాదం

23 కార్లు దగ్ధం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

హైదరాబాద్ యూసఫ్ గూడలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఓ కార్ల గ్యారేజీలో మొత్తం 23 కార్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసఫ్‌గూడలోని గణపతి కాంప్లెక్స్ వద్ద సెకండ్ హ్యాండ్ కార్లు విక్రయించే 'నాని కార్స్' అనే గ్యారేజ్ ఉంది. మంగళవారం ఉదయం గ్యారేజ్‌లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రెండు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే 23 కార్లు, ఆఫీస్ ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఓ కారులోని బ్యాటరీ పేలడంతో మంటలు వ్యాపించినట్టు తెలిసింది.

రేపు జేఈఈ మెయిన్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశం, ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ ఫలితాలను గురువారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విడుదల చేయనుంది. ఈనెల నాలుగు నుంచి 12 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్ రెండో విడత రాతపరీక్షలకు 12.57 లక్షల మంది హాజరయ్యారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు జేఈఈ మెయిన్ మొదటి రాతపరీక్షలను నిర్వహించారు. 12,21,624 మంది దరఖాస్తు చేయగా, 11,70,048 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 23 మంది వంద ఎన్టీఏ స్కోర్‌ను సాధించారు. వారిలో పది మంది తెలుగు విద్యార్థులే ఉండడం గమనార్హం. ఇందులో తెలంగాణ విద్యార్థులు ఏడుగురు, ఏపీ విద్యార్థులు ముగ్గురు ఉన్నారు.

రూ.155 కోట్ల పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న తనిఖీల్లో ఇప్పటి వరకు రూ.1,55,85,98,318 పట్టుబడినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఐటీ, ఈడీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, స్టేట్ కమర్షియల్ ట్యాక్స్, పోలీస్ తదితర విభాగాల నుంచి అధికారులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న డ్రైవ్‌లలో వీటిని పట్టుకున్నట్టు తెలిపింది.

కాంగ్రెస్ సీనియర్ నేత నాగయ్య మృతికి సీఎం సంతాపం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ఉద్యమ నాయకులు తాటిపాముల నాగయ్య మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా, మేధావిగా ఆయన గుర్తింపు పొందారని సీఎం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగయ్య లాంటి విద్యావంతులు, మేధావి, ఉద్యమ కారుడి అకాల మరణం కాంగ్రెస్‌కు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సిద్ధాంతాన్ని నమ్మి తన జీవితకాలం పార్టీ విస్తృతం చేసేందుకు కృషి చేసిన నేత అని కొనియాడారు. ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. భారీనీటిపారుదల మంత్రులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, చేనేత విభాగం అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ వేర్వేరు ప్రకటనల్లో నాగయ్య మృతికి సంతాపం ప్రకటించారు. మంగళవారం ఉదయం గాంధీభవన్‌లో నాగయ్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కోదండరెడ్డి, జగ్గారెడ్డి, ఆనంతుల శ్యామ్ మోహన్, నాయకులు జి. నిరంజన్, కుమార్‌రావు, నూతి శ్రీకాంత్, ప్రీతమ్, మెట్టుసాయి, అల్లం భాస్కర్, దయాకర్, లింగం యాదవ్ తదితరులు ఉన్నారు.

నెస్లే ఇండియా 'బయోడైజెస్టర్ ప్రాజెక్ట్'

హైదరాబాద్ : పాడి రైతులకు మద్దతును ఇవ్వడానికి 'బయోడైజెస్టర్ ప్రాజెక్ట్'ను చేపట్టినట్లు నెస్లే ఇండియా తెలిపింది. బయోడైజెస్టర్ టెక్నాలజీ పశువుల ఎరు వును క్లీన్ బయోగ్యాస్‌గా మార్చడంతో పునరుత్పత్తి వ్యవసాయ పద్ధతులకు దోహదం చేస్తుందని పేర్కొంది. తొలుత దీన్ని పంజాబ్, హరియాణాలోని 24 జిల్లాలలో ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. బయో డైజె స్టర్‌లలోని అవశేష ఎరువును బయో ఎరువుగా మార్చి పొలాలు, కిచెన్ గార్డెన్‌లలో ఉపయోగించేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశామని నెస్లే ఇండియా ప్రతినిధి సంజయ్ ఖజురియా పేర్కొన్నారు.

ఆఫ్రికాలో ఎదురు దెబ్బలు

- పునపరిశీలనలో పడిన అమెరికా విధానం పొలిటికో



న్యూయార్క్: తమ దేశంలో 1,000 కంటే ఎక్కువగావున్న అమెరికా సైనికులను ఉపసంహరించుకోవాలని నైజర్ ఆదేశించటంతో అమెరికా ఒక కీలకమైన డ్రోన్ స్థావరాన్ని కోల్పోయినట్టయింది. దీనితో అమెరికా ప్రభుత్వం తన ఆఫ్రికా విధానంపై "పునరాలోచనలో పడింది" అని ప్రభుత్వంలోని వనరులను ఉటంకిస్తూ పొలిటికో వార్తా సంస్థ రాసింది. నైజర్ నుంచి "క్రమబద్ధమైన, బాధ్యతాయుతమైన ఉపసంహరణ" జరుగుతుందని గత వారం అమెరికా ధృవీకరించింది.

పశ్చిమ ఆఫ్రికాలోని నైజర్ ప్రభుత్వం గతంలో ఇదే పద్ధతిలో ఫ్రెంచ్ దళాలను బహిష్కరించి రష్యాతో భద్రతా సహకారాన్ని ఎంచుకుంది. పాశ్చాత్య శక్తుల నుంచి దూరంగా జరిగే విస్తత ప్రాంతీయ ప్రక్రియలో భాగంగా పొరుగున ఉన్న చాడ్ కూడా అమెరికన్లను తమ దేశాన్ని వీడాలని కోరింది. ఆఫ్రికన్ దేశాలతో వ్యవహరించేటప్పుడు అమెరికా భావజాలపరమైన లక్ష్యాలను అనుసరించడం వల్ల విపరీత పరిణామాలు చోటు చేసుకున్నాయని పొలిటికోతో మాట్లాడుతూ అనామక అమెరికా అధికారులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య సంస్కరణల అమలు, ఇతర రాజకీయ డిమాండ్లపై షరతులతో కూడిన సహాయం చేయడానికి వాషింగ్టన్ ప్రయత్నించినప్పుడు కొంతమంది ఆఫ్రికన్ నాయకులు తిరస్కరించారు.

ఎందుకంటే అమెరికా "ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో ఉన్న మిత్రదేశాలతో వ్యవహరించేటప్పుడు ఇటువంటి షరతులను పెట్టటంలేదు" అని వారు వాదిస్తున్నట్టు పొలిటికో సోమవారం రిపోర్ట్ చేసింది. "ఆఫ్రికన్ దేశాలకు ఎలా పరిపాలించాలనే విషయంపైన పశ్చిమ దేశాల బోధనలకు చెప్పటానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. వారు చివరకు 'చాలు బాబోయ్' అని చెబుతున్నారు."ఆఫ్రికన్ దేశాల సహజ వనరులను తమకు అందుబాటులో ఉండేలా చూసుకోవటానికి, చైనా, రష్యాలను ఆఫ్రికాకు దూరంగా ఉంచడానికి "ప్రజాస్వామ్యంలో సవాళ్లు" వంటి భావజాలపరమైన విషయాలను విస్మరించాలని తెర వెనుక అమెరికా అధికారులు గట్టిగా చెబుతున్నట్టు పొలిటికో వివరించింది. అమెరికా ప్రచారం చేస్తున్న "నియమాల-ఆధారిత క్రమం" నయావుదారవాద విధానాలకు ముసుగని రష్యా, చైనాలు విమర్శిస్తున్నాయి. ఇతర దేశాల అభివద్ధిని అణగదొక్కడానికి, తనకు, తన మిత్రదేశాలకు ప్రయోజనం చేకూర్చే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అమలు చేయడానికి అమెరికా నైతిక వాక్చాతుర్యాన్ని ఉపయోగిస్తోందనే విమర్శ సర్వత్రా ఉంది. ఆఫ్రికాలో విఫలమవుతున్న వ్యూహంలో భాగంగా రష్యా ఉనికిని "పరాన్నజీవి"గా చిత్రీకరించడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం మాస్కోతో భాగస్వామ్యంలోకి రావాలనే ఆఫ్రికన్ నాయకుల నిర్ణయాలను మార్చలేదని తేలిపోయిందని పొలిటికో పేర్కొంది.

ఉక్రెయిన్ యుద్ధంలో ఐదు లక్షల మంది సైనికులు మృతి

రష్యా రక్షణ మంత్రి



మాస్కో: ఫిబ్రవరి 2022 నుంచి ఇప్పటివరకు జరిగిన యుద్ధంలో మరణించిన ఉక్రెయిన్ సైనికుల సంఖ్య దాదాపు ఐదు లక్షలకు చేరుకున్నదని రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగు మంగళవారం పేర్కొన్నారు. రష్యా దళాలు ముందుగా చొరవతీసుకుని వారి ప్రత్యర్థులను వెనక్కి నెట్టివేస్తున్నాయని, కీవ్ దళాలు తమ రక్షణాత్మక స్థానాలలో నిలదొక్కుకోకుండా నిరోధిస్తున్నాయని షోయిగు మంత్రివర్గ సమావేశంలో చెప్పారు. కీవ్ కోసం అమెరికా 60 బిలియన్ల కంటే ఎక్కువ సైనిక సహాయాన్ని కేటాయించడం గురించి కూడా రక్షణ మంత్రి ప్రస్తావించారు. ఈ చర్య ఉక్రేనియన్ దళాల "ఓటమిని నిరోధించడానికి" మాత్రమే ఉద్దేశించబడిందని అతను పేర్కొన్నారు.అయితే డబ్బు యుద్ధరంగంలో పరిస్థితిని గణనీయంగా ప్రభావితం చేయదని, ఎందుకంటే నిధులలో చాలావరకు అమెరికా యుద్ధ పరిశ్రమలకు చేరతాయనే విషయం అందరికీ తెలిసిందేనని ఆయన అన్నారు. "తమ ప్రయోజనాల కోసం రష్యాతో జరిగే పోరాటంలో ఉక్రేనియన్లు చనిపోతున్నారని అమెరికన్ అధికారులకు తెలుసు" అని షోయిగు అన్నారు. రష్యాతో అమెరికా నేరుగా పోరాడటం కంటే ఉక్రెయిన్‌కు డబ్బు చెల్లించి యుద్ధం చేయించటం ఉత్తమమని అమెరికాకు బాగా తెలుసని కూడా ఆయన అన్నారు.రక్షణ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచటంలోను, పోరాట పరిస్థితికి అనుగుణంగా సైనిక వ్యూహాలను రూపొందించటంలోను రష్యా ఆరితేరటాన్ని షోయిగు ప్రశంసించారు. ఉక్రెయిన్‌కు పాశ్చాత్య ఆయుధాలను సరఫరా చేయడానికి ఉపయోగించే లాజిస్టిక్స్ హబ్‌లపైన, ఆయుధ డిపోలపైన రక్షణ మంత్రిత్వ శాఖ సుదూర దాడులను కొనసాగిస్తుందని ఆయన చెప్పారు.ఉక్రెయిన్ సైన్యంలో నిర్బంధంగా పౌరులను చేర్చటానికి ఉద్దేశింపబడిన చట్టంపైన ఈ నెల ప్రారంభంలో ఉక్రేనియన్ ప్రెసిడెంట్ వ్లాదిమిర్ జెలెన్స్కీ సంతకం చేశారు. సైన్యంలో చేరకుండా తప్పించుకునే వారిని ఈ చట్టం కఠినంగా శిక్షిస్తుంది. ఫిబ్రవరిలో అతను తొలగించిన ఉక్రెయిన్ మాజీ సైనిక ప్రధానాధికారి వాలెరీ జలుజ్నీచే ప్రతిపాదించబడిన 500,000 సమీకరణ లక్ష్యాన్ని తాను అధికమని భావిస్తున్నట్లు జెలెన్స్కీ చెప్పారు.పెద్ద ఎత్తున అమెరికా సహాయం చెయ్యాలని ఉక్రెయిన్ అభ్యర్థించి చాలా నెలలు గడిచింది.

అధిక ధరలకు మందుల అమ్మకాలు

- అర్హత లేకుండానే క్లినిక్‌ల నిర్వహణ
- డీసీఏ దాడుల్లో పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అధిక ధరలకు మందులను అమ్ముతున్నారు. అర్హత లేకుండానే పలువురు క్లినిక్‌లు నడుపుతూ మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్నారు. వైద్య రంగంలో అనేక రకాలుగా చట్టాలను ఉల్లంఘిస్తూ అమాయకులైన ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గత కొన్ని నెలలుగా డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేస్తూ అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తున్నా... ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట ఇలాంటి అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలం వనస్థలిపురం మెడికల్ షాపులో ఇట్రారోల్ -100, ఇట్రాటోల్ - 200 ఔషధాలను అధిక ధరలకు అమ్ముతున్నట్టు అధికారులు గుర్తించారు. రూ.5.52 లక్షల విలువైన ఔషధాలను సీజ్ చేశారు. ఇట్రారోల్-100 ఒక క్యాప్సుల్‌కు నిర్ణయించిన ధర రూ.16.67. జీఎస్టీ 12 శాతం కలుపుకున్నా రూ.18.67కు మించడానికి వీల్లేదు. కానీ ఈ ఔషధాన్నిరూ.31కి అమ్ముతున్నారు. అదే విధంగా ఇట్రారోల్ -200కు నిర్ణయించిన ధర రూ.22.12. జీఎస్టీతో కలిపి రూ.24.77కు మించడానికి వీల్లేకున్నా... రూ.43.5కు అమ్ముతున్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, బౌరంపేట్ గ్రామంలో అవసరమైన అర్హతలు లేకుండా వి.నరేష్ జయశ్రీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నడుపుతున్నట్టు గుర్తించారు. ఈ సెంటర్‌లో దాడి రూ.15 వేల విలువైన 26 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో యాంటిబయాటిక్స్‌తో పాటు స్టెరాయిడ్స్ ఉన్నట్టు అధికారులు తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్టు డీసీఏ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి తెలిపారు.

ఇందిరమ్మ పరిశ్రమలు పెడితే... మోడీ అమ్మేస్తున్నారు

- జైలుకెళ్లిన చరిత్ర బీజేపీ నేతలకుందా?
- జవాన్లను చంపితే మోడీ నిద్రలో ఉన్నారు
- నేటి యువత చరిత్ర తెలుసుకోవాలి : టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నో పరిశ్రమలను నెలకొల్పితే...నేటి ప్రధాని మోడీ వాటన్నింటినీ తెగనమ్ముతున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి విమర్శించారు. పరిశ్రమల స్థాపన ద్వారా లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్వతంత్ర్య ఉద్యమంలో ఇందిరాగాంధీ జైలుకెళ్లారనీ, ఆయన చరిత్ర బీజేపీ నేతలకుందా? అని ప్రశ్నించారు. హోంమంత్రి అమిత్ షా ఎందుకు జైలుకు వెళ్లారో అందరికీ తెలుసనన్నారు.పుల్వామాలో మన జవాన్లను చంపుతుంటే, మోడీ నిద్రమత్తులో ఉన్నారని ఎద్దేవా చేశారు. నేటి యువతరం ఆనాటి చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. దేశానికి కాంగ్రెస్ ఏం చేసిందంటూ బీజేపీ నేతలు రాహుల్‌గాంధీని నిందించడాన్ని తప్పుపట్టారు. దళిత, గిరిజనులకు భూములు పంచిన చరిత్ర ఇందిరమ్మకు ఉందనీ, ఇప్పటికే ఇందిరమ్మ ఇచ్చిన భూములపైన్నే ఆధారపడి జీవిస్తున్నారని గుర్తు చేశారు. మోడీ కానీ, కేసీఆర్ కానీ ఒక్క ఇంచు భూమినైనా పంచారా? అని ప్రశ్నించారు. ఇందిరమ్మ బ్యాంకులను జాతీయం చేశారనీ, దాంతో ఊరూరా బ్యాంకులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. 'రోటీ, కపడ, మకాన్' నినాదంతో ప్రతీ పేదింటిలో ఇందిరమ్మ పేరు వినిపిస్తోందన్నారు. ఇందిరమ్మ పాకిస్థాన్‌తో యుద్ధం చేసి గెలిచారనీ, పుల్వామాలో దాడి చేస్తే మోడీ నిద్రలో ఉన్నారని ఎద్దేవా చేశారు. వాజ్‌పాయ్ ఇందిరమ్మను అపర కాళీ అంటూ అభివర్ణించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

మెదక్ అభివృద్ధికి మోడీ సర్కార్ ఎంతో చేసింది

- పుస్తకాన్ని పంపిస్తున్నా చదువుకో రేవంత్‌రెడ్డి : రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మెదక్ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందనీ, నిధుల వివరాలతో తాను పంపుతున్న పుస్తకాన్ని చదువుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి మెదక్ ఎంపీస్థానం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు సూచించారు. కేంద్రం నిధులపై రూపొందిన పుస్తకాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. తమ అమ్మానాన్న పేరుమీదున్న గడిని రేవంత్‌రెడ్డి పేరుమీద రిజిస్ట్రేషన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాననీ, ఇంకో 48 గంటల సమయం తీసుకొని రేవంత్ రెడ్డి వస్తారా? ప్రతినిధిని పంపుతారా? అనే సవాల్‌ను స్వీకరించాలని కోరారు. కొడంగల్ నియోజకవర్గానికి మోడీ ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా లెక్కలతో సహా ఇంకో పుస్తకం పంపిస్తామని చెప్పారు. అగస్టు 15న రుణమాఫీ కాదనీ, సెప్టెంబర్ 17న షుగర్ ఫ్యాక్టరీ తెరవరని నొక్కిచెప్పారు. గతంలో కేసీఆర్, కేటీఆర్ మాట్లాడినట్టుగానే గాంధీభవన్ లో కూసొని జగ్గారెడ్డి, నామినేషన్ల దగ్గరకు వచ్చి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. పెద్దన్న అంటూ కేంద్రం నుంచి ఐదు నెలల్లో రూ.25వేల కోట్ల లోన్లను రేవంత్‌సర్కారు తెచ్చుకున్నదన్నారు. కాంగ్రెస్‌లో మిగిలిన వామపక్ష మేధావులు, అర్బన్ నక్సలైట్లు, మావోయిస్టులకు అనుకూలంగానే ఆ పార్టీ మేనిఫెస్టో ఉందని విమర్శించారు. యువకులను కాదని 80 ఏండ్లు దాటిన వాళ్లను పార్టీ అధ్యక్షులుగా నియమించి రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీని నడిపించినన్ని రోజులు ఆ పార్టీకి మూడంకెల సీట్లు రావని చెన్నారు.

ప్రధాని మోడీ హోదాకు తగునా..?

- విద్వేషపూరిత వ్యాఖ్యలను ఖండించిన కేరళ సీఎం పినరయి విజయన్

తిరువనంతపురం : ముస్లింలపై ప్రధాని మోడీ విద్వేషపూరిత వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా ఖండించారు. ఇది దేశ ప్రజాస్వామ్యం, లౌకిక విలువలపై దాడిగా పేర్కొన్నారు. పరోక్షంగా ముస్లింలను చొరబాటుదారులని, దేశ సంపదను దోచుకోవాలని చూస్తున్నారని ప్రధాని మోడీ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.రాజకీయ లబ్ది పొందేందుకు ప్రధాని స్వయంగా ఇటువంటి మతతత్వ వ్యాఖ్యలు చేయడం దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు ఎదుర్కొంటున్న బెదిరింపులకు స్పష్టమైన నిదర్శనమని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై ఎలక్షన్ కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పారదర్శకంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు అన్ని ప్రగతిశీల, లౌకిక శక్తులు కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు.

సనోఫీ యాజమాన్యానికి వ్యతిరేకంగా సమ్మె

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సనోఫి యాజమాన్యానికి వ్యతిరేకంగా సోమ, మంగళవారం రెండు రోజుల పాటు దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించారు. ఆ యాజమాన్యం కార్మిక చట్టాలను పట్టించుకోకుండా కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటున్నది.ఉద్యోగులను ఇష్టానుసారంగా తొలగిస్తున్నది.

గతంలో హెయిమెచెస్ట్ ఆల్ ఇండియా రిప్రజెంటేటివ్స్ కమిటీ (హెచ్ఏఐఆర్‌సీ)తో సనోఫి యాజమాన్యంతో చర్చించి చాలా సమస్యలను పరిష్కరించింది. అయినప్పటికీ కొన్ని నెలలుగా మళ్లీ ఉద్యోగులను తొలగిస్తుండటంతో రాష్ట్రంలోనూ ఆ సంస్థ ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టీఎంఎస్ఆర్‌యూ), ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఏఐ) ఆధ్వర్యంలో ధర్నా, సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎంఎస్ఆర్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాను కిరణ్ మాట్లాడుతూ సనోఫీ యాజమాన్యం నిర్దాక్షిణ్యంగా అర్థరాత్రి ఉద్యోగులను తొలగించిందని విమర్శించారు. ఎఫ్ఎంఆర్ఏఐ కార్యవర్గ సభ్యులు ఐ.రాజుభట్ మాట్లాడుతూ బీజేపీ కార్మికుల వ్యతిరేక పార్టీ అని విమర్శించారు.

ఆ పార్టీ తీసుకొస్తున్న లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా కార్మికసంఘాలు ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. సనోఫీ ఎంప్లాయీస్ రాష్ట్ర కన్వీనర్ సురేందర్ మాట్లాడుతూ తనను కూడా యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించిందనీ, తగిన రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు.

తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకపోతే ముంబయిలోని సంస్థ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీఎంఎస్ఆర్ యూ సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వర రావు, రాష్ట్ర నాయకులు జగదీష్ చారి, జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, సనోఫి కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వికాస్ లైఫ్‌కేర్ ఆగ్రో డివిజన్‌కు భారీ ఆర్డర్

Vikas Lifecare Ltd.

హైదరాబాద్ : రీసైక్లింగ్ ప్లాస్టిక్ రంగంలో ఉన్న వికాస్ లైఫ్‌కేర్ లిమిటెడ్ తన ఆగ్రో ప్రొడక్ట్స్ డివిజన్‌కు భారీ ఆర్డర్ దక్కినట్లు వెల్లడించింది. ప్రీమియం, ఆర్గానిక్ రైస్ సెగ్మెంట్‌లలో సుమారు రూ.50 కోట్ల విలువైన బియ్యం ఆర్డర్‌ను పొందినట్లు పేర్కొంది. ఇందులో రూ.40 కోట్ల విలువ చేసే ప్రీమియం బియ్యం రకాలను సరఫరా చేయాల్సి ఉందని పేర్కొంది. మిగిలిన రూ.10 కోట్ల ఆర్గానిక్ బ్రీడ్స్ ఆఫ్ రైస్ కోసం ఆర్డర్‌ను పొందినట్లు తెలిపింది. ఏడాదికేడాదితో పోల్చితే ఆ సంస్థ 20 శాతం వృద్ధిని అంచనా వేస్తోంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.360 కోట్ల రెవెన్యూ సాధించింది. ప్రస్తుత 2024-25లో రూ.450 కోట్ల రెవెన్యూను లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం సామర్థ్యాలు పెంచుకోవడం, మార్కెట్లను విస్తరించుకోవాలని నిర్దేశించుకుంది.

అలీగఢ్ వర్సిటీ వీసీగా నైమా ఖాతూన్

- ఎఎంయూ చరిత్రలో మొదటి ముస్లిం మహిళ



న్యూఢిల్లీ : అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఎఎంయూ) వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ నైమా ఖాతూన్ నియమితులయ్యారు. రాష్ట్రపతి ఆమోదించిన అనంతరం కేంద్ర విద్యాశాఖ ఆమెను వీసీగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆమె యూనివర్సిటీ విజిటర్‌గా ఉన్నారు.ఎఎంయూ 123 ఏండ్ల చరిత్రలో వీసీగా నియమితులైన మొదటి మహిళగా ఖాతూన్ చరిత్ర సృష్టించారు. బేగం సుల్తాన్ జహాన్ 1920లో ఎఎంయూ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. ఆ పదవిలో ఉన్న మొదటి, ఏకైక మహిళగా ఆమె నిలిచారు.ఖాతూన్ నియామకంతో మహిళా వైస్ ఛాన్సలర్‌లను కలిగిన మూడవ సెంట్రల్ యూనివర్సిటీగా ఎఎంయూ నిలిచింది. శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ ప్రస్తుతం జేఎన్‌యూ వైస్ ఛాన్సరల్ కాగా, నజ్మా అక్తర్ 2023లో జామియా మిలియా ఇస్లామియా వైస్ ఛాన్సలర్‌గా తన పదవి కాలాన్ని పూర్తి చేశారు. నైమా ఖాతూన్ 1988, ఆగస్టులో ఎఎంయూ లెక్చరర్‌గా తన వత్తి జీవితాన్ని ప్రారంభించారు. పదేండ్లకుపైగా అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2006లో ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. సైకాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్, చైర్‌పర్సన్‌గా పనిచేశారు. అనంతరం 2014 జులైలో మహిళా కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఎఎంయూలో వివిధ అడ్మినిస్ట్రేటివ్ పదవుల్లోనూ కొనసాగారు.విదేశీ యూనివర్సిటీల్లోనూ ఏడాది పాటు బోధన కొనసాగించారు. నైమా ఖాతూన్ పొలిటికల్ సైకాలజీలో పీహెచ్‌డీ పట్టా పొందారు. విదేశాల్లోని పలు యూనివర్సిటీల్లో తన పరిశోధనా ఫలితాలను సమర్పించారు. ఆమె క్లినికల్, హెల్త్, అప్లైడ్ సోషల్, స్పిరుచువల్ సైకాలజీల్లో ప్రావీణ్యం సంపాదించారు. ఆమె ఆరు పుస్తకాలను రచించారు.

నేటి నుంచి ముత్తినేని 'విజయ సంకల్ప యాత్ర'

- 'కరపత్రం' ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాన్ని ఆకాంక్షిస్తూ...టీపీసీసీ వికలాంగుల విభాగం చైర్మెన్ ముత్తినేని వీరయ్య బుధవారం నుంచి విజయసంకల్ప యాత్ర పేరుతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం తన నివాసంలో ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, పెరికల కులస్తుల సంక్షేమం కార్యక్రమాలను ప్రచారం చేస్తూనే...కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరనున్నట్టు ముత్తినేని తెలిపారు. ఆయా వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని తెలిపారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం గాంధీభవన్‌లో ప్రచార యాత్ర వాహనాన్ని ప్రారంభిస్తారు.

సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోవాలి

- కేంద్ర ఎన్నికల కమిషన్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగ విరుద్ధంగా, నర్మగర్భంగా అదే పనిగా దేవునిపై ప్రమాణం చేస్తూ ఎన్నికల హామీలిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రవర్తనా నియమావళితో పాటు ప్రజా ప్రతినిధుల చట్టం, 1951ను ఉల్లంఘిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ నేత దాసోజు శ్రవణ్ మంగళవారం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ట్వీట్ చేశారు. ఇంత జరుగుతున్నా... రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ప్రేక్షకునిగా చూస్తున్నారే తప్ప కేసు నమోదు చేయలేదనీ, చర్యలు తీసుకోలేదని తెలిపారు. జోక్యం చేసుకోకపోవడానికీ, నిర్లక్ష్యంగా ఉండటానికి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి, సీఎం రేవంత్ రెడ్డికి మధ్య ఏమైనా అనుబంధం ఉందా? అని ప్రశ్నించారు. ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆత్మహత్యలు చేసుకోవద్దు

- డాక్టర్ అశోక్ పరికిపండ్ల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చదువు జీవితంలో ఒక భాగమే కానీ, చదువే జీవితం కాదని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మెన్, సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. విద్యార్థులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. ఇంటర్మీడియట్ ఫలితాలు వెల్లడవుతున్న నేపథ్యంలో మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రుల అత్యాశ, పక్కవారితో పోల్చడం తదితర కారణాలతో విద్యార్థులు ఆత్మన్యూనతతో తాత్కాలిక ఆవేశానికి లోనై ఆత్మహత్యల దిశగా ఆలోచిస్తుంటారని హెచ్చరించారు. తల్లిదండ్రులు అలాంటి తప్పులు చేయవద్దని సూచించారు. హై స్కూలు స్థాయిలో ఇంగ్లీషు సబ్జెక్టులో ఫెయిల్ అయిన సచిన్ టెండూల్కర్ ప్రపంచంలోనే దిగ్గజ బ్యాట్స్‌మన్‌గా, ప్రముఖ క్రికెటర్‌గా అవతరించాడని పేర్కొన్నారు. ఆయన ఏదైతే ఇంగ్లీష్ సబ్జెక్టులో ఫెయిల్ అయినాడో అదే ఆంగ్లం సబ్జెక్టులోఆయన జీవితం ఒక పాఠంగా వచ్చిందని గుర్తుచేశారు. అనేక ప్రయత్నాల తర్వాతే థామస్ అల్వా ఎడిసన్ బల్బును కనిపెట్టారని తెలిపారు. అబ్రహాం లింకన్ అనేక పదవులకు వందల సార్లు పోటీ చేసి గెలుపొందకపోయినా పట్టు వదలకుండా పోరాడి చివరకు ఆ దేశ అధ్యక్షుడయ్యారని చెప్పారు. చదువంటే కేవలం మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదని తెలిపారు.